www.andhrajyothy.com
పేజీలు: 14
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 333
సోమవారం | 18-3-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 10.51 తదుపరి దశమి; నక్షత్రం: ఆర్ద్ర సా. 6.12 తదుపరి పునర్వసు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ. 12.48-1.36, మ. 3.11 తదుపరి 3.59; అమృతఘడియలు: ఉ. 7.37-9.18; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.25; సూర్యాస్తమయం: 6.23
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మన గెలుపు ఖాయం
రాష్ట్రంలో వేవ్ ఉంది

ప్రజాగళం సభ తర్వాత ప్రధాని మోదీ వ్యాఖ్య

బాబు, పవన్‌తో మాటామంతీ

'ప్రజాగళం' సభకు హాజరైన జనం.. మోదీ, చంద్రబాబు, పవన్ అభివాదం



ప్రజాగళ గర్జన!

'కూటమి' సభలో జన హోరు.. కార్యకర్తల్లో ఉరిమిన ఉత్సాహం

బొప్పూడిలో కిక్కిరిసిన సభా ప్రాంగణం

హైవేపై కిలోమీటర్ల మేర జనం

రాష్ట్రం నలుమూలల నుంచీ రాక

ప్రసంగాలకు జోరుగా స్పందన

సుమారు మూడువందల ఎకరాల ప్రాంగణం... జాతీయ రహదారిపై అటూఇటూ దాదాపు 20 కిలోమీటర్లు... ఎటు చూసినా జనం జనం... ప్రభంజనం! టీడీపీ- జనసేన - బీజేపీ కూటమి తొలి ఉమ్మడి సభ సూపర్‌హిట్ అయ్యింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఆదివారం నిర్వహించిన 'ప్రజాగళం' సభలో జన గర్జన వినిపించింది. ఉదయం నుంచే సభా ప్రాంగణానికి జనం రాక మొదలైంది. మధ్యాహ్నానికే మొత్తం మైదానం నిండిపోయింది. ఆపై జాతీయ రహదారి సైతం కనుచూపు మేర జనసంద్రంగా మారింది. యువకులు వృద్ధులు, మహిళలు, పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారూ కూటమి పార్టీల జెండాలతో బొప్పూడి వైపు కదిలారు. ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు రోడ్డంతా జనంతో నిండిపోయింది. వేలాదిమంది సభా ప్రాంగణానికి చేరుకోలేక.. వాహనాల్లోనే ఉండిపోయారు.

అభివృద్ధి ఆంధ్రా కోసం
ఓటెత్తండి!
ఏపీ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

అవినీతి సర్కారును అంతం చేయండి

ఐదేళ్లుగా అభివృద్ధి కుంటుపడింది

అవినీతి చేయడంలోనే మంత్రుల పోటీ

కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే సర్కారే

డబుల్ ఇంజన్ సర్కారుతో ప్రగతి పరుగులు

వికసిత్ భారత్, వికసిత్ ఏపీ మా లక్ష్యం

రాష్ట్రం కోసం చంద్రబాబు, పవన్ కృషి

కూటమి అభ్యర్థులనే గెలిపించండి

రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి

శనివారం ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. వెంటనే ఏపీకి వచ్చాను. ఈ రోజు కోటప్పకొండలోని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడి ఆశీర్వాదం లభించింది. ఈ ముగ్గురు దేవుళ్ల ఆశీర్వాదంతో మూడోసారి అధికారంలోకి వస్తాం. దేశాభివృద్ధి కోసం మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటాం. 'అభివృద్ధి ఏపీ'ని సాధిస్తాం. - ప్రధాని మోదీ

(బొప్పూడి సభాప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

వికసిత భారత్, అభివృద్ధి ఆంధ్ర కావాలంటే టీడీపీ - జనసేన - బీజేపీ కూటమినే గెలిపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఏపీలో ఎన్డీయే సర్కారు ఏర్పడాలని... రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో కూటమి ఎంపీలను పార్లమెంటుకు పంపించాలని కోరారు. రాష్ట్రంలో వైసీపీ అవినీతి సర్కారును

మిగతా 10వ పేజీలో...



పోలీసులు ఎక్కడ?

ప్రధాని పాల్గొన్న సభపైనా నిర్లక్ష్యం

ట్రాఫిక్ నియంత్రణ గాలికి

కిలోమీటర్ల కొద్దీ వాహనాలు

సభా ప్రాంగణంలో తొక్కిసలాట

'సౌండ్' స్టాండ్లపైకి ఎక్కిన జనం

ఆడియో కేబుల్ తెగి ఆగిన సౌండ్ సిస్టమ్

ప్రధాని ప్రసంగిస్తుండగానే అంతరాయం

అయినా పట్టించుకోని పోలీసులు

నిర్లక్ష్యం ఉద్దేశపూర్వకమనే అనుమానం

సమగ్ర కథనాలు 10, 11లో

కుప్పకూలిన రాష్ట్రాన్ని కలిసి నిలబెడతాం

కక్ష, విధ్వంసం, అవినీతి, దోపిడీలకు జగన్ పర్యాయ పదం

ఆయనకు ఓటేయొద్దని సొంత చెల్లెళ్లే పిలుపిస్తున్నారు

మూడు ముక్కలాటతో అమరావతిని సర్వనాశనం చేశాడు

ల్యాండ్, శాండ్, వైన్, మైన్ సహా దేనినీ వదిలిపెట్టకుండా దోపిడీ

యువత, రైతులు, పేదలు, మహిళలు తీవ్రంగా నష్టపోయారు

అప్పుల కోసం కలెక్టర్ ఆఫీసులు సహా అన్నీ తాకట్టు

రాష్ట్రం మరింత పతనం కాకుండా కాపాడుకోవాలి: చంద్రబాబు

కూటమిదే పీఠం

మోదీ రాక.. ఎన్డీయే పునఃకలయిక.. 5 కోట్ల మందికి ఆనందం

నేను దేవదత్తం పూరించా.. మోదీ పాంచజన్యం పూరిస్తారు

మద్యనిషేధం పేరుతో అధికారంలోకి.. గద్దెనెక్కాక సారా వ్యాపారం

పది వేల కోట్ల జీఎస్టీ మోసం.. ఇసుకలో 40 వేల కోట్ల దోపిడీ

పరిశ్రమలన్నీ ఏపీ నుంచి పరార్.. జగన్ సర్కార్‌పై పవన్ ధ్వజం



3

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

హాల్‌టికెట్ చూపిస్తే బస్సుల్లో ఉచిత ప్రయాణం

నేటి నుంచే ఒంటిపూట బడులు

ముగిసిన గ్రూప్1 ప్రిలిమ్స్

72.55 శాతం మంది హాజరు

మిశ్రమంగా ప్రశ్నలు 3

ఆ ఒక్కటీ తప్ప..

యునిక్ నంబర్ లేకుండా మరోసారి ఎన్నికల బాండ్ల సమాచారం

ఈసారి రాజకీయ పార్టీలు ఇచ్చిన వివరాలు వెల్లడించిన ఈసీ

బీజేపీకి రూ.6,986.5 కోట్లు.. టీఎంసీకి రూ.1,397 కోట్లు

కాంగ్రెస్‌కు రూ.1,334 కోట్లు.. బీఆర్ఎస్‌కు రూ.1,322 కోట్లు

ఏపీలో వైసీపీకి రూ.442.8 కోట్లు.. టీడీపీకి రూ.181.3 కోట్లు

దాతల వివరాలనూ వెల్లడించిన డీఎంకే, అన్నాడీఎంకే, జేడీఎస్

మేఘా బాండ్లు డీఎంకేకు రూ.105 కోట్లు, జేడీఎస్‌కు 50 కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 17: ఎన్నికల బాండ్లకు సంబంధించి రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టుకు గతంలో సీల్డ్ కవర్లలో సమర్పించిన వివరాలను.. ఎన్నికల కమిషన్ ఆదివారం తన వెబ్‌సైట్‌లో పెట్టింది. అయితే, ఈసారి కూడా ఇంతకుముందులాగానే యునిక్ నంబర్ లేకుండా వాటిని వెల్లడించడం గమనార్హం. ఈ వివరాలతో ఏ పార్టీకి ఎన్ని విరాళాలు వచ్చాయో తెలుస్తుందిగానీ.. ఆ విరాళాలు ఎవరిచ్చిందీ తెలిసే అవకాశం లేదు. ఆయా పార్టీలు సుప్రీంకోర్టుకు ఇచ్చిన వివరాల ప్రకారం.. బీజేపీ అందుకున్న మొత్తం ఎలక్టోరల్ బాండ్ల విలువ రూ.6,986.5 కోట్లు. అందులో దాదాపు రూ.2,555 కోట్లు 2019-20లో అందుకున్నవే. టీఎంసీ పార్టీ అందుకున్న బాండ్ల విలువ రూ.1,397 కోట్లు. బీజేపీ తర్వాత అత్యధికంగా

మిగతా 12వ పేజీలో...





రాజ్యాంగాన్ని మార్చే దమ్ము
బీజేపీకి లేదు

ఆ పార్టీదంతా హడావుడే.. ప్రజలు మావైపే

ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ లేకుండా..

ప్రధాని మోదీ ఎన్నికలకు వెళ్లలేరు

56 అంగుళాల ఛాతీ కాదు.. మోదీ డొల్ల మనిషి

2 పార్టీల పోరాటం కాదు.. సిద్ధాంతాల సమరం

బీజేపీది కేంద్రీకృత పాలన.. మాది వికేంద్రీకరణ

వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాలని కోరాం

కానీ, మా విజ్ఞప్తులను ఈసీఐ పట్టించుకోలేదు

ఐఐటీయన్ కంటే రైతు తెలివి తక్కువ వాడేం కాదు

భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ 12

ఈసీ వేట స్టార్ట్!

వైసీపీతో అంటకాగే అధికారులపై కఠిన చర్యలు



ఎస్ఐ, వీఆర్వో, ఇతరులపై క్రమశిక్షణా చర్యలు.. సస్పెన్షన్

త్వరలో మరికొందరిపైనా.. నిబంధనలు మీరేవారిపై నిఘా

ఫిర్యాదులపై తక్షణ చర్యలు.. కలెక్టర్లకు మరిన్ని ఆదేశాలు

అనుమతి లేని హోర్డింగులను తక్షణమే తీసేయండి

పోస్టర్లు, కటౌట్లను కూడా: సీఈవో ఆదేశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల కమిషన్ వేట మొదలుపెట్టింది. రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించిన ఎన్నికల సంఘం కీలక శాఖల అధికారులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. అధికారులుగా సర్వీసు నిబంధనలకు లోబడి ప్రభుత్వానికి, ప్రజలకూ జవాబుదారీగా ఉండాల్సిన వారు హద్దులు మీరి అధికార పార్టీ జెండాను భుజానేసుకొని తిరగడాన్ని ఈసీ అడ్డుకుంటోంది. అలాంటి పనులు ఇక చెల్లవంటూ క్రమశిక్షణా

మిగతా 12వ పేజీలో...

జగన్ 'బొమ్మ' తీయాల్సిందే!

ఎన్నికల అధికారులకు సవాల్.. ఎటు చూసినా సీఎం ఫొటోలు

సచివాలయాలు, పంచాయతీలు, ఆర్బీకే భవనాలపై వైసీపీ జెండా రంగులు రుద్దుడు

వైట్ వాష్ చేయాలంటే భారీ ఖర్చు.. ప్రభుత్వ పథకాలపైనా ముద్రణ 3

కోహ్లీ వచ్చేశాడు..



ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్వదేశంలో అడుగుపెట్టాడు. అతడి భార్య అనుష్క రెండో ప్రసవం కోసం ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ నుంచి వైదొలిగిన కోహ్లీ కొంతకాలంగా లండన్‌లోనే ఉంటున్న విషయం తెలిసిందే. ఈనెల 22 నుంచి ఐపీఎల్ ఆరంభం కానుండడంతో ఆదివారం అతను లండన్ నుంచి ముంబై విమానాశ్రయంలో దిగాడు. ఈ మేరకు ఓ వీడియోను స్టార్‌స్పోర్ట్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. విరాట్ త్వరలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు శిబిరంలో చేరే అవకాశం ఉంది.

ట్రయల్స్‌లో ధీరజ్ టాప్



సోనెపట్: ప్రపంచకప్, పారిస్ ఒలింపిక్స్ కోసం నిర్వహించిన ఆర్చరీ సెలెక్షన్ ట్రయల్స్‌లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ అదరగొట్టాడు. భారత్‌కు ఇప్పటికే ఒక ఒలింపిక్ కోటా అందించిన ధీరజ్.. ఆదివారం ఇక్కడ జరిగిన ట్రయల్స్‌లో పురుషుల రికర్వ్ విభాగంలో అగ్రస్థానంలో నిలిచాడు. టీమ్ ఈవెంట్‌లో ధీరజ్‌తో పాటు తరుణ్‌దీప్, ప్రవీణ్, మృణాల్ సత్తాచాటారు. ఇక, మహిళల రికర్వ్ విభాగంలో దీపికా కుమారి టాప్‌లో నిలవగా.. భజన్ కౌర్, అంకిత, కోమలిక టీమ్ ఈవెంట్‌లో రాణించారు. నాన్ ఒలింపిక్ కేటగిరి అయిన కాంపౌండ్ విభాగం నుంచి తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకుంది. ఈ ఏడాది వరల్డ్ కప్‌లో భాగంగా స్టేజ్-1 పోటీలు ఏప్రిల్ 21 నుంచి షాంఘై (చైనా)లో, స్టేజ్-2 ఈవెంట్ మే 21 ఇంచియాన్ (దక్షిణ కొరియా), స్టేజ్-3 పోటీలు జూన్ 18 నుంచి అంటాల్యా (టర్కీ)లో జరుగుతాయి. ట్రయల్స్‌లో సత్తా చాటిన ఆర్చర్లనే ఈ వరల్డ్ కప్ పోటీలకు ఎంపిక చేశారు.

ఎలిమినేటర్‌లో ఢిల్లీ X అహ్మదాబాద్

చెన్నై: అహ్మదాబాద్ డిఫెండర్స్, ఢిల్లీ తుఫాన్స్ జట్లు ప్రైమ్ వాలీబాల్ లీగ్ ఎలిమినేటర్‌లో ప్రవేశించాయి. ఆదివారం జరిగిన ఈ సీజన్ ఆఖరి సూపర్-5 మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టు 3-2తో కాలికట్ హీరోస్‌పై విజయం సాధించింది. అంతకుముందు జరిగిన నామమాత్రమైన సూపర్-5 మ్యాచ్‌లో ముంబై మీటియర్స్ 3-1తో ఢిల్లీ తుఫాన్స్‌పై నెగ్గింది. కాగా, ఎలిమినేటర్‌లో నెగ్గిన జట్టు.. ఇప్పటికే ఫైనల్ చేరిన కాలికట్ హీరోస్‌తో ట్రోఫీ కోసం తలపడనుంది. ఈనెల 19న ఎలిమినేటర్, 21న ఫైనల్ జరగనుంది.

ఈ సాలా కప్ నమ్దే.. అంటూ ఐపీఎల్ ఆరంభం నుంచి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అభిమానులు ట్రోఫీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎలాగైతేనేం.. ఇన్నాళ్లకు వారి కల తమ మహిళల జట్టుతో నెరవేరింది. ఫైనల్ ఒత్తిడిని తట్టుకుంటూ స్పిన్నర్లు శ్రేయాంక, మోలినెక్స్, ఆశా ఢిల్లీ బ్యాటర్లను కూల్చేయగా.. స్వల్ప ఛేదనలో ఆల్‌రౌండర్ ఎలిస్ పెర్రీ మరోసారి ఆపద్బాంధవ పాత్ర పోషించిన వేళ.. ఆర్సీబీ ఖాతాలో డబ్ల్యూపీఎల్ టైటిల్ చేరింది.



ఆర్సీబీదే అందలం

బెంగళూరుకు తొలి టైటిల్

ఫైనల్లో ఢిల్లీపై విజయం

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో నయా చాంపియన్. ఆదివారం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. దీంతో డబ్ల్యూపీఎల్‌లో తొలిసారి ఆర్సీబీ విజేతగా నిలిచింది. ఐపీఎల్‌లో ఇప్పటిదాకా టైటిల్ కల నెరవేరని ఈ ఫ్రాంచైజీకి మంధాన సేన ఆ కొరతను తీర్చింది. స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్ (4/12), మోలినెక్స్ (3/20), ఆశా శోభన (2/14) కలిసి ఢిల్లీ 9 వికెట్లు తీయడం విశేషం. కాగా, ఢిల్లీ వరుసగా రెండోసారీ రన్నరప్‌కే పరిమితం వడం గమనార్హం. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 18.3 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటైంది. షఫాలీ (44), లానింగ్ (23) మినహా అంతా విఫలమయ్యారు. ఏడుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఛేదనలో ఆర్సీబీ 19.3 ఓవర్లలో 2 వికెట్లకు 115 రన్స్ చేసి నెగ్గింది. ఎలిస్ పెర్రీ (35 నాటౌట్), సోఫీ డివైన్ (32), కెప్టెన్ మంధాన (31) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మోలినెక్స్ నిలిచింది.

ఆఖరి ఓవర్‌లో ముగించారు: ఛేదించాల్సింది స్వల్ప లక్ష్యమే అయినా ఆర్సీబీ పోరు ఆఖరి ఓవర్ వరకు సాగింది. దీనికి ఢిల్లీ కట్టుదిట్టమైన బౌలింగే కారణం. అయితే పెర్రీ ఒత్తిడిని అధిగమిస్తూ జట్టును విజయతీరాలకు చేర్చింది. ఓపెనర్లు మంధాన, డివైన్‌లకు ఆరంభంలో పరుగులు సాధించడమే కష్టంగా మారింది. వికెట్ పడకూడదనే కారణంతో డిఫెన్సివ్ ఆటతీరును కనబర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 25 పరుగులే చేసింది. అయితే ఏడో ఓవర్‌లో డివైన్ 4,4,6,4 బాదడంతో 18 రన్స్ వచ్చాయి. కాసేపటికే డివైన్‌ను శిఖా అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే మంధాన 15వ ఓవర్ వరకు క్రీజులో ఉన్నా మెరుపులు కనిపించలేదు. చివరకు గెలిపించే బాధ్యతను పెర్రీ తీసుకోగా, ఆమెకు మరో ఎండ్‌లో రిచా ఘోష్ (17 నాటౌట్) సహకరించింది. అయితే బంతికో పరుగు చొప్పున లక్ష్యం ఉండడంతో ఇరు జట్ల శిబిరాల్లో ఒత్తిడి నెలకొంది. 18, 19వ ఓవర్లలో పెర్రీ ఒక్కో ఫోర్ సాధించడంతో సమీకరణం చివరి ఓవర్‌లో ఐదు పరుగులకు మారింది. ఇందులో తొలి రెండు బంతులకు రెండు పరుగులు రాగా.. మూడో బంతిని రిచా ఫోర్‌గా మలచడంతో ఆర్సీబీ సంబరాలు ఆకాశాన్నంటాయి.

ప్రైజ్‌మనీ

ఆర్సీబీకి	రూ. 6 కోట్లు
ఢిల్లీకి	రూ. 3 కోట్లు

ఆరెంజ్ క్యాప్ (అత్యధిక రన్స్): ఎలిస్ పెర్రీ (347)

పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు): శ్రేయాంక పాటిల్ (13)

స్పిన్ ధాటికి విలవిల: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్ ఆరంభానికి ముగింపునకు సంబంధమే లేకుండా సాగింది. తొలి వికెట్‌కు ఓపెనర్లు షఫాలీ, లానింగ్ 64 రన్స్ సమకూరిస్తే.. బెంగళూరు స్పిన్నర్ల ప్రతాపానికి విగతా 49 పరుగుల్లోనే జట్టు మొత్తం కుప్పకూలింది. కానీ మొదట్లో షఫాలీ ఎదురుదాడికి ఓవర్‌కు పది పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లిన ఢిల్లీ పవర్‌ప్లేలోనే 61 రన్స్ సాధించింది. మూడో ఓవర్‌లో షఫాలీ సిక్సర్, లానింగ్ 2 ఫోర్లతో 19 రన్స్ సమకూరాయి. తర్వాత పెర్రీ ఓవర్‌లోనూ షఫాలీ 6,4తో ఆకట్టుకుంది. అయితే ఎనిమిదో ఓవర్‌లో మోలినెక్స్ 3 వికెట్లతో ఢిల్లీని చావుదెబ్బ తీసింది. తొలి బంతికే షఫాలీ, మూడు, నాలుగు బంతులకు జెమీమా (0), క్యాప్సీ (0) వెనుదిరిగారు. కుదురుకున్న లానింగ్‌ను శ్రేయాంక ఎల్బీ చేయడంతో భారీస్కోరుపై ఢిల్లీ ఆశలు వదులుకుంది. అటు టెయిలెండర్లను శ్రేయాంక చకచకా పెవిలియన్‌కు చేర్చడంతో తొమ్మిది బంతులుండగానే ఢిల్లీ ఆట ముగిసింది.

స్కోరుబోర్డు

ఢిల్లీ: లానింగ్ (ఎల్బీ) శ్రేయాంక 23, షఫాలీ (సి) వేర్హమ్ (బి) మోలినెక్స్ 44, జెమీమా (బి) మోలినెక్స్ 0, క్యాప్సీ (బి) మోలినెక్స్ 0, కాప్ (సి) డివైన్ (బి) శోభన 8, జొనాసెన్ (సి) మంధాన (బి) శోభన 3, రాధ (రనౌట్) 12, మిన్నూ మణి (ఎల్బీ) శ్రేయాంక 5, అరుంధతి (బి) శ్రేయాంక 10, శిఖా పాండే (నాటౌట్) 5, తానియా (సి) రిచా (బి) శ్రేయాంక 0, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 18.3 ఓవర్లలో 113 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-64, 2-64, 3-64, 4-74, 5-80, 6-81, 7-87, 8-101, 9-113, 10-113; **బౌలింగ్:** రేణుక 2-0-28-0, మోలినెక్స్ 4-0-20-3, పెర్రీ 2-0-14-0, డివైన్ 1-0-9-0, వేర్హమ్ 3-0-16-0, శ్రేయాంక 3.3-0-12-4, శోభన 3-0-14-2.

బెంగళూరు: స్మృతి మంధాన (సి) అరుంధతి (బి) మిన్ను 31, సోఫీ డివైన్ (ఎల్బీ) శిఖా పాండే 32, ఎలిస్ పెర్రీ (నాటౌట్) 35, రిచా ఘోష్ (నాటౌట్) 17; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 19.3 ఓవర్లలో 115/2; వికెట్ల పతనం:** 1-49, 2-82; **బౌలింగ్:** కాప్ 4-0-20-0, క్యాప్సీ 3-0-13-0, శిఖా పాండే 4-0-11-1, రాధా యాదవ్ 1-0-18-0, అరుంధతి 3.3-0-26-0, జొనాసెన్ 2-0-15-0, మిన్నూ మణి 2-0-12-1.

రన్నరప్ రష్మిక

వరల్డ్ టెన్నిస్ టూర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ఇండోర్‌లో జరిగిన ఫైనల్లో రష్మిక 3-6, 2-6తో దలీలా జాకుపోవిక్ (స్లోవేనియా) చేతిలో ఓడింది. శనివారం డబుల్స్ పోటీల్లో విజేతగా నిలిచిన రష్మిక ఆ తర్వాత అస్వస్థత కారణంగా రాత్రంతా ఆస్పత్రిలోనే ఉంది. ఆరోగ్యం సహకరించకపోయినా ఫైనల్ బరిలోకి దిగింది. కోర్టులో రష్మిక చురుగ్గా ఆడలేకపోయినా, ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వకుండా ఆడింది.

ఇంజెక్షన్లు తీసుకుని ఆడదామనుకున్నా..



న్యూఢిల్లీ: గతేడాది స్వదేశంలో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కేవలం నాలుగు మ్యాచ్‌లే ఆడాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కాలి చీలమండ గాయంతో మైదానం వీడిన తను ఇక టోర్నీలో బరిలోకి దిగలేదు. అయితే తిరిగి ఆడేందుకు తాను ఎంతగానో ప్రయత్నించినట్టు పాండ్యా వివరించాడు. 'చీలమండకి మూడు చోట్ల ఇంజెక్షన్లు వేయించుకున్నా. వాపు కారణంగా రక్తం కూడా తీయించుకున్నా. అయినా గాయం తీవ్రమైంది. కోలుకునేందుకు కనీసం 25 రోజుల విశ్రాంతి అవసరమని డాక్టర్లు చెప్పారు. అయితే పూర్తి వరల్డ్‌కప్ ఆడలేకపోయానన్న బాధ మాత్రం నన్ను తొలిచేస్తూనే ఉంది' అని పాండ్యా అన్నాడు.

గుల్వీర్ నయా రికార్డు

న్యూఢిల్లీ: ఆసియా క్రీడల కాంస్య పతక విజేత గుల్వీర్ సింగ్ 16 ఏళ్ల నాటి జాతీయ రికార్డును బద్దలుకొట్టి, చరిత్ర సృష్టించాడు. కాలిఫోర్నియాలో జరిగిన 10 వేల మీటర్ల రేసును 27 నిమిషాల 41.81 సెకన్లలో పూర్తి చేసి, రెండో స్థానంలో నిలిచాడు. గత రికార్డు సురేంద్ర సింగ్ పేరిట (28 ని, 02.89సె.) 2008లో నమోదైంది. అయితే, 27 నిమిషాల్లోపు పూర్తి చేస్తేనే అర్హత సాధించే అవకాశం ఉండడంతో గుల్వీర్ కొద్దిలో పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను చేజార్చుకున్నాడు.

ఊహాగానాలకు తెర

జట్టులో చేరిన శ్రేయాస్



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ జట్టులో చేరాడు. దాంతో.. వెన్ను సంబంధిత ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న అతడు ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం నగరానికి చేరుకున్న అయ్యర్..ఆదివారం జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. వెన్ను శస్త్రచికిత్స కారణంగా అయ్యర్ గతేడాది ఐపీఎల్‌లో ఆడలేదు. మరోవైపు ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో చేరాడు. 30 ఏళ్ల హెడ్ ఆరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్‌లో ఆడనున్నాడు.

ఆల్ ఇంగ్లండ్ విజేత మారిన్

బర్మింగ్‌హామ్: ఒలింపిక్ మాజీ చాంపియన్, వరల్డ్ నెం:5 కరోలినా మారిన్ (స్పెయిన్) మరోసారి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో మారిన్ 26-24, 11-1తో ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి, నాలుగో సీడ్ అకానె యమగూచి (జపాన్) రిటైరైంది. 2015లో తొలిసారి ఆల్ ఇంగ్లండ్ టైటిల్‌ను ముద్దాడిన మారిన్.. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ విజేతగా నిలిచింది. మలేసియా షట్లర్ల మధ్య జరిగిన తుది పోరులో జొనాథన్ క్రిస్టీ 21-15, 21-14తో ఐదో సీడ్ ఆంథోనీ సునిసుకాపై నెగ్గి పురుషుల సింగిల్స్ ట్రోఫీ అందుకున్నాడు.

బిజినెస్

21,750 దిగువన బేరిష్

(మార్చి 18-22 తేదీల మధ్య వారాని



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,527-21,917 పాయింట్ల మధ్యన కదలాడి 213 పాయింట్ల నష్టంతో 22,023 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21,750 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,869, 21,787, 20,502, 20,088 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,425 బ్రేక్‌డౌన్ స్థాయి: 21,625

నిరోధ స్థాయిలు: 22,225, 22,325, 22,425 (22,125 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 21,825, 21,725, 21,625 (21,925 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ		విజయవాడ	420
హైదరాబాద్	405	విశాఖపట్నం	425
18వ తేదీ		వరంగల్	407
చిత్తూరు	463		
గోదావరి	420	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	105
విశాఖపట్నం	103		



జోష్‌లో భారత వృద్ధి రేటు

పెట్టుబడులే ప్రధాన ఊతం.. మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి రేటుపై ప్రముఖ అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ప్రశంసల వర్షం కురిపించింది. ఈ వృద్ధి రేటు 2003-2007 మధ్య కాలంలో నమోదైన 8 శాతానికి పైగా వృద్ధి రేటును తలపిస్తోందని తెలిపింది. పెట్టుబడులే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. కొవిడ్‌తో ప్రైవేటు పెట్టుబడులు, వినియోగం నీరసించినా ప్రభుత్వ పెట్టుబడులు ఆర్థిక వ్యవస్థకు ఊతంగా నిలిచాయని పేర్కొంది. ప్రస్తుతం ప్రైవేటు పెట్టుబడులు కూడా ఊపందుకుంటున్నట్టు తెలిపింది. పట్టణ డిమాండ్‌తో పాటు ప్రస్తుతం గ్రామీణ డిమాండ్ కూడా ఊపందుకుంటున్నందున భారత జీడీపీ వృద్ధి రేటుకు ఢోకా ఉండదని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

పెరుగుతున్న పెట్టుబడులు: భారత్‌లో పెరుగుతున్న పెట్టుబడుల నిష్పత్తిని మోర్గాన్ స్టాన్లీ గుర్తు చేసింది. 2002-03లో జీడీపీలో 27 శాతంగా ఉన్న పెట్టుబడుల నిష్పత్తి 2007-08 నాటికి 39 శాతానికి పెరిగిన విషయాన్ని గుర్తు చేసింది. 2008 తర్వాత పెట్టుబడుల జోరు కొద్దిగా తగ్గినా ప్రస్తుతం, జీడీపీలో పెట్టుబడుల వాటా 34 శాతానికి పెరిగాయని పేర్కొంది. 2026-27 నాటికి ఇది మరింత పెరిగి 36 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. 2003-2008 మధ్య కాలంలో జీడీపీలో పొదుపు రేటూ 28 శాతం నుంచి 39 శాతానికి పెరిగినట్టు తెలిపింది. పెట్టుబడులు, ప్రభుత్వ ప్రోత్సాహంతో జీడీపీలో కంపెనీల లాభాల నిష్పత్తి 2020-23 మధ్య కాలంలో 1.1 శాతం నుంచి 5.4 శాతానికి పెరిగిన విషయాన్ని మోర్గాన్ స్టాన్లీ గుర్తు చేసింది.

భారత్‌లో పెట్టుబడులపై స్విస్ కంపెనీల ఆసక్తి

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌కు చెందిన అనేక కంపెనీలు భారత్‌లో పెట్టుబడుల పట్ల ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. వాటిలో చాక్లెట్ల తయారీలోని బారీ కాలిబాట్ గ్రూప్‌తో పాటు వ్యవసాయ టెక్నాలజీ గ్రూప్ బూహ్లర్ వంటివి ఉన్నాయి. హెస్ గ్రీన్ మొబిలిటీ కంపెనీ 2025 నాటికి దేశంలో 11 కోట్ల డాలర్ల పెట్టుబడితో 3,000 విద్యుత్ బస్సుల తయారీ లక్ష్యంగా పెట్టుకున్నదని స్విస్ ఆర్థిక వ్యవహారాల మంత్రి హెలెన్ బుడ్లిగర్ చెప్పారు. బారీ కాలిబాట్ దేశంలో మూడో చాక్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గత ఐదేళ్లలో ఈ కంపెనీ 5 కోట్ల డాలర్లకు పైగా ఇన్వెస్ట్ చేసిందని వెల్లడించారు. దేశంలో ప్రవేశించి 30వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్న బూహ్లర్ గ్రూప్ 2.3 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్టు తెలిపారు. ఇవికాకుండా ఇంకా ఎన్నో స్విస్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

అదానీ గ్రూప్ పెట్టుబడుల జోరు

2024-25లో రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పెట్టుబడుల జోరు పెంచుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో అదానీ గ్రూప్ కంపెనీలు వివిధ రంగాల్లో 1,400 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.2 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 40 శాతం ఎక్కువ. కొత్త పెట్టుబడుల్లో 70 శాతం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో, మిగతా 30 శాతం విమానాశ్రయాలు, ఓడరేవుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెడతారని భావిస్తున్నారు.

రూ.41,000 కోట్లు తగ్గిన ఫ్లిప్‌కార్ట్ వాల్యుయేషన్

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం 'ఫ్లిప్‌కార్ట్' విలువ గత రెండేళ్లలో 500 కోట్ల డాలర్లు (సుమారు రూ.41,000 కోట్లు) తుడిచి పెట్టుకుపోయింది. ఫ్లిప్‌కార్ట్ మాతృ సంస్థ 'వాల్‌మార్ట్' ఈ విషయం తెలిపింది. 2022 జనవరి 31 నాటికి 4,000 కోట్ల డాలర్లు ఉన్న ఫ్లిప్‌కార్ట్ విలువ ఈ ఏడాది జనవరి నెలాఖరు నాటికి 3,500 కోట్ల డాలర్లకు పడిపోయినట్టు వెల్లడించింది. ఫిన్‌టెక్ కంపెనీ 'ఫోన్‌పే'ను ఫ్లిప్‌కార్ట్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడదీయడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. అయితే ఫ్లిప్‌కార్ట్ వర్గాలు మాత్రం కంపెనీ విలువ ఇప్పటికీ 3,800 కోట్ల డాలర్ల నుంచి 4,000 కోట్ల డాలర్ల మధ్య ఉంటుందని తెలిపాయి. 2022 ఆర్థిక సంవత్సరంలో వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ ఈక్విటీలో 8 శాతం వాటాను 320 కోట్ల డాలర్లకు విక్రయించింది. ఈ లెక్క ప్రకారం చూసినా ఫ్లిప్‌కార్ట్ విలువ 4,000 కోట్ల డాలర్లకు చేరువలో ఉంటుందని పేర్కొన్నాయి.

బీమా పాలసీల మోసపూరిత అమ్మకాలు ఆపండి

పీఎస్‌బీలకు ఆర్థిక సర్వీసుల శాఖ సూచన

న్యూఢిల్లీ: బీమా పాలసీల మోసపూరిత అమ్మకాలను నిలువరించి ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడాలని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)కు ఆర్థిక శాఖ సూచించింది. ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి వివేక్ జోషీ ఈ విషయం చెబుతూ బీమా పాలసీల విక్రయంలో మోసపూరిత, అనైతిక విధానాలు అనుసరిస్తున్నారన్న ఫిర్యాదులు తమకు నిరంతరం అందుతూనే ఉన్న నేపథ్యంలో బ్యాంకులకు ఈ సూచన చేసినట్టు తెలిపారు. బ్యాంకు కస్టమర్ల నుంచి పాలసీలు చేయించడం కోసం జీవిత బీమా కంపెనీలు, బ్యాంకులు కూడా ఈ తరహా విధానాలు అనుసరిస్తున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని ఆయన అన్నారు. కస్టమర్లు ఏదైనా రుణం తీసుకునేందుకు, టర్మ్ డిపాజిట్ చేసేందుకు బ్యాంకుకు వెళ్లిన సమయంలో వారికి పాలసీలు అంటగడుతూ ఉంటారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 75 సంవత్సరాల వయసు పైబడిన కస్టమర్లకు కూడా జీవిత బీమా పాలసీలు అంటగట్టిన సందర్భాలున్నాయని తేలింది. పాలసీ తీసుకునే విషయంలో కస్టమర్లు ప్రతిఘటించినా తమకు పై నుంచి ఒత్తిడులు వస్తున్నట్టు బ్యాంకు అధికారులు చెబుతున్న విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ఇలాంటి ధోరణులపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) అభ్యంతరం ప్రకటించింది. బీమా ఉత్పత్తులు విక్రయించినందుకు ప్రోత్సాహకాలివ్వడం వల్ల బ్యాంక్ సిబ్బందిపై ఒత్తిడి పెరగడంతో పాటు ప్రధాన వ్యాపార లక్ష్యం దెబ్బ తింటుందని వ్యాఖ్యానించింది.

22,000 పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 22,500 వద్ద కరెక్షన్‌లో ప్రారంభమై కీలక స్థాయి 22,000 వరకు దిగజారి వారం మొత్తం మీద 470 పాయింట్ల నష్టంతో అదే స్థాయికి సమీపంలో ముగిసింది. నిఫ్టీ ఈ మద్దతు స్థాయి కన్నా పైన ముగిసినప్పటికీ సానుకూలత కోసం మార్కెట్ ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఈ కారణంగా స్వల్పకాలిక దిశకు ఈ వారం కీలకం. ప్రస్తుత ర్యాలీలో భారీగా నష్టపోయిన వారం ఇదే. గత వారం మిడ్‌క్యాప్ సూచీ 2,300 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 460 పాయింట్ల నష్టంతో ముగిసింది. ప్రపంచ మార్కెట్ల తీరు ఆధారంగా ఈ వారంలో మార్కెట్ అప్రమత్తంగానే ప్రారంభం కావచ్చు. ఈ కారణంగా మానసిక అవధి 22,000 వద్ద పరీక్ష తప్పదు.

బుల్లిష్ స్థాయిలు: రికవరీ బాట పట్టినట్టయితే సానుకూలత కోసం మార్కెట్ 22,160 కన్నా పైన పటిష్ఠంగా ముగియడం తప్పనిసరి. ఆ పైన స్వల్పకాలిక నిరోధ స్థాయి 22,300. మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 22,550.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 22,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,750. ఇక్కడ కూడా విఫలమైతే ఇంకా బలహీనపడవచ్చు. స్వల్పకాలిక ప్రధాన మద్దతు స్థాయి 21,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 48,000 స్థాయిలో కరెక్షన్ సాధించి వారాంతానికి 46,600 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద 1,250 పాయింట్లు నష్టపోయింది. 48,000 వద్ద నిలదొక్కుకోలేకపోవడం మరింత అప్రమత్త ధోరణిని సూచిస్తోంది. రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 47,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 46,300 వద్ద విఫలమైతే మరింత బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 45,500.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక చలన సగటు స్థాయిల కన్నా స్వల్పంగా దిగువన ఉంది. ఇది అప్రమత్త సంకేతం. 22000 వద్ద గతంలో "డబుల్ బాటమ్ పాటర్న్" ఏర్పడింది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 22000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,100, 22,160
మద్దతు	21,950, 21,860

www.sundartrends.in

ఆటుపోట్లు తప్పవు..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం ఆటుపోట్లలో సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్ నిఫ్టీలో పుల్ బ్యాక్ ర్యాలీ కనిపిస్తున్నా మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు మాత్రం ఠారెత్తిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటం, ఆసియా, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు లేకపోవటంతో పాటు దేశీయ మార్కెట్లో నెగిటివ్ సెంటిమెంట్ ఉండటంతో సూచీలు ఒడుదుడుకుల్లో సాగే వీలుంది. మదుపరులు ఆచితూచి ఎంపిక చేసిన షేర్లను మాత్రమే కొనుగోలు చేయటం మంచిది. నష్టభయాన్ని అంచనా వేసుకుని తప్పనిసరిగా స్టాప్‌లాస్ పెట్టుకుని మాత్రమే ట్రేడింగ్ చేయాలి. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్ మద్దతు 21,900, నిరోధ స్థాయి 22,200 వద్ద ఉన్నాయి. గత వారం ఐటీ వినహా అన్ని రంగాల షేర్లు పతనమయ్యాయి.

స్టాక్ రికమండేషన్స్

హిండాల్కో: ఈ మెటల్ కంపెనీ షేరు ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉంది. భారీ పతనం తర్వాత బేస్ ఏర్పడుతోంది. చివరి రెండు సెషన్లలో ఈ షేరు భారీగా లాభపడింది. బ్రోకరేజీ సంస్థలు 'బై' రేటింగ్ ఇచ్చాయి. గత శుక్రవారం ఈ షేరు రూ.532 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.500/520 శ్రేణిలో ప్రవేశించి రూ.585 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.485 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కొచ్చిన్ షిప్‌యార్డ్: మార్కెట్లో బేరిష్ ట్రెండ్ ఉన్నప్పటికీ చివరి రెండు సెషన్లలో ఈ కౌంటర్ బలంగా పుంజుకుంది. ఏకంగా 20 శాతం మేర పెరిగింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ ఐదు రెట్లు పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు 11.53 శాతం లాభంతో రూ.897 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.880 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.850 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్గేట్ పామోలివ్: సుదీర్ఘకాలంగా ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. గత శుక్రవారం ఈ షేరు ఆల్‌టైమ్ హై రూ.2,698 స్థాయిని అధిగమించి రూ.2,728 వద్ద ముగిసింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ బాగా పెరుగుతోంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,700 స్థాయిల్లో ప్రవేశించి రూ.2,850/2,990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,645 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

నాట్కో ఫార్మా: స్వల్పకాల అప్‌ట్రెండ్ తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరుగుతోంది. ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.955 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.900/940 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రిలాక్సో ఫుట్‌వేర్: ఈ కౌంటర్‌లో చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. గత వారం ఈ షేరు నెల గరిష్ఠాన్ని అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 11 శాతం లాభంతో రూ.890 వద్ద క్లోజైంది. ఐదు రోజుల సగటును పరిశీలిస్తే వాల్యూమ్ ఏడు రెట్లు పెరిగింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.850 స్థాయిల్లో ప్రవేశించి రూ.990/1,060 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.815 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- రాష్ట్రంలో 7.25 లక్షల మంది విద్యార్థులు
- 3,473 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- హాల్‌టికెట్ చూపిస్తే బస్సుల్లో ఉచిత ప్రయాణం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30వ తేదీతో పరీక్షలు ముగుస్తాయి. పరీక్షల ఏర్పాట్లపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ ఆదివారం ఆర్జేడీలు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. మొత్తం 7,25,620 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు 6,23,092 మంది, రీఎన్‌రోల్ అయిన వారు 1,02,528 మంది ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 3,17,939 మంది బాలురు, 3,05,153 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,473 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో హాల్‌టికెట్లు చూపించి విద్యార్థులు ఉచితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

నేటి నుంచే ఒంటిపూట బడులు

రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్నాయి. అన్ని పాఠశాలల్లో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో పరీక్షల రోజుల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు ఉంటాయి.

ముగిసిన గ్రూప్-1 ప్రిలిమ్స్

- 72.55 శాతం హాజరు.. మిశ్రమంగా ప్రశ్నాపత్రం

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 18 జిల్లాల్లో 301 కేంద్రాల్లో ఆదివారం ప్రాథమిక పరీక్ష జరిగింది. మొత్తం 1,48,881 మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోగా, 1,26,068 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వారిలో 91,463 (72.55 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కఠినంగా, సులభంగా కాకుండా మిశ్రమంగా ఉందని అభ్యర్థులు తెలిపారు. అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలు మరీ కఠినంగా లేవని, పాలిటీలో మాత్రం లోతైన ప్రశ్నలు ఇచ్చారని చెప్పారు. హిస్టరీ, జాగ్రఫీలోనూ ప్రశ్నలు కొన్ని కఠినంగా, కొన్ని సులభంగా ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన గ్రూప్2 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా రావడంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేసిన నేపథ్యంలో గ్రూప్-1 విషయంలో ఏపీపీఎస్సీ కఠిన వైఖరిని వీడినట్టు తెలుస్తోంది. అలాగే జగన్ ప్రభుత్వాన్ని ప్రశంసించే ప్రశ్నలు కూడా ఇందులో లేకుండా జాగ్రత్తపడ్డారు.

అండర్‌వేర్‌లో మొబైల్‌తో పరీక్షకు

- కాపీకి పాల్పడుతుండగా పట్టివేత

ఒంగోలు (క్రైం), మార్చి 17: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో సెల్‌ఫోన్‌తో కాపీయింగ్ చేస్తూ ఓ అభ్యర్థి దొరికిపోయాడు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని క్విస్ కాలేజీ సెంటర్‌లో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు బేస్తవారపేటకు చెందిన బాలశివ శంకర్ హాజరయ్యాడు. పోలీసులు తనిఖీ చేసిన అనంతరమే కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించినప్పటికీ వారి కళ్లుగప్పి మొబైల్ ఫోన్‌తో లోపలికి వెళ్లాడు. మొబైల్ సహాయంతో పరీక్ష రాస్తున్న సమయంలో ఇన్విజిలేటర్ గుర్తించి ఫోన్ స్వాధీనం చేసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు సిబ్బందితో పరీక్షా కేంద్రానికి చేరుకొని బాలశివశంకర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాలశివశంకర్ సెల్‌ఫోన్‌ను అండర్ వేర్‌లో పెట్టుకొని పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించినట్లు విచారణలో తెలిసిందన్నారు. అతనిపై మాల్‌ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా రూపొందించడంతో మెయిన్స్‌కు 1:50కి బదులుగా 1:100 ఎంపిక చేయాలని అభ్యర్థులు ఏపీపీఎస్సీని కోరుతూ వచ్చారు. దీనిని సమీక్షిస్తామని హామీ ఇచ్చిన ఏపీపీఎస్సీ మెయిన్స్‌కు నిష్పత్తిని మార్చింది.

జగన్ 'బొమ్మ' తీయాల్సిందే!

ఎన్నికల అధికారులకు సవాల్.. ఎటు చూసినా సీఎం ఫొటోలు.. వైసీపీ జెండా రంగులే

- సచివాలయాలు, పంచాయతీలు ఆర్బీకే భవనాలపై రుద్దుడు
- వైట్ వాష్ చేయాలంటే భారీ ఖర్చు
- ప్రభుత్వ పథకాలపైనా ముద్రణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఎటు చూసినా జగన్ బొమ్మలు, వైసీపీ జెండా రంగులే. పంచాయతీ కార్యాలయాలు, ఆర్బీకేలు, గ్రామ, వార్డు సచివాలయాల భవనాలకు పార్టీ 'రంగు' వేశారు. ప్రభుత్వ పథకాలపై జగన్ ఫొటోలు వేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పుడు నిబంధనల ప్రకారం వీటన్నింటినీ తొలగించాలి. సార్వత్రిక ఎన్నికలకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో దేశ వ్యాప్తంగా కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే మన రాష్ట్రంలో కోడ్ అమలు చేయడం ఎన్నికల అధికారులకు సవాలుగా మారింది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సచివాలయాల భవనాలకు వైసీపీ రంగులు, ఆ పార్టీ గుర్తులు తొలగించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు. పలువురు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడంతో స్థానిక సంస్థల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా జరిగింది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ రంగుల పిచ్చికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ప్రతి చోటా జగన్ బొమ్మతో పాటు నీలి, ఆకుపచ్చ రంగులు వేయడం సర్వ సాధారణంగా మారిపోయింది. ప్రభుత్వ ఆస్తులను కూడా వదలలేదు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశాలతో ఆదివారం అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల్లో సిబ్బంది ప్రభుత్వ ఆస్తులపై ఉన్న ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు తదితర ప్రచార సామగ్రిని తొలగించారు. అయితే జగన్ బొమ్మలు, వైసీపీ రంగులు తొలగించాలంటే మరో 'బడ్జెట్' అవసరమయ్యే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గతంలో కోర్టు ఆదేశించినా సచివాలయాలు, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలలకు వైసీపీ రంగులను తొలగించలేదు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో సచివాలయాల భవనాలకు వైసీపీ రంగులు అలానే ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే బొమ్మలను సైతం సచివాలయ భవనాలకు వేశారు. వాటన్నింటినీ ఇప్పటికిప్పుడు తొలగించాలంటే చాలా ఖర్చు అవుతుంది. గ్రామాలు, పట్టణాల్లో ఇతర పార్టీలకు అవకాశం ఇవ్వకుండా అధికార వైసీపీ ప్రచార జెండాలే కనిపిస్తున్నాయి. ఇతర పార్టీలు ఏవైనా జెండాలు గాని, ఫ్లెక్సీలు గాని కడితే వాటిని ఎప్పటికప్పుడు తీసేసేవారు. అధికార పార్టీ జెండాలు మాత్రమే కట్టినవి కట్టినట్లు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జెండా లు, ఫ్లెక్సీలు అయితే తీసేయగలిగారు. కానీ అన్ని చోట్లా జగన్ బొమ్మలు, వైసీపీ రంగులు తొలగించడం సాధ్యమయ్యేనా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల పంచాయతీలు, సచివాలయ భవనాలకు వైసీపీ రంగులు ఉన్నాయి. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో చెత్తకుండీలు, వాహనాలు, తోపుడు బండ్లు, రిక్షాలు, వాటర్ ట్యాంక్‌లకు సైతం వైసీపీ రంగులు వేశారు. విద్యుత్ స్తంభాలకు సైతం వైసీపీ రంగులు వేశారు. వాటిని చెరిపేయాలంటే రంగులు వేయాల్సిందే. అలాగే పలు సంక్షేమ పథకాలకు సంబంధించి జగన్ బొమ్మలు, వైసీపీ రంగులు తొలగించాలి. అంగన్వాడీలు, పాఠశాల పిల్లలకు చిక్కీలు సరఫరా చేసే కవర్ కూడా జగన్ బొమ్మ, వైసీపీ రంగులతో ఉంది. చిక్కీపైన ఉన్న కవర్ చించి చిక్కీలు మాత్రమే పంపిణీ చేయాలని అధికారులు కింది స్థాయి ఉద్యోగులకు సూచించారు. ఇటీవల గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్ల ద్వారా ఎక్కడంటే అక్కడ స్టిక్కర్లు వేయించారు. కొన్ని చోట్ల మున్సిపాలిటీ సిబ్బంది తొలగించినా వైసీపీ కార్యకర్తలు మళ్లీ అతికిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటోలు ఉన్నాయి. వాటిని తొలగించాలని ఆయా శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారమిచ్చారు. అయితే ఇంకా కొన్ని కార్యాలయాల్లో జగన్ బొమ్మను తొలగించే సాహసం చేయలేకపోతున్నారు. రాష్ట్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలను వైసీపీ రంగులతో ముంచెత్తారు. వాటికి వైట్ వాష్ వేయాలంటే వ్యయంతో కూడిన పని అని అంటున్నారు.



ఏపీపీఎస్సీ మూగనోము!

- గ్రూప్-1 అక్రమాలపై నోరుమెదపని కమిషన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీపీఎస్సీ మూగనోము పట్టింది. 2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దుచేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించిన తర్వాత మౌనముద్ర దాల్చింది. కమిషన్ తీరును ప్రతిపక్షాలు, నిరుద్యోగులు ఎండగడుతున్నా 'మాకేం వినపడదు' అన్నట్టుగా కనీసం స్పందించలేని దుస్థితిలో పడిపోయింది. సాధారణంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఏ చిన్న ఆరోపణ, విమర్శ వచ్చినా ఏపీపీఎస్సీ వెంటనే స్పందిస్తుంది. ఆరోపణలపై వివరణ ఇచ్చి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తుంది. తద్వారా భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలపై నిరుద్యోగులకు భరోసా కల్పిస్తుంది. కానీ కీలకమైన గ్రూప్-1 మెయిన్స్ పేపర్లను అడ్డగోలుగా నచ్చినన్నిసార్లు మూల్యాంకనం చేసుకున్న ఏపీపీఎస్సీ ఆ వ్యవహారం బయటపడటంతో ఆత్మరక్షణలో పడిపోయింది. పరీక్ష రద్దుచేస్తూ తీర్పు వెలువడిన రోజున మాత్రం 'హైకోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్తాం' అని ఒక్కమాటలో ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకొంది. అసలు మూల్యాంకనంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఏపీపీఎస్సీ వాదిస్తోంది. ఒకవేళ అదే నిజమైతే ఏం జరిగిందో ఇప్పటికే ప్రజలకు వివరించాలి. జవాబుపత్రాలను రెండుసార్లు మూల్యాంకనం చేసినట్లు ఆధారాలతో సహా అభ్యర్థులు కోర్టు ముందుంచారు. రెండుసార్లు మాన్యువల్‌గా మూల్యాంకనం చేశారని హైకోర్టు తీర్పులో పేర్కొనగా, ఒక్కసారే చేశామని ఏపీపీఎస్సీ అంటోంది. ఆ మేరకు హైకోర్టులో అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. పైగా దీనిపై పిటిషనర్లు ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని వాదించింది. తీరా హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం చేసినట్లుగా ఆధారాలు చూపించడంతో మౌనం వహించింది. ఇప్పటికీ అంతా సక్రమమే అని చెబుతున్న ఏపీపీఎస్సీ.. అసలేం జరిగిందనేది మాత్రం రహస్యంగానే ఉంచుతోంది.

అన్నీ అనుమానాలే

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించారు. ఏపీపీఎస్సీలో పనిచేసే ఉద్యోగులు, వారి సన్నిహితులు అందులో టాపర్లుగా నిలవడం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. ఆ విషయంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కేసులు పెడతామని ఏపీపీఎస్సీ నానా హడావిడి చేసింది. నాలుగో తరగతి కంటే తక్కువైన ఉద్యోగాలపై అంత వేగంగా స్పందించిన కమిషన్.. కీలకమైన గ్రూప్-1 ఉద్యోగాల అంశంలో ఇప్పుడెందుకు స్పందించడం లేదని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మరీ అక్రమాలు జరిగిన తీరును వివరించారు. నిరుద్యోగులు రోడ్డెక్కి దీనిపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా తమకేం సంబంధం లేదన్నట్టు ఏపీపీఎస్సీ వ్యవహరిస్తోంది. రాజ్యాంగబద్ధ సంస్థ అయినా ఏపీపీఎస్సీ అధికార పార్టీ చెప్పినట్లు వినే సంస్థగా మారిపోయిందన్న విమర్శలున్నాయి. గ్రూప్-1 పరీక్షల ఫలితాలు ప్రకటిస్తున్న కమిషన్.. మార్కులను గోప్యంగా ఉంచడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

- 400 మందిని మోసం చేసిన పీలేరు యువకుడు
- రూ.10 కోట్ల వరకు దోచేశాడని బాధితుల ఆరోపణ
- బాధితుల్లో రెండు తెలుగు రాష్ట్రాల నిరుద్యోగులు



పీలేరు పోలీసుస్టేషన్ ముందు బాధితులు, (ఇన్‌సెట్‌లో) నిందితుడు రెడ్డి సూర్యప్రసాద్

పీలేరు, మార్చి 17: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇస్తానంటూ మాయ మాటలు చెప్పిన ఓ యువకుడిని నమ్మి తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 400 మంది నిరుద్యోగులు మోసపోయిన ఉదంతం ఆదివారం అన్నమయ్య జిల్లా పీలేరులో వెలుగు చూసింది. నిందితుడిని పీలేరు వాసిగా గుర్తించి, తమకు న్యాయం చేయాలని వారు ఆదివారం పీలేరు పోలీసులను ఆశ్రయించారు. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన రెడ్డి సూర్యప్రసాద్ అలియాస్ భరత్ అనే యువకుడు తనకు హైదరాబాద్‌లో సినర్జటిక్స్ అనే ఐటీ సంస్థ ఉందని, అందులో ఉద్యోగాల కోసం ఉద్యోగార్థులు కావాలని ఆన్‌లైన్‌లోని పలు కన్సల్టెన్సీలను ఎనిమిది నెలల క్రితం సంప్రదించాడు. ఆ కన్సల్టెన్సీల నిర్వాహకులు తనకు పంపిన నిరుద్యోగుల బయోడేటాల ఆధారంగా వారిని సంప్రదించి, తన సంస్థలో ఆన్‌లైన్‌లో పనిచేసే ఉద్యోగాలు ఉన్నాయని, డిపాజిట్‌గా కొంత సొమ్ము చెల్లిస్తే నెలకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు జీతాలు చెల్లిస్తామని ఆశ చూపాడు. దీంతో రాష్ట్రంలోని అనంతపురం, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, కడప, గుంటూరు, తెలంగాణలోని హైదరాబాదు ప్రాంతాలకు చెందిన వారు డబ్బులు చెల్లించి ఉద్యోగాలు పొందారు. మొదటి రెండు నెలలు సరిగ్గా జీతాలు చెల్లించడంతో అటు కన్సల్టెన్సీ నిర్వాహకులు, ఇటు ఉద్యోగాలు పొందిన వారు.. తమ బంధువులు, స్నేహితులు, పరిచయస్థులు, తోటి నిరుద్యోగులకు చెప్పి డబ్బు చెల్లించి ఆఫర్ లెటర్లు పొందారు. సాధారణ ఐటీ సంస్థల్లో ఉండే విధంగా అన్ని లాంఛనాలు పాటించడంతో అతడిపై మొదట్లో ఎవరికీ అనుమానం రాలేదు. అలా రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 400 మంది వద్ద.. ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వరకు వసూలు చేశాడు. రెండు నెలల తరువాత జీతాల చెల్లింపులో ఆలస్యం జరగడం, పలుమార్లు ఫోను చేసినా అతడు స్పందించకపోవడంతో అనుమానం మొదలైంది. తాము డబ్బులు వేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా పీలేరుకు చెందిన రెడ్డి సూర్యప్రసాద్ అలియాస్ భరత్‌గా గుర్తించారు. శనివారం పీలేరుకు వచ్చి జరిగిన మోసాన్ని అతడి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు బుకాయించడంతో శనివారం పీలేరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారు భరత్ తండ్రిని స్టేషన్‌కు పిలిపించి.. భరత్‌ను వెంటనే పిలిపించాలని ఆదేశించగా, ఆయన అంగీకరించాడు. తీరా ఆదివారం నుంచి పత్తాలేకుండాపోయాడు. ఫోను చేసినా స్పందించడం లేదని బాధితులు తిరిగి స్టేషనుకు వెళ్లారు. ఈ విషయమై పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పీలేరు యువకుడు మోసం చేసిన విషయాన్ని అతడి తండ్రికి వివరించి.. నిరుద్యోగులపట్ల మానవతాదృక్పథంతో వ్యవహరించి డబ్బులు తిరిగిచ్చేయాలని సూచించామని తెలిపారు. అలాగే, నేరం జరిగిన చోటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితులకు సూచించారు. బాధితులు మాత్రం అతడు దొరికేంత వరకు పీలేరులోనే ఉంటామని భీష్మించుకున్నారు.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ శ్రీనివాస రెడ్డి

శ్రీవారి సేవలో జస్టిస్ శ్రీనివాస రెడ్డి

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు.

శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆఫ్‌లైన్ కోటా పెంపు


శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు అందజేసే దాతలకు ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల ఆఫ్‌లైన్ కోటాను పెంచుతూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. ప్రజాప్రతినిధుల సిఫారసులు రద్దయిన నేపథ్యంలో ఆదివారం నుంచి ఈ కోటాను పెంచింది.

కోడ్ కూసినా.. వైసీపీ సేవలో వలంటీర్లు


వైసీపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వలంటీర్లు రాముడు, సుధాకర్ (వృత్తాల్లో ఉన్న వ్యక్తులు)

బొమ్మనహాళ్, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా.. వలంటీర్లు వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామంలో ఆదివారం వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవం లో హరేసముద్రం, గోవిందువాడ, దేవగిరి గ్రామాల వలంటీర్లు పాల్గొన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. రాజకీయ కార్యక్రమంలో పాల్గొనకూడదని వలంటీర్లను హెచ్చరించామన్నారు.





వివిధ


వేదనామయ జగత్తులో ప్రార్థన

ఫాల్గుణ మాసం నడుస్తోంది. ఉదయపు గాలుల్లో చలిపొడ పూర్తిగా తప్పుకుని, వేడి తెలుస్తోంది. మార్నింగ్ స్కూళ్ళూ, పరీక్షల కోసం ముందే వచ్చేసే స్కూల్ బస్సులూ, ఆఫీసుల కోసం ఏడింటికల్లా అపార్ట్‌మెంట్‌ల నుండి చీమలబారుల్లా బయటకొచ్చేస్తున్న కార్లూ, రయ్యిరయ్యిన దూసుకుపోయే డెలివరీ అబ్బాయిల బళ్ళూ అన్నీ కలిసి నగర జీవితపు రద్దీనంతా ఉదయాల్లోకి ఒంపుతున్నాయి. అట్లాంటి ఒక హడావుడి ఘడియలోనే నా బాల్కనీలోని తీవెలకు గుత్తులు గుత్తులుగా పూవులు పూయడాన్ని గమనించాను. ఆ పూవుల పక్కన సర్దుకు కూర్చుని, ఇన్నాళ్ళూ కనపడని ఓ బుజ్జి పిట్ట. ఆగీ ఆగీ తాకుతోన్న దాని తీయని పిలుపు.

"ఆ ఒక్క కూజితంతో కోకిల/ నా నగర జీవితాన్నంతా ఒక మూలకు తుడిచేసింది" అన్న వాడ్రేవు చినవీరభద్రుడి కవితాపాదాల్లోని బలం అనుభవంలోకి వచ్చిన క్షణాలవి. కాసేపు బయట హోరన్న రొద నుండి తప్పించుకుని, నా క్షణాలను ఆ కోకిల కూత చుట్టూ, విప్పారబోతున్న పూలరెక్కల చుట్టూ తిప్పుకున్నాను. అక్కడ నిలబడ్డ ఆ కాసేపట్లోనే 'కోకిల ప్రవేశించిన కాలం' కవితా సంపుటిలోని పంక్తులు ఒకటొకటిగా జ్ఞాపకమొస్తూంటే అనిపించింది, కవిత్వం చేసే మంచిపని, జీవితంలోని కొన్ని అపురూపమైన క్షణాలను గుర్తుపట్టగల సున్నితత్వాన్ని పాఠకుడిలో మేల్కొల్పడమని. దైనందిన జీవితాన్నంతా పక్కకు తుడిచి, కాసేపొక రసజగత్తులో తిప్పి తీసుకురాగలగడమని.

మనం నగరాల్లో జీవిస్తున్నాం కానీ,
ఎవరి పల్లెల్ని వాళ్ళు తడుముకుంటూనే ఉన్నాం
కిక్కిరిసి జీవించవలసి వస్తున్నందుకు
ఖేదించడం లేదన్నట్టు నటిస్తూనే
ఆ బాల్యకాల వైశాల్యాల్నే
పునః పునః స్మరిస్తున్నాం

- అన్న చినవీరభద్రుడి చురుకైన గమనింపుని, 'కోకిల ప్రవేశించిన కాలం' సంపుటిలో చదివినప్పుడు, ఒక్క కోకిలను అడ్డం పెట్టుకుని, ఈ కవి నగర జీవితాన్ని పక్కకు నెట్టుకోవడం గమనించినప్పుడు, నాకు అర్థమైనదిదే. మనం పాతబడిన కవి సమయాలనుకునేవి- అది కోయిలలైనా, పూవులైనా- నిజానికి ఎన్నటికీ పాతబడవు. ఎందుకంటే, వాటికి మనలోని బాల్యకాల స్మృతులను సజీవంగా ఉంచడమెలాగో తెలుసు. మనలోని ఆశని, మనలోని వసంతాన్ని.



BBB

కోకిలకూ వసంతానికీ, వసంతానికీ కవిత్వానికీ ఏదో అవినాభావ సంబంధముంది. పువ్వెడు వసంతం కోసం కవిత రాసిన శేషేంద్ర, "వసంత ఋతువు వచ్చిందో లేదో ఆ కోకిల కంఠం ఎలా పేలిపోతోందో చూడు" అంటారు. తొలిపొద్దు తెమ్మెర త్రోవలో పయనమై పరువెత్తు కోయిల గొంతున చిక్కిన వసంతగీతిని కృష్ణశాస్త్రీ గానం చేశారు. "పూలపూజలు సల్పిన మోహనుడు వసంతుడాతని రాక నీవింత చాటనేల..." అని ఆ బుల్లిపిట్టను నిగ్గదీసిన రాయప్రోలు, దానిని కన్నె పూబోండ్లకు రాయబారాలు గావించే దూతగా భావన చేస్తారు. కోకిల మీద అపురూపమైన పద్యాలెన్నింటినో రాసిన ఈ 'కోకిలస్వామి' కవిగారి ఇంటి ముందు గున్నమామిడి చెట్టు ఉండేదిట. లలితానామ పారాయణం చేసి వరండాలో కూర్చోగానే కొమ్మ మీద కోకిల కుహూకుహూరావాలు చేసి రచనకు ప్రేరేపించేదట. అందుకే, "మామిడికొమ్మ మీద కల మంత్ర పరాయణుడైన కోకిల స్వామికి మొక్కి" ఈ అభినవ స్వరకల్పనకు ఉద్యమించితిన్...అని రాసుకున్నారాయన. ఆ కోకిల వాల్మీకి అనుకోవడంలోనూ దోషం లేదన్నది వేరే సంగతి.

కానీ, భద్రుడి కోకిల మాత్రం వీళ్ళందరి ఊహల కన్నా భిన్నమైనది. ఎందుకంటే, భద్రుడి కోకిల మాత్రమే, వసంత కాలపు వైభోగంతో పాటు, ఆ సౌందర్యానికి ఆగి నిలబడి కైమోడ్పలేని నగర జీవితపు ఇబ్బందిని కూడా పసిగట్టింది. అందుకే అది తన గానంతో ఈ మనిషిని ఒక్క చరుపు చరిచి ఇంకో దిక్కుకి తిప్పే ప్రయత్నం చేసింది.

వసంతకాల సాయంకాలం
నగరం తన పనిలో తానున్నది,
60 లక్షల మంది మనుషులకు
అరవై లక్షల వ్యాపకాలు

సంధ్యాకాంతి బంగారం కురుస్తున్నా
సేకరించుకునే తీరిక లేదెవ్వరికీ
రావి చెట్టు మరకతాలు చిమ్ముతోన్నా
ఏరుకునే వ్యవధి లేదెవరికీ

అదిగో, అట్లాంటి కాలాల్లోనే ఈ వసంతసూచక కోకిలకంఠం వినవచ్చిందని రాస్తారు. ఆ కంఠం ఒక సూచన. తీరిక లేని వ్యాపకాల్లో తలమునకలుగా ఉన్న నగరజీవికి, జీవన మాధుర్యం వైపు తల తిప్పి చూడమనే హెచ్చరిక. బహుశా అందుకు, ఈ కోకిల పిలుపు అడవులకో పల్లెలకో మాత్రమే సొంతమైంది కాదని చెప్పినందుకు, అందరి కంటే ఎక్కువగా ఈ కోకిల కావలసినది, ఈ కోకిల కంఠాన్ని సొంతం చేసుకోవలసింది నగర జీవేనని గుర్తుపట్టినందుకు, ఈ నగర జీవితపు ఏకాకితనాన్ని ముక్కలు చెయ్యగలిగిన శక్తి కోకిల కూజితానికి ఉందని గుర్తు చేసినందుకు, భద్రుడి కోయిల ప్రత్యేకము, అపురూపమూ కూడా. అందుకే ఆ కవిత్వం, "లోకమొక కోకిల కోసం ఎంత ఎదురు చూసిందో/ కోకిల కూడా లోకం కోసమంతగానూ ఆరాటపడింది" అని నమ్మించగలిగింది. కోకిలలానే, "నువ్వు పాడవలసిన పాట నువ్వే పాడాల"ని ఉత్సాహపరిచింది.

BBB

'కోకిల ప్రవేశించిన కాలం' కవిత్వాన్ని చేతుల్లోకి తీసుకోగానే, క్షణాల మీద పాఠకుడిని పట్టి నిలబెట్టేది ఆ పదాల్లోని సారళ్యం. ఒక్కో పాదం చదువుతుంటే కళ్ళ ముందు పరుచుకునే నిస్తుల భావసౌందర్యం ముగ్ధుల్ని చేస్తూంటుంది. నిరాడంబరత్వం, సూటిదనం కలగలిసిన ఆ పదచిత్రాలు రేకెత్తించే స్ఫురణలు అలౌకికమైన ఆనందాన్ని హృదయంలోకి ఒంపుతాయి. ఉదాహరణకు, కోకిల కూజితం గురించే చూడండి, కవి ఎన్ని రకాలుగా చెప్తాడో,

"అది నేను దాటి వచ్చిన ఏ అడవుల్లోంచో
దూసుకొచ్చిన శరంలాగా నన్ను గుచ్చుకుంటున్నది
నా చిన్ననాటి స్నేహితుడెవ్వడో మా ఊరి నుంచి
బిగ్గరగా పిలుస్తున్నట్టు నన్ను కుదిపేస్తున్నది."

వేదనామయ జగత్తులో ప్రార్థనలాగా/ వినిపిస్తున్నది దాని పలుకు - అని కవి రాశాడంటే, అది ఎట్లాంటి శాంతినీ, ఓదార్పునీ, బలాన్ని ఇస్తుందో ఊహించగలం కదా.

"ఇంటి ముందు ఆటోలో అతిథి వచ్చిన చప్పుడైనట్టు/
నిద్రాలోకపు కొసన ఎవరి సెల్‌ఫోన్‌లోనో
లతా మంగేష్కర్ రింగ్‌టోన్‌గా వినవస్తున్నట్టుందా పిలుపు"

కోకిల ఇట్లా వదులుకోలేని బంధమై ప్రతి వసంతంలోనూ చుట్టుముట్టింది ఈ కవినేనేమో! ఆ ప్రేమా, ఆ ప్రేమలోని బలమైన ఆకర్షణా, పాఠకుడినీ ఏదో ఒక చోట తాకకుండా పోవు. తెలవారుతూండ గానే పలకరించే పక్షి కూతలని తలుచుకుంటూ కవి "ఎక్కడో ఓ పక్షి కిలకిలతో ఆకాశం తలుపు తెరుస్తుంది" అంటారు కొండ మీద అతిథి సంపుటిలో. పక్షుల కిలకిలలతోనే ఈ లోకంలో వెలుగులు నిండుతున్నాయనడం అపురూపమైన మాట. ఈ వాక్యంలోని సౌందర్యాన్ని గురించి ఆలోచించిన కొద్దీ రసజ్ఞ పాఠకులకు కొత్త అర్థాలు స్ఫురిస్తూనే ఉంటాయి.

ఎక్కడి నుండి వస్తుందో కోకిల
సరసులాంటి నీ తెల్లవారుఝాములో
అల్లరిపిల్లవాడిలా ఒక జ్ఞాపకం విసుర్తుంది
ఇక వలయాలు వలయాలుగా మనసు చిట్లిపోతుంది

- ఈ కవి మనసు ఇక్కడితో తృప్తి చెందలేదు. దీని తరువాత వచ్చిన నీటి రంగుల చిత్రం సంపుటిలో రాస్తారిలా :

ఆఫీసులో పని మధ్య, చుట్టూ కాగితాలు, ఎదట
పార్కులో ఒకటే మారాం చేస్తున్న కోకిల
- -
చిన్నపిల్లలా కోకిల నా చుట్టూ గీపెడుతూ
పిలవగానే పరుగెత్తుకు రమ్మంటున్నది, చిన్నప్పుడు
ఏ పిల్లవాడూ ఆటల కోసం నన్నిట్లా పిలవలేదు, నవ
యవ్వనవేళ ఏ యువతీ నన్నిట్లా అల్లరి పెట్టలేదు

- ఎట్లాంటి ఊహ! కోయిలను బాల్యకాలస్నేహితుడిగా, యవ్వన కాలాల్లో కవ్వించే యువతిగా భావన చేయడమా! అలా రాయడానికి కోయిలను కేవలం ఒక కవితా వస్తువుగా చూడగల మనసు సరిపోతుందా! తరిగిపోయిన కాలాల స్మృతిగీతాన్ని ప్రతి వసంతంలోనూ పునః పునః గానం చేసే కోకిలను తన నుండి వేరు చేసుకుని చూడలేని హృదయమైతేనే తప్ప ఇట్లాంటి కవిత్వాన్ని రాయలేదు. రాయలేదు.

BBB

కోకిలను నెపంగా ముందుంచుకుని, జీవన సౌందర్యాన్నంతా పరచిన ఆ కవితలను పక్కన పెడితే, ఈ పుస్తకంలో మననం చేసుకోదగిన కవితలు ఇంకా ఎన్నో ఉన్నాయి. తీపిపూల గాలి, పూర్తిగా పూసిన పూవు లాంటి పొద్దుటి ఎండ కుమ్మరించిన పసుపు రంగు, కానుగ చివుళ్ళ నిగనిగలతో శోభిల్లే నగర వైభవం, పండుటాకుల వేప కొమ్మల మధ్య ధూపం వేసినట్టున్న తొలి వెన్నెల, వేకువ చంద్రుడి పచ్చకర్పూర లోకం... ఇలా కవిత కవితలోనూ రసం చిప్పలజేస్తున్నట్టున్న పద బంధాలను ఎవరికి వారే చదువుకోవాలి. ఆ పదాల్లోని నిర్మలత్వంలో తెప్పరిల్లి లేవాలి. దైనందిన జీవితపు హడావుడిలో నుండి, ఆవహించే అలసట నుండీ కొన్ని క్షణాల పాటైనా మనిషిని పక్కకు నెట్టగల శక్తి ప్రకృతికి తప్పకుండా ఉంటుంది. కానీ కవి అన్నట్టు,

ఒక కోకిల లోకం కోసం గొంతు సవరించాలంటే/ లోకం కూడా కోకిల కోసం చెవులు రిక్కించాలి.

అన్న మాటను జ్ఞాపకముంచుకోవాలి. కాళిదాసూ చెప్పాడు, రత్నం నన్నెవరు ధరిస్తారని అన్వేషించదు, ధరించదలచినవారే రత్నం కోసం అన్వేషిస్తారని. కాబట్టి వెదుక్కోవాలి ఆ పిలుపుల కోసం. ఆ పిలుపులు వినపడే త్రోవలు పరిచిన ఇట్లాంటి పుస్తకాల కోసం. చెవులు రిక్కించాలి. ఎవరికి వారే. ఎందుకంటే, మొదలవుతోందిప్పుడే, కోకిల ప్రవేశించే కాలం.

మానస చామర్తి
79754 68091

ఊరిడిసి పోతప్పుడు



దేవులాటలన్నీ ఒక్క మోపున
ముసురుకున్నప్పుడు
నిద్రలేని మాపులు కొన్ని
కనుగుడ్ల మీద కలత సూదులు
గుచ్చుతయి

పొదుగుబట్టి పాలుగుడిసె మేకపిల్లను
బల్మీటికి పట్టి గుంజుకపోయినట్టు
బస్తీవైపు బతుకు తొవ్వొకటి
బలవంతంగా తెరుసుకుంటది

పాత పుస్తకాలు సినిగిన బట్టలు
ఇరిగిన కుర్సీలు తెగిన చెప్పులు
ఇవే కదా
ఇక్కడ వదిలేసి పోతున్నవి
మరి గిదేం సిత్రమో...
బరువు తగ్గుతుంటే
భారం పెరిగినట్టయితుంది

సంతోషాలను తోర్నపాకు కట్టి
ఈ బజాట్లనే కదా ఊరేగింది
కలతలన్నిటిని ముక్కలుగా నరికి
ఈ ఆడకట్లనే కదా ఎగజల్లింది
వస్తువులైతే ఎట్లనో వదిలేసి పోతా
మరి జ్ఞాపకాలనెలా వదలను?

ఎక్కడికిపోయినా తోకూపుకుంట
సందుమూలదాంక సాగదోలే విశ్వాసాన్ని
ఎన్ని బండ్లుకట్టి ఎంట తోలుకపోను?

ఎంటబడి ఉర్కొచ్చిన లేగదూడ
నెనరుగా నాకిన తడి అచ్చులు
ఒల్లంతా నాకిప్పుడు
కనిపించని పుట్టుమచ్చలు

తిన్నావా నాయన అని
కడుపు నింపే ముచ్చట్లు
ఆపదకు సాపదకు
అక్కరకొచ్చే సోపతులు
రేపు ఇక..
పిల్లలకు చెప్పుకునే నీతి కథలు

తూప్రాసిలో ఊరబిష్కెల
అరుపులు
సాయమాను కింద
బల్లెపీట మీది దరువులు
యాదికొచ్చినప్పుడల్లా
దించుకోలేని బరువులు

నీడను మోసిన నేలను
గుండె పొరల్లో సర్దుకొని
శ్వాసలు తీసిన గాలిని
తిత్తుల నిండా నింపుకొని
నెత్తురు పంచిన అమ్మనూ
నెత్తిన తిప్పిన అయ్యనూ
ఎద పుటల్లో దుఃఖ పదాలుగా
రాసుకుని
బతుకు పడవనెక్కి
మెతుకు వేటకు పోతున్న

భారమైన గుండెతో...
ఇయ్యాల నేను
నా ఊరిడిసి ఎల్లిపోతున్న

తుల శ్రీనివాస్
99485 25853

ప్రతి ఫాసిస్టుకి సత్యంతో పేచీ ఉంటది

తెలుగు ప్రజలకూ, బెంగాలీ సాహిత్యానికీ అవినాభావ సంబంధం ఉంది. ఠాగూర్, బంకించంద్ర చటర్జీ, శరత్ బాబులు ఇక్కడ ఇంటింటికి పరిచయమయ్యారు. ఇప్పుడు మీ కవిత్వం తెలుగులోకి అనువాదం అయింది. ఎలా ఫీలవుతున్నారు?

నన్ను ఇలా పరిచయం చేస్తున్నందుకు, మొట్టమొదట మీకు కృతజ్ఞత చెప్పుకుంటున్నాను. తెలంగాణ ప్రజలతో నాకు సరికొత్త గాఢానుబంధం ఉందని భావిస్తాను. అది ఏమిటంటే చెప్పలేనేమో కానీ రమాసుందరి (మాతృక ఎడిటర్), ఉదయమిత్ర, వేణుగోపాల్, వరవరరావు లాంటి వారల సహచర్యంతో, నాకు నా సొంత గడ్డమీద ఉన్నట్లే అనిపిస్తది. మీకు ఒక విషయం చెప్పాలి నా మొదటి పుస్తకం 'The Musings of the Dark' 2019లో అచ్చయినప్పుడు, రమాసుందరి మొదటి ప్రతిని ఫేస్‌బుక్‌లో ఉంచి, ప్రపంచానికి నన్ను పరిచయం చేశారు. ఆమె నాకు Language of Pains కవితను ఆడియో చేసి పంపారు. ఆ కవిత చదువుతూ, ఆమె కళ్ళు చెమర్చడం ఒక మర్చిపోలేని అనుభూతి. తెలంగాణ ప్రజలతో నాకున్న భావోద్వేగ అనుబంధం ఇటువంటిదే.

మీరు సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చారు కదా. మీరు ఉంటున్న 'సిలిగురి' కూడా వెనుకబడ్డ ప్రాంతమే. అయినా మీకు జాతీయ, అంతర్జాతీయ అంశాలమీద ఈ పట్టు ఎలా వచ్చింది?



పలకరింపు
మౌమితా ఆలం

నేను ఉత్తర బెంగాల్లోని మారుమూల ప్రాంతం నుండి వొచ్చాను. అది పూర్తిగా లోతట్టు ప్రాంతం. 'తీస్తా' నది ఒడ్డున నివసించేదాన్ని. అక్కడే పుట్టి పెరిగాను. బాల్యమంతా అమ్మమ్మ, పిన్నమ్మ సాన్నిహిత్యంలో గడిచిపోయింది. నాకు మా అమ్మా నాయనలతో పెద్ద అనుబంధాలు ఏమి లేవు. వాళ్లు ఒక లోతట్టు ప్రాంతంలోని టీ తోటల్లో పనిచేసేవాళ్ళు. చిన్నప్పటినుంచి మా 'కాలా' (పిన్ని) నా చదువుపట్ల శ్రద్ధ వహించేది. మా ఊరికి 20కి.మీ. దూరంలో గల స్కూలులో నాకు అడ్మిషన్ దొరికింది (1996-97). ప్రయాణమంతా దారుణంగా ఉండేది. నేను సైకిల్ నేర్చుకునే దాకా, రెండు కిలోమీటర్లు బురద బాటలో నడిచి, ఆ తర్వాత ఒక రిక్షా తీసుకొని బస్టాండ్‌కు చేరుకునేదాన్ని. కానీ, ఆ ప్రయాణమే తర్వాతి కాలంలో, ఒక వరంగా మారింది. స్కూలుకు వచ్చి పోయేటప్పుడు, అక్కడి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడేదాన్ని. వాళ్లు కూడా నాతో అంతే ఆప్యాయంగా ఉండేవాళ్ళు. ఆ పల్లె జనాల వల్లనే నాకు దయ, దృఢత్వం, నిరాడంబరత అబ్బినాయి. ప్రజలతో గల ఈ సాన్నిహిత్యమే నాకు రాజకీయ స్పృహను కలిగించింది.

పట్టణంలో డిగ్రీ పూర్తి చేశాను. ఈ లోపున మా చిన్నమ్మ పెళ్లయిపోయింది. ఆమె భర్త (వరుసకు చిన్నాయన) సరాసరి మా ఇంటికి వచ్చేసాడు. ఇంట్లోకి అతగాడి ప్రవేశంతో నా జీవితం దుర్భరమైపోయింది. భయంకర బాధల పల్లవి నా బాల్యం. కళ్ళు మూసుకుంటే చాలు, ఇప్పటికీ అది నన్ను వెంటాడుతది. అసలు నాకు బాల్యం అనేది లేకుంటేనే బాగుండును అనిపించేది. అర్థరాత్రి నన్ను లైంగికానందం కోసం తడిమే ఆ హంతక హస్తాలు ఇప్పటికీ వెంటాడుతున్నట్టు అనిపించి రాత్రులు నిద్ర పట్టదు.

ఇంగ్లీష్ సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్ చేశాను. మూడేళ్ళకు టీచర్‌ని అయ్యాను. ఆ క్రమంలోనే, నేను ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లాడాను. నా కుటుంబం ఒప్పుకోక పోవడంతో వాళ్లతో అన్ని సంబంధాలు తెగిపోయాయి. పోనీ కాపురమైనా నిలుస్తదేమో అనుకుంటే, అది కూడా మూన్నాళ్ళ ముచ్చటే అయింది. నిత్యం తిట్లతో, హింసతో కాపురం నిత్యాగ్ని గుండమైంది. నాకు 2019లో విడాకులు వచ్చినా, 2017నుండి నేను నా భర్తతో విడిపోయే ఉన్నాను. నాకు ఎనిమిదేళ్ళ పాప ఉంది. తానే నా సర్వస్వం నేను కాలేజీ చదివేటప్పుడు బుక్స్ కొనడానికి సరిగా డబ్బులు ఉండేవి కావు. ఉద్యోగం వచ్చాక పుస్తకాలు కొని బాగా చదవడం మొదలు పెట్టాను. ఆ ప్రయాణం కొనసాగింది. నా కలహాల కాపురంలో పుస్తక పఠనం ఒక ఉపశమనంగా ఉండేది.

మీరు చాలా సాహసంగా రచనలు చేస్తున్నారు. పబ్లిషర్స్‌తో సమస్యలు ఏమీ ఉండవా?

ప్రతి ఫాసిస్టుకి సత్యంతో పేచీ ఉంటది. నేను రాస్తున్నానంటే నడుస్తున్న కాలానికి ప్రతినిధిగా రాస్తున్నా. సంతోషకరమైన విషయం ఏమిటంటే, ఇప్పటికీ కొన్ని పత్రికల్లో నిరసన కవితలకు చోటు దొరుకుతున్నది. 'ద వైర్', 'అవుట్‌లుక్', 'కౌంటర్ కరెంట్స్', 'నాగరిక్.నెట్', 'ఉత్తర్ బాంగా సంబత్' లాంటివి నా కవితల్ని వేసుకుంటున్నాయి ఎస్. రవిశంకర్ గారు నా కవితలకు చేసిన అనువాదాన్ని కొన్ని మలయాళ పత్రికలు స్వీకరిస్తున్నాయి. తెలుగులోనైతే 'మాతృక' నాకు మొదటి నుంచి గొప్ప మద్దతుగా నిలుస్తోంది.

మామూలు పదాలతో ఇంత క్లిష్టమైన విషయాలను ఎలా చెప్పగలుగుతున్నారు? మీపై ప్రభావాలు?

నా కవితలు జోల పాటలు కావు. అవి ప్రజల్ని చైతన్యం చేయడానికి రాసినవి. నా పదాలకు కార్మికుల, కర్షకుల, దగాపడ్డ మహిళల చెమట వాసన ఉంటది. నా అక్షరాలు నా చుట్టూ జరిగే హింసకు నిరంతర సాక్ష్యాలు. కులం, మతం, వర్గం, జెండర్ పేరు మీద నా చుట్టూ హింస అల్లుకుంటున్నది. నన్నెవరు ప్రభావితం చేశారు అనేది చెప్పడం కష్టమే. కానీ, అరుంధతీరాయ్, ఆగా షాహిద్ అలీ, వరవరరావు, నాజుల్ ఇస్లాం... మొదలైన వాళ్ళ రచనల్ని ఇష్టంగా చదువుకుంటాను

ఇప్పుడు కుల, మత, భాషల్లో ఆధిపత్య ధోరణులు ఎక్కువయ్యాయి. జెండర్ వివక్ష కొనసాగుతూనే ఉంది. దీనికి పరిష్కారం ఏమిటి?

నేను రాజకీయ నాయకురాల్ని కాదు. కానీ రాజకీయ స్పృహ కలిగిన ఓ కవయిత్రిగా, వ్యాస రచయిత్రిగా నేను చెప్పేది ఏమంటే, కేవలం వర్గ స్పృహ కలిగిన రాజకీయాలు మాత్రమే అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలవు. సరైన మార్గంలో నడిపించగలవు

మతోన్మాద రాజకీయ వాతావరణంలో, ఒక ముస్లిం మహిళగా మీరెట్లా ఫీల్ అవుతున్నారు. నిత్యం వెంటాడబడి, వేధించబడి, హత్యకు గురయ్యే మహిళలకు మీరిచ్చే సందేశం ఏమిటి?

ఇప్పుడు ముస్లిం మహిళల పరిస్థితి అతిదారుణంగా ఉంది. చాలా వివక్షను ఎదుర్కొంటున్నారు. రోజురోజుకి మతోన్మాదుల చేతుల్లో ముస్లిం మహిళలు బలవుతున్నారు. 'బుల్లి భాయ్ సుల్లి డీల్స్' యాప్ వంటి నీచ నికృష్టమైన యాప్స్‌ని చూస్తున్నాం. ఫాసిజం యొక్క అనేక పార్శ్వాలు మమ్మల్ని, మా కలల్ని ధ్వంసం చేస్తున్నాయి. ఒక ముస్లిం మహిళగా మమ్మల్ని చిన్నచూపు చూడడం మాకు ఎరుకనే. అది మా వెన్ను మీద పాము పారాడినట్టుంటుంది. కానీ సాధ్యమైనంతగా ఎదిరించాలి. చదువుకునే విషయంలో మనం వెనుకంజ వేయొద్దు. విద్యాధికులైన మహిళలు ముందుకొచ్చి, అట్టడుగున అవమానాలకు గురవుతున్న ముస్లిం మహిళలకు చేయూతను ఇవ్వాలి. జ్ఞానమే ఆయుధంగా ఫాసిస్టులను ఓడించాలి. ఎందుకంటే ఫాసిజానికి అజ్ఞానమే ఆధారం.

మీరు ఇప్పుడు నవ యువ కవులకు ప్రతినిధి గదా. వాళ్లకూ, అంతిమంగా తెలుగు వాళ్లకూ మీరిచ్చే సందేశం ఏమిటి?

ప్రపంచం రక్తమోడుతుంటే, చంద్రుని అందం మీద పద్యం రాయొద్దన్నదే నా సందేశం.

ఇంటర్వ్యూ, అనువాదం: **ఉదయ మిత్ర**

(ఉదయమిత్ర అనువాదంలో మౌమితా ఆలం కవిత్వం 'రాయగూడని పద్యం' సంపుటిగా ఇటీవల విడుదలైంది)


ఓ స్త్రీవాది ఒప్పుకోలు/
A Feminist's confession

నేనీ వేళ వచనమై పోవచ్చు
వాచ్యమై తేలొచ్చు
మౌనమై మిగలడం కన్న మిన్న!

అవును
నేను స్త్రీ వాదిని
ఇరవయ్యో శతాబ్దపు సాహితీ సంద్రాన
ఉప్పెనలా ఎగసి పడిన
ఎనభై దశకపు మహిళను ప్రేమిస్తాను
ద్వితీయ శ్రేణి తృతీయ శ్రేణులు కాదు
మనిషి మనిషీ సగౌరవంగా మెలిగే
సమాజ సౌందర్యాన్ని కళ్ళకు కట్టినందుకు

2.
నడిచే స్వతంత్రమిచ్చామని అడుగులు నీవేననుకోకు
చదివే స్వేచ్ఛ ఇచ్చామని జ్ఞానం ప్రదర్శించే అతి చేయకు
ఉద్యోగం చేసుకోమన్నామని నిర్ణయం నీదేననుకోకు
ప్రతీ రంగంలో చోటిచ్చామని అంతా నీవేననుకోకు
ఆకాశంలో సగమనే భ్రమలు వీడు
అడుగున ఉన్న నేలే నువ్వంటూ
అడుగడుగునా తీర్పరులు కొలువు తీరిన
ఈ లోకుల న్యాయస్థానంలో
ఇచ్చేదెవ్వరు
తీసుకోవడం ఏమిటని
సమానత్వ వాదన వినిపించే ప్రతిసారీ
బోనులో నిలబడ్డ ముద్దాయిలా
అనివార్యంగా
నేనొక ప్రమాణం చేసి తీరాలి
నేను పురుష ద్వేషిని కాను
పురుషులందు పుణ్యపురుషులు వేరయా అని పాడి తీరాలి

3.
కలువల్లాంటి కళ్ళు కాస్తా ప్రశ్నల కొడవళ్ళు నింపుకుంటే
బదులుగా నను బందీ చేసేందుకు
నీ చేతుల్లో రెండు బేడీలు
మాతృత్వం, పవిత్రత; సదా సిద్ధం
లేదా
కొత్త విశేషణాలతో నను నిర్వచిస్తుంటావ్
బరులు తెగించిన లకార ముకార పదాలు వరుస కడతాయి
చులకన చూపుల, చీత్కారాల, అవమానాల అస్త్రాలతో
వివస్త్రను చేసినంత పని చేసి
నా ఇంటిని ఒంటిని కుటుంబాన్ని భవిష్యత్తుని
నడిరోడ్డు మీద పందేరేనికి పెడతావు
నిజమెంతో అబద్ధమెంతో లోకానికి అవసరం లేనిచోట
పుకార్ల పునాదుల మీద ఆధిపత్యాలు చెలరేగే చోట
అయితే గియితే
ఆగిపోతాను
లేదా
ఆత్మహత్య చేసుకుంటాను



లేదంటే
నడుంబిగించి కడదాకా కదనస్ఫూర్తి నింపుకుంటూ నడుస్తుంటాను

4.
పక్కపక్కనే నడుస్తున్నట్టుంటూ
నిన్న కుడివైపు తుమ్మావ
ఇవాళ ఎడమవైపు దగ్గుతున్నావేం అంటావ్
నా దిక్కేదో నువ్వే నిర్ధారిస్తావ్
నాకు ఎరుకలో ఉన్న సంగతులు పలుకుతుంటా
ఆయా సంగతులు శ్రుతిబద్ధంగా ఉన్నా
అబ్బే ఏం బాలేదని తేలిక చేస్తావ్
ఇంకో తెలియని రాగంలో బాణీ ఎందుకు కూర్చలేదంటావ్
వర్ణవర్ణములుగా వేలెత్తి చూపి
గీతాలను కొట్టివేస్తావ్
నా కొంగుతో ఆకలిని వార్చుకుంటాను
అదే కొంగును కాల్చి
నీ ఆకలి చూపుల ముఖంపై విసిరి కొడతాను
నేనొక భావజాలమై ప్రవహిస్తుంటే
పాయలు పాయలుగా చీల్చి
ఉధృతిని నిలువరిస్తావ్
అలక్ష్యం నీ ఆయుధం
విలువ లేకుండా చేయడం నీ లక్ష్యం

5.
నా ఒంటిని
మెడను
కాళ్ళను
వేళ్ళను చుట్టుకున్న అలంకారాలతోనో
నా నుదుటి కుంకుమ రంగులతోనో
చివరికి
నా ముఖకవళికలు
నేను కూర్చున్న తీరు
నిల్చున్న
నడిచిన
నవ్విన
ఏడ్చిన తీరులతో
నన్ను
నా వ్యక్తిత్వాన్ని అంచనా కడుతుంటావ్
నీ విశ్లేషణలు విని
ఆశ్చర్యపోవాలి
ఒప్పుకుని తీరాలి
నో ఆప్షన్
నీదైన సిద్ధాంతంలో
నన్ను నన్నుగా ఆవిష్కరించుకోనివ్వని అనేక సూత్రాలు

నాకు ఊపిరాడనివ్వని గదుల్లో
ఎంతో ప్రయాస పడి కిటికీలు తెరుచుకుంటాను
ఇనుప బీగాలెన్నింటి తుప్పునో విదిలించి
తలుపులు తెరుస్తుంటాను
శీలం నీ జేబులోని ట్రంప్ కార్డ్
ఎప్పటికప్పుడు
నా చుట్టూ అల్లబడ్డ అపనిందల అపోహల వలలను తెరపైకి తెస్తావు
కొత్త భయాలను నిర్మించి
ముందడుగు వేయనివ్వని రేఖల్ని గీయగల నీకు
కొత్త లక్ష్మణరూపాలెన్నో
అగ్నిప్రవేశం చేయలేని కాలం కదా
నీ హద్దుల నిప్పుల కుంపట్లో
భస్మం కాని సీతను నేను
ఫీనిక్స్‌ను
నీ కంటికి పత్తి గణికను
గడ్డిపోచను

6.
సరే అలాగే కానీయ్
ఒకే ఒక్క ప్రశ్న
పైన చెప్పిన అన్ని నేను - నువ్వుల్లో
నేను! - నేనే!
నువ్వు!? - ఎవరు!?

ఫణిమాధవి కన్నోజు
76598 34544

'అనల్పం' కవితా సంపుటి

బోధి ప్రచురణలు, తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శేషభట్టర్ రఘు కవితా సంపుటి 'అనల్పం' ఆవిష్కరణ సభ మార్చి 25 సా.6గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షత ఏనుగు నరసింహారెడ్డి; పుస్తకావిష్కరణ సిద్ధార్థ; వక్తలు అంబటి సురేంద్ర రాజు, కొప్పర్తి, ప్రసాదమూర్తి.

బోధి ప్రచురణలు

ప్రపంచ కవితా దినోత్సవసభ

కవిసంధ్య, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మార్చి 24 సా.5.30గంటలకి రవీంద్ర భారతి సమావేశ మందిరం, హైదరాబాద్‌లో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కవిత్వంపై కొప్పర్తి ప్రత్యేక ప్రసంగం; కవితల పోటీ బహుమతుల ప్రదానం; కవి సంధ్యపత్రిక, కవిత్వ గ్రంథాల ఆవిష్కరణ; కవి సమ్మేళనం ఉంటాయి. శిఖామణి, కొలకలూరి ఇనాక్, కె.శివారెడ్డి, మామిడి హరి కృష్ణ తదితరులు పాల్గొంటారు.

దాట్ల దేవదానం రాజు

'నాగలి కూడా ఆయుధమే..!'

విల్సన్ రావు కొమ్మవరపు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే..!' పరిచయ సభ మార్చ్ 21 సా.4గంటలకు తిరుపతిలోని యూత్ హాస్టల్ నందు జరుగుతుంది. అధ్యక్షత తోట వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథి భూమన్, పుస్తక పరిచయం పి.సి.వెంకటేశ్వర్లు. సభలో వై. సుభాషిణి, ఆర్.సి. కృష్ణస్వామిరాజు, పల్లిపట్టు నాగరాజు, పాల్గొంటారు.

తోట వెంకటేశ్వర్లు

'పలకల నుంచి పలుకుల వైపు'

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు మార్చ్ 24న బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉ.10గంటల నుంచి ఒక రోజంతా సాహిత్య సభలను మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్ సభలను ప్రారంభిస్తారు. కందుకూరి శ్రీరాములు 'పలకల నుంచి పలుకుల వైపు' కవితా సంపుటిని ముఖ్య అతిథి శివారెడ్డి ఆవిష్కరిస్తారు. విశిష్ట అతిథులు నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్; ఆత్మీయ అతిథులు నాళేశ్వరం శంకరం, విరహత్ అలీ. రెండో విభాగంలో 'సాహిత్యం సమకాలీనత' అంశంలో కవిత్వం మీద దర్భశయనం శ్రీనివాసాచార్య, కథ - నవల మీద ఎన్.రజని, విమర్శ - పరిశోధన మీద లక్ష్మణ చక్రవర్తి ప్రసంగిస్తారు. మూడో విభాగంలో 38 కవులు పాల్గొంటున్న కవిసమ్మేళనం జరుగుతుంది.

బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ సారస్వత పరిషత్తు పురస్కారాలు

తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు సూచనలు, గ్రంథాలు ఆహ్వానిస్తున్నాం. 2022, 2023 సంవత్సరాల్లో తొలిసారి ముద్రితమైన పుస్తకాలను పంపాలి. పద్య/ గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, సాహిత్య విమర్శ ఇతరాలు, యువ పురస్కారం అనే ఏడు విభాగాల్లో పురస్కారాలు ఉంటాయి. పోటీకి పంపేవారు జన్మతః తెలంగాణ వారై ఉండాలి. పుస్తకాలు కవిత్వం 60, విభాగాత ప్రక్రియల్లో 100 పుటలకు తక్కువ కాకుండా మూడు ప్రతుల చొప్పున ఏప్రిల్ 25లోగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, ఆబిడ్స్, హైదరాబాద్-1 కు పుస్తకాలను పంపాలి. ఈమెయిల్ telanganasaraswathaparishath@gmail.com కి పుస్తకం వివరాలు ముఖ్యంగా పుస్తకం పేరు, రచయిత పేరు, ముద్రణ పొందిన సంవత్సరం, పుటల సంఖ్య పేర్కొంటూ సూచనలు పంపవచ్చు. 20 - 35 ఏళ్ల మధ్య వయసున్న వారు యువ పురస్కారం కోసం తమ రచనల్ని మూడేసి ప్రతుల చొప్పున పంపాలి. వివరాలకు: 9603727234.

తెలంగాణ సారస్వత పరిషత్తు





కూటమి లో ఎన్నికల జోష్ నింపిన ప్రజాగళం

దారులన్నీ బొప్పూడి వైపే!

భారీగా తరలిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



అవనిగడ్డ నుంచి చిలకలూరిపేట సభకు తరలివెళ్తున్న టీడీపీ, జనసేన నాయకులు, (ఇన్‌సెట్‌లో) ఇబ్రహీంపట్నంలో జెండా ఊపి సాగనంపుతున్న కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిలో ప్రజాగళం సభ ఎన్నికల ఉత్సాహాన్ని నింపింది. ఆదివారం మధ్యాహ్నం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగిన ఈ సభకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి పెద్దఎత్తున మూడు పార్టీల శ్రేణులు తరలివెళ్లాయి. విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్న కేశినేని చిన్ని ఆధ్వర్యంలో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేశారు. కేశినేని చిన్ని స్వయంగా మైలవరం నియోజకవర్గ నేతలతో కలిసి ఇబ్రహీంపట్నం వద్ద ప్రజాగళం సభకు ఆటోలు, కార్లు, బస్సుల్లో బయలుదేరిన శ్రేణులను జెండా ఊపి ఉత్సాహపరిచారు. ఆయనతోపాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పెనమలూరు నియోజకవర్గం నుంచి ప్రముఖ న్యాయవాది, సీనియర్ టీడీపీ నాయకుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జనసమీకరణ చేశారు. సుమారు 20 బస్సులు, 100 కార్లలో నియోజకవర్గం నుంచి మూడు పార్టీల శ్రేణులు ప్రజాగళం సభకు తరలివెళ్లాయి. వీరిని గొట్టిపాటి రామకృష్ణ జెండా ఊపి సాగనంపారు. గుడివాడ నుంచి 50 బస్సులు, 150 కార్లలో ప్రజాగళం సభకు భారీగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు తరలి వెళ్లారు. గుడివాడ టీడీపీ కార్యాలయం వద్ద మూడు పార్టీల నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. గన్నవరం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో పెద్దఎత్తున మూడు పార్టీల కార్యకర్తలు ప్రజాగళానికి తరలివెళ్లారు. విజయవాడ పశ్చిమ, విజయవాడ తూర్పు నియోజకవర్గంతోపాటు మచిలీపట్నం, పెడన, తదితర నియోజకవర్గాల నుంచి కూడా పెద్దఎత్తున తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ అభిమానులు ప్రజాగళానికి తరలివెళ్లారు.



పెనమలూరులో న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన శ్రేణుల ర్యాలీ



గుడివాడలో ర్యాలీకి జెండా ఊపుతున్న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు

కోడ్ వచ్చినా అధికారులు కదలటం లేదు. అధికార పార్టీ అంటే ఆచితూచి స్పందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లా ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్) బృందాలు పూర్తిస్థాయిలో కోడ్‌ను అమలు చేయలేకపోతున్నాయి. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో కోడ్ అమలుకు చర్యలు తీసుకున్నప్పటికీ.. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించి మాత్రం దృష్టి సారించలేదు.



హనుమాన్‌పేట రోడ్డులో 'సిద్ధం' పోస్టరుతో ప్రచారం

పట్టించుకోడ్!

కోడ్ వచ్చినా సిద్ధం పోస్టర్ల తొలగింపులో ఎంసీసీ విఫలం

- అధికార పార్టీకి నోటీసులు కూడా పంపించని బృందాలు
- వైసీపీ బ్యానర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డుల తొలగింపు చర్యలు శూన్యం
- బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల అనధికార హోర్డింగ్‌లు ఎక్కడివక్కడే..
- ఫైబర్‌నెట్‌లోనూ అధికార పార్టీ ప్రచారం

నేటి మధ్యాహ్నం 3 గంటల వరకే గడువు



కృష్ణలంకలో జెండా దిమ్మెపై వైసీపీ ప్రచారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బహిరంగ ప్రదేశాల్లో అనుమతిలేని రాజకీయ పార్టీల బ్యానర్లు, హోర్డింగ్‌ల తొలగింపునకు ఎన్నికల సంఘం 48 గంటల సమయం ఇచ్చింది. ఈ పేరుతో ఎంసీసీ బృందం అధికార పార్టీకి సహకారం అందిస్తోంది. అధికార వైసీపీకి చెందిన సిద్ధం పోస్టర్లు విజయవాడ నగరంతో పాటు, జిల్లా అంతటా ఉన్నాయి. వీటిని ఎక్కడా ఒక్క దానిని కూడా తొలగించలేదు. అదేమని అడిగితే ఇంకా ఒకరోజు సమయం ఉందని ఎంసీసీ అధికారులు అంటున్నారు. ఆదివారం అయినా బహిరంగ ప్రాంతాల్లో, రోడ్ల వెంబడి ఉన్న వైసీపీ సిద్ధం పోస్టర్లను తొలగిస్తారనుకుంటే అదీ చేయలేదు. ఎన్నికల సంఘం ఇచ్చిన 48 గంటల గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగుస్తుంది. ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తూ, అధికార పార్టీకి ఎంసీసీ బృందాలు సహకారం అందిస్తున్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో, జంక్షన్ల వెంబడి, రోడ్ల వెంబడి గోడల మీద వాల్ పెయింటింగ్స్ కానీ, వినైల్ బ్యానర్లు, హోర్డింగ్‌లు వంటివి రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి వినియోగించుకోవాలంటే అనుమతి తీసుకుని ఉండాలి. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అనుమతి తప్పనిసరి. సిద్ధం పోస్టర్లను కోడ్‌కు ముందే ఏర్పాటు చేశారు. కాబట్టి ఏ ఒక్కదానికీ అనుమతి లేదు. సిద్ధం పోస్టర్లను తొలగించకుండా ఆ పార్టీ అనుమతులు తెచ్చుకునేందుకు పరోక్షంగా జిల్లా ఎంసీసీ బృందాలు సహకరిస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం లోపు అనుమతులు తీసుకునేందుకు సహకరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'మా నమ్మకం నువ్వే' బోర్డులనూ తొలగించలేదు

'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో అధికార పార్టీ వ్యాపార దుకాణాలకు ఉచితంగా బోర్డులను ఇచ్చింది. ఆ బోర్డుల్లో కింద వరుసన ఆ దుకాణం పేరు ముద్రించి ఇచ్చింది. ఈ బోర్డులను అధికార పార్టీతో పాటు, నగరంలోని కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నాయకులు కూడా స్పాన్సర్ చేస్తూ దుకాణాలకు ఉచితంగా ఇచ్చారు. మా నమ్మకం నువ్వే జగన్ అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డులను కూడా ఏ ఒక్క దుకాణంలో కూడా కనీసం తొలగించిన దాఖలాలు లేవు.

పార్టీ దిమ్మెలపై ప్రచారాలు

అధికార పార్టీ ఆఖరికి తమ పార్టీ దిమ్మెలను కూడా ప్రచారానికి వాడుకుంటోంది. వైసీపీ సోషల్ మీడియా విభాగం కనుసన్నల్లో పార్టీ దిమ్మెలకు ఉపయోగించే కడ్డీలపై నవరత్నాలు బిగ్ బ్యాడ్జీలను, పార్టీ కార్యక్రమానికి సంబంధించిన గడపగడపకూ వైసీపీ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇవి కూడా రోడ్ల వెంబడి, జనసమ్మర్ద ప్రదేశాల్లోనే ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు ఎంసీసీ బృందాలు వీటిని తొలగించలేదు.

ఏపీ ఫైబర్‌నెట్‌లో ఇంకా జగన్ ప్రచారం

ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీ ఫైబర్ నెట్ కూడా కోడ్‌ను దారుణంగా ఉల్లంఘిస్తోంది. ఏపీ ఫైబర్ నెట్‌లో ముఖ్యమంత్రి జగన్, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతం రెడ్డి ఫొటోలు దర్శనమిస్తున్నాయి. ఏపీ ఫైబర్ నెట్ ఉన్న వారు సెట్ టాప్ బాక్స్‌ను ఆన్ చేసిన తర్వాత వచ్చే స్ర్కీన్లపై ఇవి దర్శనమిస్తున్నాయి. వీటిని ఇంకా తొలగించలేదు. ఏపీ ఫైబర్ నెట్‌లో అనుమతి లేకుండా ముఖ్యమంత్రి జగన్ స్పీచ్‌తో కూడిన సిద్ధం ట్రైలర్లను ప్రదర్శిస్తున్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ జగన్ ఫొటోలు

ప్రభుత్వ వెబ్‌సైట్లలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను 24 గంటల్లో తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా అమలు కావటం లేదు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో ముఖ్యమంత్రి ఫొటోతో పాటు నవరత్నాల లోగోలను కూడా ఇంకా తొలగించలేదు.

'ఆర్టీసీ' ప్రభుభక్తి

- బస్సులపై ప్రభుత్వ పథకాల ప్రచారం

ఎన్నికల కోడ్‌ను ఆర్టీసీ ఉమ్మడి జిల్లాల అధికారులు తుంగలో తొక్కారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎన్నికల అధికారులు దిల్లీరావు, రాజబాబు అన్ని శాఖల ఉన్నతాధికారులకు కోడ్‌ను అమలు చేయాలని నోట్ ఫైల్ పంపారు. అయినా ఆర్టీసీ అధికారులు బేఖాతరు చేశారు. ఆర్టీసీ బస్సులపై వైసీపీ పోస్టర్లు అంటించి ప్రచారం చేస్తోంది. సిటీ బస్సులు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీ బస్సులపై ప్రభుత్వ అన్ని రకాల పథకాలను ప్రచారం చేస్తోంది. 'ఇది కాదా అభివృద్ధి?' అంటూ ప్రజలను ప్రశ్నించే విధంగా, ఆలోచింపజేసేలా పోస్టర్లున్నాయి. ఆర్టీసీ బస్సులపై ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచారాన్ని 24 గంటలలోపు నిలుపుదల చేయాలి. లేకపోతే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది.



ఆర్టీసీ బస్సుపై ప్రభుత్వ పథకాల ప్రచారం

నేటి నుంచి పది పరీక్షలు

జిల్లాలో 178 కేంద్రాలు ఏర్పాటు

- బాలురు 17,414... బాలికలు 15,593
- ఉదయం పదో తరగతి... మధ్యాహ్నం నుంచి ఓపెన్ స్కూల్
- ఓపెన్ స్కూల్ పరీక్షలకు 5495 మంది హాజరు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. విద్యార్థులు పది నిమిషాలు ముందుగానే పరీక్షా కేంద్రంలో ఉండాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో మొత్తం 450 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పరీక్షలు రాయబోతున్నారు. బాలురు 17,414 మంది, బాలికలు 15,593 మంది పరీక్షలకు హాజరుకాబోతున్నారు. పరీక్షల నిర్వహణకు అధికారులు మొత్తం 178 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పదో పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఓపెన్ స్కూల్‌లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల కోసం పది, ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలకు 1785, ఇంటర్ పరీక్షలకు 3710 మంది విద్యార్థులు హాజరుకాబతోతున్నారు. ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ లేకుండా చేయడానికి ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఓపెన్ స్కూల్ పరీక్షలకు రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేవారు. రెండు పరీక్షలకు కలిపి మొత్తం 14 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-19 (సోమ)
సహర్ (ఉదయం) : 5-00 (మంగళ)

దళిత డిక్లరేషన్ మ్యానిఫెస్టోల్లో చేర్చాలి

- దళిత, ప్రజాసంఘాలు

- 6లో..



ఎస్ఆర్ఆర్ కళాశాలలో క్యూ లైనులో వెళుతున్న అభ్యర్థులు



పరీక్షకు పరుగు తీస్తున్న యువతి

సవ్యంగా గ్రూప్-1 స్ర్కీనింగ్ పరీక్ష

- పేపర్-1కు 63.06 శాతం పేపర్-2కు 62.66 శాతం హాజరు

- 6లో..

పాత ప్లాస్టిక్ గోదాములో భారీ అగ్ని ప్రమాదం

- రూ.50 లక్షలకుపైగా ఆస్తి నష్టం
- ఆకునూరులో ఘటన

ఆకునూరు (ఉయ్యూరు), మార్చి 17 : ఉయ్యూరు మండలం ఆకునూరులో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దాదాపుగా రూ.50 లక్షల మేర ఆస్థి నష్టం వాటిల్లినట్టు అంచనా. సెలవు రోజు కావడంతో కూలీలు రాలేదు. దీంతో ప్రాణ నష్టం తప్పింది.

ఆకునూరు పంచాయతీ పరిధిలో విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్డును ఆనుకుని గోదాము ఉంది. కె.శ్రీనివాస్‌కు చెందిన ఈ పాత ప్లాస్టిక్ గోదాములో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ అలముకుంది. కొద్దిసేపట్లోనే మంటలు వ్యాపించాయి. గోదాములోనూ, ప్రాగణం, పక్కన ఉన్న సర్వీసు రోడ్డు వెంబడి పెద్ద గుట్టలుగా ఉన్న పాత ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలకూ మంటలు అంటుకున్నాయి. దీంతో ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. పరిసర ప్రాంతంలో నివసించేవారు భయభ్రాంతులకు గురయ్యారు. గోదాములో బీహార్ నుంచి వచ్చిన 30 మంది కా ర్మికులు, వారితోపాటు కొందరు స్థానిక మహిళలు పనిచేస్తూ ఉంటారు. ఆదివారం కావడంతో ఎవరు పనికి రాలేదు. లోపల ఉన్న కొద్ది మంది బీహార్ కార్మికులు మంటలు చూసి బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదం సంభవించినప్పుడు ఉయ్యూరు అగ్నిమాపక వాహనం గన్నవరంలో విమానాశ్రయం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ బందోబస్తులో ఉంది. పామర్రు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపు కాలేదు. పాత ప్లాస్టిక్, రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా తగలబడిపోయాయి. ప్రమాదంలో రూ.50 లక్షలకుపైగా ఆస్థి నష్టం సంభవించినట్టు అంచనా. ప్రమాదానికి కారణం ఇంకా తెలియలేదు. ప్రమాదం సంభవించినప్పుడు తరువాత గోదాము యజమాని అందుబాటులో లేరు. నివాసాల మధ్య గోదాము తొలగించాలని ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.





ఆకునూరు సమీపాన విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన పాత ప్లాస్టిక్ వస్తువుల గోదాములో ఎగసిపడుతున్న మంటలు, అగ్నిప్రమాదంలో దట్టంగా లేస్తున్న పొగ

దుర్గగుడి సేవా కౌంటర్లలో ఈవో తనిఖీలు

- 6లో..

ప్రధాని మోదీకి గన్నవరంలో ఘన స్వాగతం.. వీడ్కోలు


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం




ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగ భగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

\- చిలకలూరిపేట



ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు




ఉత్సాహంగా యువతులు..


బాబు, పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపద నృత్యాలు..


కార్యకర్తల ఉత్సాహం..


మహోత్సాహం



గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం

» ఎన్టీఆర్ జిల్లాలో పేపర్-1కు 63.06, పేపర్-2కు 62.66శాతం హాజరు

కృష్ణలంక, మార్చి 17 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. విజయవాడలో 24 కేంద్రాలో 10526 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు చేయగా, ఉదయం జరిగిన పేపర్-1కు 63.06 శాతం (6638), మధ్యాహ్నం పేపర్-2కు 62.66 శాతం (6596) మంది హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన కో-ఆర్డినేటింగ్, కస్టోడియన్, రూట్, లైజనింగ్ అధికారులు జిల్లాలో వివిధ శాఖల అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్, కో-ఆర్డినేటింగ్ అధికారి పి.సంపత్‌కుమార్ ఆదివారం విజయవాడలోని వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించారు.


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న జేసీ


ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వచ్చిన బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు

ప్రధాని మోదీకి గన్నవరంలో
ఘన స్వాగతం.. వీడ్కోలు

గన్నవరం, మార్చి 17 : భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీకి గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గుంటూరుజిల్లా చిలకలూరిపేటలో జరిగే ప్రజాగళం బహిరంగ సభలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేక విమానంలో ఆదివారం సాయంత్రం 4.08 గంటలకు గన్నవరం వచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కొనకళ్ల నారాయణ, యార్లగడ్డ వెంకట్రావు, కంభంపాటి రామ్మోహన రావు, ఎంఎస్ బేగ్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మట్టా ప్రసాద్, చిగురుపాటి కుమారస్వామి, షేక్ బాజీ, ఉప్పలపాటి శ్రీనివాసరావు, కాపు రామచంద్రారెడ్డి, పోతిన మహేశ్, బండ్రెడ్డి రామకృష్ణ, బండి రామకృష్ణ, చలమలశెట్టి రమేశ్‌బాబు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో చిలకలూరిపేట సభకు 4.15గంటలకు వెళ్లారు.

చిలకలూరిపేట ప్రజాగళం సభను ముగించుకుని ప్రత్యేక హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి ఆదివారం రాత్రి 7.35 గంటలకు ప్రధాని మోదీ చేరుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, బుద్దా వెంకన్న, శ్రీరామ్ తాతయ్య, కొలికలపూడి శ్రీనివాసరావు, నల్లబోతు వెంకట్రావు, కృపారావు, దిలీప్, వెంకట రమణారావు శ్రీనివాసులు, భరత్‌కుమార్, రాజాబాబు, శ్రీరామ్, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, రాఘవయ్య చౌదరి, గంటసాల వెంకటలక్ష్మి, అక్కల రామ్మోహనరావు, కొటికలపూడి గోవిందరావు, తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

ప్రధాని మోదీ రాకను పురస్కరించుకుని గన్నవరం విమానాశ్రయాన్ని ఎస్పీజీ కమాండర్స్ తమ అధీనంలోకి తీసుకుని బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 400లకు పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.



సౌమ్యకు అరుదైన గౌరవం

నందిగామ : నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అరుదైన గౌరవం దక్కింది. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన చిలకలూరిపేట బొప్పిడి సభలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు పాల్గొన్న వేదికపై ఆమెకు స్థానం దక్కడంతో పాటు టీడీపీ తరపున ప్రధానికి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించే అవకాశం లభించింది. ఇప్పటికే టీడీపీ, జనసేన సమన్వయ కమిటీలో సభ్యురాలిగా ఉన్న ఆమెకు రాజకీయ ప్రాధాన్యత లభించడం పట్ల పార్టీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి
రూ.3 కోట్ల నిధులు

» ఎంపీ బాలశౌరి



అవనిగడ్డ, మార్చి 17 : మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలోని బడుగు, బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉపాధి అవకాశాలను కల్పించి ఆయా వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఆదివారం ఎంపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ఇప్పటికే పార్లమెంటరీ నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకుని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని, నాబార్డు ట్రైబల్ వెల్ఫేర్ ప్రాజెక్టు కింద చైర్మన్ కేవీ షాజితో మాట్లాడి అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని నాగాయలంక, కోడూరు మండలాల్లో ఉన్న దాదాపు 500 కుటుంబాలకు లబ్ధి చేకూరేలా రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించినట్టు ఎంపీ తెలిపారు. ఆయా వర్గాల అభ్యున్నతికి నిధులు ఉపయోగపడతాయని బాలశౌరి తెలిపారు. మొత్తం 500 యానాది కుటుంబాల్లో 150 కుటుంబాలకు 30 చిన్న చిన్న బోట్లు, 30 వలలు అందజేస్తామని, మరో 150 కుటుంబాలకు చేపలు పట్టే 30 కేజ్‌లు అందిస్తామని, 30 కుటుంబాలకు ఆక్వా కల్చర్‌కు అనువుగా ఉన్న భూములను చెరువులుగా మార్చి ఇవ్వనున్నట్టు తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు 20 కుటుంబాలను కలిపి చేపల ఫీడ్ తయారు చేసే మిషనరీని కొనుగోలు చేసి వారికి అందిస్తామని, 40 కుటుంబాలకు రొయ్యలు, పీతల సీడ్ పెంచేలా రైతులను ప్రోత్సహిస్తామని బాలశౌరి తెలిపారు. యానాదుల కుటుంబాలకు ప్రతీ ఆరు నెలలకొకసారి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని, రెండు మండలాల్లోని ఐదు గ్రామాల్లో శుద్ధి చేసిన నీటిని అందించేందుకు నీళ్ల ట్యాంక్‌లు ఏర్పాటు చేస్తామని ఎంపీ బాలశౌరి ప్రకటనలో తెలిపారు.

దుర్గగుడి సేవా కౌంటర్లలో ఈవో తనిఖీలు

వన్‌టౌన్, మార్చి 17 : దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆర్జిత సేవా, విరాళాల కౌంటర్, టోల్‌ఫ్రీ, దర్శనం కౌంటర్లను ఆదివారం సాయంత్రం ఈవో కేఎస్ రామారావు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆర్జిత సేవల కౌంటర్‌లో వివిధ పూజల టికెట్‌లు ఏ మేరకు జరుగుతున్నాయి, విరాళాల కౌంటర్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అని సిబ్బందిని ఈవో అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఈవో రామారావు

అధికారులతో చైర్మన్ వాగ్వివాదం

దేవస్థానం అధికారులతో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఆదివారం వాగ్వాదానికి దిగారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. ఈ క్రమంలో దేవస్థానం అధికారులు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కార్యాలయానికి శనివారం రాత్రి తాళంవేసి అందులో పనిచేస్తున్న సిబ్బందిని అంతర్గత బదిలీచేశారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన చైర్మన్ కార్యాలయానికి తాళం వేసి ఉండడాన్ని గమనించి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. దేవస్థాన అధికారులు ప్రోటోకాల్ తప్పనిసరి అని గతంలో కూడా ఎన్నికల కోడ్ అమలు పరిచామని చెప్పడంతో చైర్మన్ వారితో వాగ్వివాదానికి దిగారు. ఈ వ్యవహారాన్ని ఈవో దృష్టికి తీసుకువెళ్లగా ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని చెప్పడంతో చైర్మన్ అక్కడ నుంచి వెళ్లిపోయారు.

బీఎస్పీ తొలి జాబితా విడుదల

పాతరాజరాజేశ్వరి పేట, మార్చి 17 : వచ్చే ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి తెలిపారు. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల తొలి జాబితా విడుదల చేశారు. 25 పార్లమెంట్ స్థానాలకు 11 మంది, 175 అసెంబ్లీ స్థానాలకు 50 మంది అభ్యర్థుల పేర్లను తెలిపారు. త్వరలో మిగతా స్థానాలు ప్రకటిస్తామన్నారు. పార్టీ కన్వీనర్ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీలకు చెందిన సీట్లను వైసీపీ రెడ్డి కులానికి కేటాయించిందన్నారు. బీసీలు తమ పార్టీలో కలిస్తే సీట్లు కేటాయిస్తామని కోరారు.

నేడు స్పందన నిలుపుదల

మచిలీపట్నం టౌన్/కృష్ణలంక మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున సోమవారం కలెక్టరేట్‌లలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం తాత్కాలికంగా నిలుపుదల చేశామని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు రాజాబాబు, ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న సోమవారం నిర్వహించే స్పందన రద్దు చేసినట్టు చెప్పారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అములులో ఉందన్నారు.

దళిత డిక్లరేషన్ మ్యానిఫెస్టోల్లో చేర్చాలి

» దళిత, ప్రజాసంఘాలు

ధర్నాచౌక్, మార్చి 17 : రాజ్యాంగ పరిరక్షణ, దళితుల ఆత్మగౌరవం కోసం సామాజిక న్యాయం, దళిత సమస్యలపై దళిత డిక్లరేషన్ అన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో పెట్టాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన దళిత, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులపై నిత్యం దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన ఘటన దేశాన్ని తలదించుకునేలా చేసిందన్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు సైతం ఖండించకపోవడాన్ని తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, అత్యాచారాల కేసులను విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని తీర్మానించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంద్ర మల్యాద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ నాయకుడు వి.శ్రీనివాసరావు, పౌరహక్కుల నేత పిచ్చుక శ్రీనివాస్, జాతీయ రైల్వే ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జోనల్ నేత గుటాల పాపారావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేత జి.స్వరూపదత్, వ్యవసాయ సంఘం నేత దడాల సుబ్బారావు, గోళ్ల నారాయణరావు, వివిధ సంఘాల నేతలు గంజి రామారావు, సంగుల పేరయ్య, మంతెన సీతారాం, కారుమంచి రామారావు, జి.నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాసేవ చేసేందుకు
రాజకీయాల్లోకి వచ్చా

» బందరు వైసీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్



పామర్రు, మార్చి 17 : నిజాయితీగా ప్రజలకు సేవలందించేందుకు వైద్య వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలు నిండు మనసుతో ఆశ్వీరదించాలని బందరు వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో తాజామాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి దివంగత సింహాద్రి సత్యనారాయణ టీడీపీ హయంలో దేవదాయ శాఖ మంత్రిగా సేవలందించి ప్రజల్లో పేరు తెచ్చుకున్నారన్నారు. జగన్ ఆదేశాల మేరకు తాను బందరు పార్లమెంట్ అభ్యర్థిగా నిస్వార్థంగా ప్రజలందరికీ మెరుగైన సేవలందిస్తానని హామీ ఇస్తున్నానన్నారు. కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో మిగిలి ఉన్న అభివృద్ధిని రాబోయే రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

వాహన తనిఖీల్లో
రూ.40 లక్షలు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, మార్చి 17 : అంతరాష్ట్ర చెక్ పోస్టు గరికపాడు వద్ద నిర్వహిస్తున్న తనిఖీలలో భాగంగా ఆదివారం ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.40 లక్షల నగదుతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న అమరావతి బస్సులో తనిఖీలు చేయగా అనుమానాస్పదంగా ఉన్న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ధనుంజయ, విజయనగరం జిల్లా కోన గ్రామానికి చెందిన వెంకటేశ్ బ్యాగులు తనిఖీ చేయగా నగదు గుర్తించి వారిని చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.


బొప్పరాజును సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సభ్యులు

కృతజ్ఞతా సత్కారం

కృష్ణలంక, మార్చి 17 : గ్రేడ్-2 వీఆర్‌వోలకు ఒక సంవత్సరం కండిషనల్ ప్రొబిషన్ డిక్లరేషన్ మెమోకు విశేష కృషి చేసిన ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, మాజీ ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తిలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సభ్యులు ఆదివారం వేదపండితుల సమక్షంలో విజయవాడ రెవెన్యూభవన్‌లో టీటీడీ తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు. 935 మంది గ్రేడ్-2 వీఆర్‌వోల జీవితాలలో వెలుగు నింపిన ఏపీఆర్ఎస్ఏకు రుణపడి వుంటామని వీఆర్‌వోలు తెలిపారు. అభినందన సభకు గుంటూరు జిల్లా ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షులు పీప కిరణ్‌కుమార్, ఏపీ వీఆర్ఏల రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, అర్లయ్య, శంకరరావు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మి, జనరల్ సెక్రటరీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.18

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్, మార్చి 17: తెలుగు కళావాహిని పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక కళా సమితి, శ్రీ కళాభారతి సంస్థల సంయుక్త అద్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద సత్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు శేషగిరిరావు, కుమార్‌గుప్తా, డేవిడ్ రాజు, ప్రిన్స్, మోహన్‌కృష్ణ, సుదర్శనరాజు, మస్తాన్‌వలి, స్వాతి, మాధవి, నేనకుమారి, రోజాలక్ష్మి, మల్లీశ్వరిలు మధురగానం చేశారు. చింతకాయల చిట్టిబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులను ఘనంగా సత్కరించారు.



గీతాలు ఆలపిస్తున్న గాయకులు



పులిబండ్ల కృష్ణను అభినందిస్తున్న కేశినేని చిన్ని

టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడికి అభినందన

గవర్నర్‌పేట, మార్చి 17: టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పులిబండ్ల కృష్ణను ఆ పార్టీ సీనియర్ నాయకుడు కేశినేని చిన్ని అభినందించారు. 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆదివారం కేశినేని చిన్నిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. పులిబండ్లను చిన్ని అభినందించారు. పార్టీ కోసం పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు రాజుజైన్, ఆటో యూనియన్ నాయకుడు కె.రత్న పాల్గొన్నారు.



ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తున్న యూఎఫ్‌డీ నేతలు

వచ్చే ఎన్నికల్లో ప్రజా సమస్యలే ప్రధాన అజెండా: యూఎఫ్‌డీ

ధర్నాచౌక్, మార్చి 17: ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా యునైటెడ్ ఫోరం ఫర్ డెమోక్రసీ (యూఎఫ్‌డీ) వచ్చే ఎన్నికల్లో పనిచేస్తుందని ఫోరం రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ జాహీద్ తెలిపారు. ఎన్నికలకు ప్రజా మేనిఫెస్టోను గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఫోరం సభ్యులు విడుదల చేశారు. రాజకీయాల్లో ప్రస్తుత ధోరణులు ప్రమాదకరంగా ఉన్నాయని ఫోరం కో-కన్వీనర్లు పిచ్చుక శ్రీనివాస్, అబ్దుల్ మతీన్ ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలు ప్రజా సమస్యలు విస్మరించి అధికార కాంక్షతోనే పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ఫోరం తరఫున మేనిఫెస్టోను రూపొందించామన్నారు. ఇందులో అంశాలను తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని అన్ని రాజకీయ పార్టీలను వారు డిమాండ్ చేశారు. అర్హులైన వారు ఏప్రిల్ 15లోగా కొత్తగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.



40వ డివిజన్ నుంచి చిలకలూరిపేట ప్రజాగళం సభకు వెళుతున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న బుద్దా వెంకన్న, వన్‌టౌన్ అర్జున వీధి నుంచి వెళుతున్న బస్సులను ప్రారంభిస్తున్న కాండ్రేగుల రవీంద్ర

ప్రజాగళం సభకు తరలిన టీడీపీ శ్రేణులు

వన్‌టౌన్, మార్చి 17: చిలకలూరిపేట వద్ద ఆదివారం జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ ప్రజాగళం సభకు పశ్చిమ నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్లారు. టీడీపీ 40వ డివిజన్ అధ్యక్షుడు పీవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో బస్సులు బయలుదేరాయి. టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న పార్టీ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. 52వ డివిజన్ అర్జునవీధి నుంచి కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), డివిజన్ అధ్యక్షుడు ఈగల సాంబ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు సభకు భారీగా తరలివెళ్లారు. సభకు వెళుతున్న బస్సులను కాండ్రేగుల రవీంద్ర, ఉమ్మడి చంటి జెండా ఊపి ప్రారంభించారు.

ఊర్మిళానగర్ నుంచి..

భవానీపురం: ప్రజాగళం సభకు ఊర్మిళానగర్ చర్చి సెంటర్ నుంచి 43వ డివిజన్ అధ్యక్షుడు మోర బోయిన రాంబాబు ఆధ్వర్యంలో, 41వ డివిజన్ నుంచి డివిజన్ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు. కొనికి కొండయ్య తదిరులు పాల్గొన్నారు.



చర్చి సెంటర్ నుంచి చిలకలూరిపేట వెళుతున్న టీడీపీ నాయకులు

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

కృష్ణలంక, మార్చి 17: అన్ని వర్గాలకు సంక్షేమ పాలన అందించడం టీడీపీకే సాధ్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం ఉదయం కృష్ణలంక పొట్టి శ్రీరాములు హైస్కూల్ ఆవరణలో కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో ఆయన ముచ్చటించారు. "వైసీపీ అధికారంలోకి రాగానే ప్రజా వేదికను కూల్చేసింది. అన్న క్యాంటీన్లు, రంజాన్ తోఫా, సంక్రాంతి కానుకలు తీసేసింది. పేదలకు రూ.10 ఇచ్చి రూ.100 లాక్కొంటుంది. గత ప్రభుత్వ హయాంలో గ్యాస్ సిలెండర్ ధర రూ.500 నుంచి 600 మధ్య ఉంటే, అప్పట్లో సబ్సిడీ కింద రూ.250 నుంచి రూ.300 మధ్య అకౌంట్లలో జమ అయ్యేవి. ఇప్పుడు గ్యాస్ ధర రూ.వెయ్యికి పెరిగింది. సబ్సిడీని వైసీపీ ప్రభుత్వం తీసేసింది. కార్మికులకు, చేతివృత్తులవారికి, తాపీ పనివారికి పనులు లేవు. లారీ ఇసుక ధరను రూ.40 వేలకు పెంచేసింది. కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగాయి. వైసీపీ ఇచ్చే సంక్షేమ పథకానికి కరెంటు బిల్లుకు ముడిపెట్టింది." అని గద్దె రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ నిలిపివేసిన పథకాలన్నీ అధికారంలోకి రాగానే సామాన్యులు, పేదల సంక్షేమం కోసం టీడీపీ అమలు చేస్తుందన్నారు. వాకర్స్ సభ్యులు దమ్మాలపాటి రంగారావు, నిమ్మల దుర్గారావు, టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గోరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, మోటేపల్లి చిన్నా, వెన్నా శంకర్, ఆర్.రమాదేవి, జనసేన నాయకులు పోతిరెడ్డి రమణ, కోడూరి కిరణ్‌కుమార్, వడ్లమూడి నాయుడు, వడ్లమూడి సుబ్బారావు, జి. జయ, బత్తుల ధరణి, చింతా రాజేష్, నేపాల్, బత్తుల రమేష్, కొంకి లక్ష్మణ్ పాల్గొన్నారు.



కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



వాంబేకాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న బాబూరావు

ఉత్తుత్తి ఇళ్ల పట్టాలిచ్చి ప్రజలను మోసం చేస్తున్న వైసీపీ

● సీపీఎం నేత సీహెచ్ బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం ఉత్తుత్తి ఇళ్ల పట్టాలు ఇచ్చి పేద ప్రజలను మరోసారి మోసం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 60వ డివిజన్ వాంబేకాలనీలో ఆదివారం నిర్వహించిన మార్పుకోసం సీపీఎం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కాకుండా రాజకీయ ప్రచారం కోసం జగన్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను వాడుకోవడం శోచనీయమన్నారు. స్థలాలను చూపకుండా పట్టాలు, రిజిస్ట్రేషన్ అని ప్రజలను వైసీపీ నేతలు వంచిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి జగన్ బొమ్మలతో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం సరికాదన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో పేదలను మరోసారి మోసం చేయాలనుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● రౌడీషీటర్లకు డీసీపీ టి.హరికృష్ణ హెచ్చరిక

వన్‌టౌన్, మార్చి 17: రానున్న ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, చట్టవిరుద్ధమైన పనుల్లో పాలు పంచుకోవడం చేస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను డీసీపీ టి.హరికృష్ణ హెచ్చరించారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆయన వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండి కుటుంబసభ్యులతో సంతోషంగా ఉండాలని, అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకుని గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగిన వారిని, తప్పులు దిద్దుకుని సరైన మార్గంలో నడుస్తున్న వారిని గుర్తించి ఉన్నతాధికారుల అనుమతితో వారిపై ఉన్న షీట్లను ఎత్తివేస్తామని తెలిపారు. వెస్ట్ డివిజన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, సీఐలు దుర్గాశేఖర్‌రెడ్డి, గణేష్, కృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ టి.హరికృష్ణ

కౌన్సెలింగ్‌కు హాజరుకాని పలువురు అధికార పార్టీకి చెందిన రౌడీషీటర్లు

రౌడీషీటర్ల కౌన్సెలింగ్‌కు వన్‌టౌన్, భవానీపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అధికార పార్టీకి చెందిన కొందరు రౌడీషీటర్లు హాజరుకాలేదని తెలుస్తోంది. వీరందరూ ఎన్నికల్లో పోటీచేసే వైసీపీ అభ్యర్థుల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు సమాచారం. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ రౌడీషీటర్ ప్రతి ఆదివారం జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావడం లేదని తెలిసింది.



వీధికి అడ్డుగా విద్యుత్ స్తంభం

● ఇబ్బంది పడుతున్న స్థానికులు

పాతరాజరాజేశ్వరి పేట, మార్చి 17: 56వ డివిజన్ పాతరాజ రాజేశ్వరిపేట ఆరో లైన్‌లోని ఓ వీధిలో ఎన్నో ఏళ్ల నుంచి వీధికి అడ్డుగా విద్యుత్ స్తంభం ఉంది. దీని కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను నాయకులు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. దారికి అడ్డుగా ఉన్న కరెంటు సిమెంట్ స్తంభాన్ని తొలగించి సమస్యను పరిష్కరించాలని నాయకులు, అధికారులను స్థానికులు కోరుతున్నారు.

పాతరాజరాజేశ్వరిపేట ఆరో లైన్‌లో వీధికి అడ్డుగా ఉన్న కరెంటు స్తంభం

స్వచ్ఛంద సేవా సంస్థలు పేదలను ఆదుకోవాలి

గవర్నర్‌పేట, మార్చి 17: స్వచ్ఛంద సేవా సంస్థలు పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని సామాజికవేత్త, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా సూచించారు. వాసవీ క్లబ్ విజయవాడ ఈస్ట్ కపుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు రోడ్డులోని స్వర్ణ కాంప్లెక్ సమీపంలో బాటసారులకు బ్రెడ్స్, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ గణేష్, మాజీ గవర్నర్ రామచంద్రరాజు, వైస్ గవర్నర్ సాయి సునీత, ప్రభాకరరావు, కార్యదర్శి శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న టిప్పర్

● ఫొటోగ్రాఫర్ దుర్మరణం

ఎ.కొండూరు, మార్చి 17 : చీమలపాడు పెద్దతండా సమీపంలో గంపలగూడెం- నూజివీడు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం చెందాడు. కృష్ణారావుపాలెం శివారు కేశ్యాతండాకు చెందిన మూడు ప్రసాద్(22) ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తన స్కూటీపై గంపలగూడెం వైపు నుంచి చీమలపాడు వస్తుండగా చీమలపాడు నుంచి వినగడప క్వారీకి వెళుతున్న టిప్పర్ పెద్దతండా సమీపంలో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం మైలవరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్సై కృష్ణ తెలిపారు.




ప్రసాద్(ఫైల్)

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గవర్నర్‌పేట, మార్చి 17: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. నాట్య శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.











దిక్సూచి DIKSUCHI



న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ 2024-25 మాన్‌సూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్/జేజీఈఈబీఐఎల్ఎస్ 2024 స్కోర్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్

ఇమ్యూనాలజీలో పీహెచ్‌డీ

ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 8 నుంచి
- **ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** ఏప్రిల్ 28
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 6న
- **మొదటి రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 4, 6
- **రెండో రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 10, 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nii.res.in

హైదరాబాద్-హబ్సిగూడలో సీఎస్ఐఆర్ నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మోడ్రన్ బయాలజీలో పరిశోధనలు చేయాలనుకొనే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: సెల్ బయాలజీ, మాలిక్యులార్ బయాలజీ, జెనెటిక్స్, జినోమిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ, ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ, కన్జర్వేషన్ బయాలజీ, ఎకాలజీ, ప్రొటీన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, బయాలజీ ఆఫ్ మాక్రోమాలిక్యూల్స్, బయాలజీ ఆఫ్ ఇన్ఫెక్షన్, ఇమ్యూనాలజీ, ఎపిజెనెటిక్స్, క్రోమాటిన్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్.

అర్హత: సైన్స్ విభాగాల్లో ఏదేని మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. యూజీసీ/సీఎస్ఐఆర్/డీబీటీ/డీఎస్‌టీ/ఐసీఎంఆర్/



సీసీఎంబీలో పీహెచ్‌డీ

డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పైర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీ పూర్తయ్యేవరకూ ఫెలోషిప్ వ్యాలిడిటీ ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించి స్క్రీనింగ్ చేసిన అభ్యర్థులను కంప్యూటర్ బేస్డ్/రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో అర్హత పొందినవారికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ లెక్చరర్‌షిప్ అర్హత మాత్రమే ఉన్న వారిని ఇంటర్వ్యూకి అనుమతించరు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 22
- **ఇంటర్వ్యూ సెంటర్:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** ccmb.res.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ముంచుకొస్తున్న మంచు రహిత స్థితి



ప్రమాదంలో భూగోళం

భూమికి ఉన్న రెండు ధ్రువాల్లో మంచు ఫలకాలతో పాటు అతిశీతల వాతావరణం ఉంటుంది. భూమిపై ఉన్న మంచినీటిలో 70 శాతం వరకు ఈ ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని పోలార్ ఐస్ క్యాప్ ప్రాంతాల్లో మంచు ఫలకాలుగా గడ్డకట్టి ఉంది. ఇంత భారీస్థాయిలో పేరుకొని ఉన్న ఈ మంచు, ప్రపంచ పర్యావరణం సమతౌల్య స్థితిలో ఉండడానికి కారణమౌతోంది. నిర్దిష్టంగా పరిశీలిస్తే ఒక్కో ధ్రువ భాగం ఒక్కో రీతిలో తమ ప్రభావాన్ని విలక్షణంగా భూమిపై చూపుతుంటాయి. ఇదంతా ఇరు మంచు ధ్రువాలు తమదైన సహజ స్థితిలో ఉన్నప్పటి మాట. కానీ నేడు మానవ కార్యకలాపాల వల్ల భూతాపం పెరిగి ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని మంచు వేగంగా కరిగిపోతోంది. ఈ కారణంగా అనేక పర్యావరణ సమస్యలతోపాటు అంతిమంగా భూమిపై జీవరాశి మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి గోచరిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్కిటిక్(ఉత్తర), అంటార్కిటిక్(దక్షిణ) ధ్రువాలు తమదైన రీతిలో భూ వాతావరణం, పర్యావరణాలకు ఏవిధంగా సహకరిస్తున్నాయి? భూతాపం పెరగడం వల్ల అవి ఏవిధంగా విపరిణామాలను సంధించబోతున్నాయి? పరిస్థితిని తక్షణమే చక్కబరచేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏవి? వంటి అంశాల కోణంలో ఒక అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరం ఉంది.

- ప్రపంచ జనాభాలో దాదాపు 90 శాతం మంది ఉత్తరార్ధ గోళంలోని దేశాల్లో జీవిస్తున్నారు. అందువల్ల ఈ ప్రాంతంలోని దేశాలపై ఉత్తర ధ్రువ ప్రాంతంలోని ఆర్కిటిక్ మంచు మహాసముద్ర ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దక్షిణార్ధ ధ్రువంలోని అంటార్కిటికా మంచు ఖండం వలె కాక ఆర్కిటిక్ ప్రాంతపు స్నో క్యాప్ అనేది సముద్రంపై తేలియాడే మంచు ఫలకాల రూపంలో ఉంటుంది. కాబట్టి ఈ ప్రాంతంలో అంటార్కిటికాతో పోలిస్తే జీవరాశి మనుగడ ఎక్కువ. ఈ మంచు ఫలకాలు అతిశీతల ఉపరితల గాలులను కింద ఉన్న వెచ్చటి సముద్ర జలాలకు చేరకుండా అడ్డుకోవడం వల్ల అక్కడ భారీ స్థాయిలో జలచరాలు జీవించగల్గుతున్నాయి. నార్వే, డెన్మార్క్, కెనడా, అమెరికా, రష్యా వంటి తీర దేశాలు ఈ ప్రాంతపు మత్స్య సంపదపై భారీగా ఆధారపడి ఉన్నాయి. ప్రపంచ మత్స్య సంపదలో దాదాపు 10 శాతం ఈ ప్రాంతంలోనే ఉందని అంచనా! అంతేకాక ఈ ఉత్తర ధ్రువ ప్రాంతపు జెట్‌స్ట్రీమ్స్ ఉత్తర అమెరికా, పశ్చిమ యురోపియన్ దేశాల వాతావరణం, వర్షపాతంపై విశేష ప్రభావాన్ని చూపుతాయి. అదే విధంగా దక్షిణ ధ్రువ ప్రాంతపు జెట్‌స్ట్రీమ్స్ ప్రభావం కూడా ఉత్తరార్ధ గోళంపై విశేషంగా ఉంటుంది. ముఖ్యంగా భారతదేశానికి వర్షపాతం అందించే రుతుపవన వ్యవస్థ రూపు కట్టడంలో ఈ జెట్‌స్ట్రీమ్స్ పాత్ర కీలకం. ఉత్తరార్ధగోళంలోని మధ్య అక్షాంశ ప్రాంతాల్లో వాతావరణ సమతౌల్యానికి హీట్‌వేవ్స్‌ను అడ్డుకోవడంలో ఆర్కిటిక్ ప్రాంత శీతల గాలులు సహకరిస్తాయి.

'కొలరాడో' పరిశోధనల్లో దిగ్భ్రాంతికర విషయాలు

- ఇటీవల కొలరాడో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆర్కిటిక్ ప్రాంతంలో దశాబ్దాలుగా చేపట్టిన పరిశోధనల నివేదిక ఆ ప్రాంతంలో మార్పులపై దిగ్భ్రాంతికర అంశాలు వెల్లడించింది. 2050 నాటికి ఆర్కిటిక్ మహాసముద్రంలో ఒక నెల పాటు వేసవికాలంలో సముద్ర జలాలపై మంచు కనుమరుగైపోనుందని ఈ నివేదిక తెలిపింది. ఆర్కిటిక్ సముద్రంలో తేలియాడే సముద్రపు మంచు ఒక చదరపు కిలోమీటరు విస్తీర్ణం కంటే తక్కువగా ఉంటే దాన్ని 'మంచు రహితం(ఐస్ ఫ్రీ కండిషన్)'గా పరిశోధకులు చెబుతారు. అదేవిధంగా ఈ పరిస్థితి, ఈ శతాబ్దం చివరి నాటికి కొన్ని నెలలపాటు ఏర్పడవచ్చని భావిస్తున్నారు. దీనికి కారణం ఆర్కిటిక్ ధ్రువ ప్రాంతంలోని సముద్ర జలాలు మిగతా భూగోళం కన్నా మూడు రెట్లు ఎక్కువగా వేడెక్కుతుండడం వల్ల మంచు వేగంగా కరిగిపోవడమేనని పరిశోధకులు చెబుతున్నారు.
- 1979తో పోలిస్తే గత ఏడాది సెప్టెంబరులో ఆర్కిటిక్ సముద్రంలో 2.6 మిలియన్ చదరపు కిలోమీటర్ల మేర సముద్ర మంచు విస్తీర్ణం తగ్గిందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితులు ఆ ప్రాంతంలో జీవించే మంచు ఎలుగుబంట్లు, వాల్‌రస్, రెయిన్ డీర్స్ వంటి జీవుల ఆహార వేట, సంతానోత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతాయి.
- ధ్రువ ప్రాంతాల్లో మంచుతో కప్పిన నేల(పెర్మా ఫ్రాస్ట్) కింద బందీ అయిన మీథేన్ వాయువు, మంచు కరిగిపోవడం వలన భారీస్థాయిలో వాతావరణంలోకి విడుదలవుతుంది. దీనివల్ల ప్రపంచ భూతాపం మరింత పెరిగి విపత్కర పరిస్థితులకు దారి తీస్తుంది. కార్చిచ్చులు విజృంభిస్తాయి. వర్షాభావ పరిస్థితులు, కరవులు వంటి వాతావరణ విపత్తులు ప్రపంచ దేశాలను చుట్టుముడతాయి. సముద్ర ఉష్ణోగ్రతలను అదుపు చేసే ఆర్కిటిక్ శీతల వాతావరణం గాడి తప్పడంవల్ల సముద్ర ప్రవాహాలు వేడెక్కి అలల ఉధ్రుతి పెరిగి తీరప్రాంతాలు భారీగా కోతకు గురవుతా యి. సముద్రాల ఉష్ణోగ్రతలు పెరిగి జలచరాలు మరణిస్తాయి. దీనితో సముద్ర పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. మత్స్యసంపద తగ్గిపోయి వాటిపై ఆధారపడే దేశాలు, ప్రజలు ఆర్థిక, ఆహార సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.
- మంచు భారీ స్థాయిలో కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరిగి తీరప్రాంత నగరాలు, దీవుల దేశాలు మునిగిపోతాయి. వేసవిలో తెల్లని ఆర్కిటిక్ మంచు కరగిపోతే దాని కింద ఉన్న నల్లని సముద్ర జలాలు నల్లని దుస్తుల మాదిరిగా సూర్యకాంతిని శోషించుకోవడం వల్ల భూ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మంచు పేరుకుంటే అది భూమి/నీటి కంటే ఎక్కువ స్థాయిలో సూర్యకాంతిని పరావర్తనం చెందించడం(ఆల్బిడో) వల్ల ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ప్రపంచ ఉష్ణోగ్రతల ప్రభావం కారణంగా దక్షిణార్ధ గోళం(అంటార్కిటికా ప్రాంతం)లో కూడా మార్పులు సంభవిస్తున్నాయి. నిజానికి ఈ ప్రాంతంలో భూప్రాంతం తక్కువ. సముద్ర పరివేష్టితం ఎక్కువ. అయినప్పటికీ ఉత్తరార్ధ గోళంలో మితిమీరి పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, శిలాజ ఇంధన ఉద్గారాలు వంటివి దక్షిణార్ధ గోళంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో భారీస్థాయిలో దక్షిణ ధ్రువంలో ఘనస్థితిలో మేటవేసి ఉన్న భారీ హిమఖండంలో ఏ మాత్రం మార్పులు వచ్చినా సముద్ర మట్టాలు భారీగా పెరుగుతాయి. దీనితో ప్రపంచదేశాల తీరప్రాంతాలన్నింటిపై ప్రభావం పడుతుంది. మడ అడవుల వంటి తీరప్రాంతాల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల తుఫానుల తీవ్రత, సంభావ్యత పెరుగుతుంది. పంటల నష్టం, రుతుపవనాలు గాడి తప్పడం, ఆహార సంక్షోభం ఏర్పడతాయి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

అక్కడ ఖనిజాల వెలికితీత ప్రమాదం

- ఆర్కిటిక్ ప్రాంతంలో సముద్ర మంచు కరగడం అంటే సముద్రయానానికి సౌలభ్యం కలగడమే. ఈ ప్రాంతంలో భారీస్థాయిలో ఇంధన, ఖనిజ నిక్షేపాలు ఉండడం వల్ల అమెరికా, చైనా వంటి అగ్ర రాజ్యాల కన్ను ఇప్పటికే అక్కడ ఉంది. ఈ ఆర్కిటిక్ ప్రాంత సముద్రమార్గాలను సైతం చైనా, అమెరికా వ్యూహాత్మకంగా అభివృద్ధి పరచుకుంటున్నాయి. కొన్ని నెలలపాటు ఈ ప్రాంతాల్లో మంచు రహిత స్థితి కొనసాగడమంటే అక్కడి ఖనిజాల దోపిడీకి అగ్రరాజ్యాలకు దారివ్వడమే. ఆర్కిటిక్ పరివేష్టిత దేశాలన్నీ ఈ సరిహద్దు ఉద్రిక్తతల్లో భాగమవుతాయనడంలో సందేశం లేదు. ఖనిజాల వెలికితీత ప్రక్రియ ఆర్కిటిక్ ఆవరణ వ్యవస్థపై మరింత దుష్ప్రభావం చూపి ప్రపంచ పర్యావరణాన్ని తీవ్రంగా నష్టపరుస్తుంది. ఇది క్రమంగా మానవాళి మనుగడనే సందేహాస్పదం చేస్తుంది.
- 1800 నాటితో పోలిస్తే భూ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌లకు కట్టడి చేయాలనీ లేదా కనీసం ఆ పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్‌ల లోపే ఉండేలా చూడాలని పారిస్ ఒప్పందం నిర్దేశిస్తోంది. కానీ ఆ 1800 నాటితో పోలిస్తే ఆర్కిటిక్ ప్రాంత ఉష్ణోగ్రతలో ఇప్పటికే 2 డిగ్రీల సెల్సియస్ పెరుగుదల కనిపిస్తోందని పరిశోధకులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితి అత్యవసర దిద్దుబాటు చర్యల కోసం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది.
- ఉపగ్రహ అంచనాల ప్రకారం ఏటా ఆర్కిటిక్ ప్రాంతంలో 13 శాతం చొప్పున మంచు కరగిపోతోంది. దీనికి 90 శాతం కారణం మానవ చర్యలే. శిలాజ ఇంధన వాడకం, పరిశ్రమల ఉద్గారాలను తగ్గించే దిశగా పారిస్ ఒప్పందం, సీఓపీ-28 తీర్మానాలను నిబద్ధతతో ప్రపంచ దేశాలన్నీ ముఖ్యంగా పారిశ్రామిక దేశాలు అమలుపరచాలి. ఆర్కిటిక్ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు, ఖనిజాన్వేషణ ప్రయత్నాలను నిషేధిస్తూ పటిష్ట ఒప్పందాలు రావాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఆర్కిటిక్ సముద్ర తీర దేశాలు మధ్య ఆర్కిటిక్ ప్రాంత భౌగోళిక సున్నితత్వం దృష్ట్యా జలచరాల వేటను, ఫిషింగ్ కార్యకలాపాలను ఆ ప్రాంతంలో నిషేధిస్తూ ఒక ఒప్పందానికి వచ్చాయి. ఇటువంటి ఒప్పందాలు ఉష్ణోగ్రతల కట్టడి విషయంలో కూడా రావాల్సి ఉంది.

'కోడ్' మీకే.. మాక్కాదు!

- ఇదీ.. సీఎం జగన్ తీరు
- ఫైబర్ నెట్‌లో బరితెగించి ప్రచారం
- ఎన్నికల సంఘానికి అచ్చెన్న ఫిర్యాదు



పార్వతీపురంలో ఆదివారం ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ ఉన్న ఇంటిలో టీవీ ఆన్ చేయగానే దర్శనమిచ్చిన సీఎం జగన్ ప్రచార చిత్రాలు

పార్వతీపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి), అవనిగడ్డ: దేశవ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఏపీలో అయితే.. ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కోడ్‌ను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ప్రకటించాయి. కానీ, వైసీపీ ప్రభుత్వం మాత్రం "కోడ్ మీకే కానీ.. మాక్కాదు!" అన్నట్టుగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర సర్కారు అధీనంలోని ఫైబర్ నెట్‌లో యథేచ్ఛగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఊదరగొడుతోంది. సీఎం జగన్ ఫొటోలు, ఆయన విద్వేషపూరిత ప్రసంగాలను ప్రసారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లక్షల సంఖ్యలో ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి. ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థ. ఇప్పటి వరకు దీనిలో ఎలాంటి కార్యక్రమాలు ప్రసారం అయ్యాయనేది పక్కన పెడితే.. కోడ్ అమల్లోకి వచ్చాక.. ప్రభుత్వ పార్టీ ప్రయోజనాలను పక్కన పెట్టాల్సిన అవసరం ఉంది. అయితే.. వైసీపీ ప్రభుత్వం కోడ్‌ను తూచ్ అంటోంది. మాకు వర్తించదని తన చర్యల ద్వారా స్పష్టం చేస్తోంది. ఫైబర్‌నెట్‌లో అధికార పార్టీ అనుకూల ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పలు ప్రాంతాల్లో ఏపీఫైబర్ నెట్‌లో వైసీపీ ప్రభుత్వ పథకాలు, సీఎం జగన్ ముఖచిత్రాలు, ఆయన ప్రసంగాలు విస్తృతంగా ప్రసారమయ్యాయి. అదేవిధంగా మంత్రి గుడివాడ అమర్నాథ్, ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్ గౌతంరెడ్డి చిత్రాలు పదేపదే ప్రసారమయ్యాయి. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన వ్యూహం సినిమా పార్ట్-1, పార్ట్-2ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని ప్రచారం చేశారు. చిత్రం ఏంటంటే ఇతర టీవీ చానళ్లను నిలిపివేసి.. వీటినే ప్రసారం చేయడం! ఇలా కోడ్‌ను ధిక్కరించి మరీ సర్కారు పెద్దలు ప్రచారం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు చేయడంతో సాయంత్రానికి వైసీపీ సర్దుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ ఉన్న ప్రతిఇంట్లో ఆదివారం టీవీ ఆన్ చేయగానే.. సీఎం జగన్ ఫొటోనే దర్శనమిచ్చింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రసారమయ్యాయి. ప్రతిపక్ష నాయకులపై విమర్శలు గుప్పిస్తూ.. సీఎం జగన్ చేసిన ప్రసంగాలను ప్రసారం చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఇలా వైసీపీ పథకాలను ప్రసారం చేయడంపై జిల్లావాసులతో పాటు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు నివ్వెరపోయారు. ఇది ముమ్మాటికీ కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని వారు పేర్కొన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, నేతల ఫ్లెక్సీలను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు తొలగిస్తున్నారు. విగ్రహాలకు కూడా ముసుగులు వేస్తున్నారు. అలాంటిది.. ఏపీ ఫైబర్ నెట్ ద్వారా అధికార పార్టీ బరితెగించి తమ పథకాలను ప్రసారం చేయడంపై రాజకీయ పక్షాలు మండిపడుతున్నాయి.



ఏపీ ఫైబర్ నెట్‌లో జగన్, మంత్రి గుడివాడ అమర్నాథ్, ఫైబర్ నెట్ ఛైర్మన్ గౌతంరెడ్డి చిత్రాలు

ఆపించండి: టీడీపీ ఫిర్యాదు

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫైబర్‌నెట్‌లో జగన్ చిత్రాలు, ప్రసంగాలు ప్రసారం చేయడం ఎన్నిక నియమావళికి విరుద్ధమని, వెంటనే వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. ఫైబర్‌నెట్ అధికారులకు ఆ మేరకు ఆదేశాలివ్వాలని కోరారు. అదేవిధంగా వ్యూహం సినిమాను అదే పనిగా ప్రసారం చేస్తున్నారని, ఆ సినిమా ప్రసారాన్ని కూడా నిలిపేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం జగన్ బొమ్మను తొలగించాలని, కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. అదేవిధంగా ఏపీఎస్ఎఫ్ఎల్ పాల్పడుతున్న అధికార దుర్వినియోగంపై టీడీఎల్‌పీ కార్యదర్శి కోనేరు సురేష్ ఆదివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనాకు ఫిర్యాదు చేశారు. ఫైబర్ నెట్‌లో ప్రసారమవుతున్న ప్రభుత్వ ప్రకటనలను నిలుపుదల చేయించాలని, ఉద్దేశ పూర్వకంగా బ్లాక్ చేసిన వార్తా చానళ్లను ఫైబర్ నెట్‌లో వెంటనే ప్రసారమయ్యేలా ఆదేశించాలని కోరారు.

ఫ్లెక్సీల తొలగింపులో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో సచివాలయ ఉద్యోగి, విద్యార్థి దుర్మరణం
- విశాఖ, సిక్కోలు జిల్లాల్లో విషాదం..

దేవరాపల్లి, హరిపురం, మార్చి 17: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు... విధి నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగా విశాఖ జిల్లా దేవరాపల్లి మండలంలో గ్రామ సచివాలయ ఉద్యోగి ఒకరు విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా హరిపురంలో ఫ్లెక్సీ తొలగిస్తుండగా ఐటీఐ చదువుతున్న విద్యార్థి కూడా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర కథనం మేరకు.. విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లికి చెందిన డెక్క చిరంజీవి(34) దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను ఆదివారం సాయంత్రంలోగా తొలగించి, ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కిందిస్థాయి ఉద్యోగులకు మండల అధికారులు హుకుం జారీ చేశారు. కొత్తపెంట సచివాలయం పరిధిలో ఫ్లెక్సీలు తొలగించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి తన స్నేహితుడు దాసరి శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై ఉదయం 8గంటలకు ములకలాపల్లి గ్రామానికి చేరుకున్నాడు. పాల కేంద్రానికి సమీపంలో ఉన్న ఒక ఫ్లెక్సీని చిరంజీవి తొలగిస్తుండగా.. దీని ఇనుపచట్రం, పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీప పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు వెంటనే వచ్చి, ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో ఇసుక తీసుకువచ్చి అతడి శరీరంపై పోశారు. వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందిని రప్పించగా, వారు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. మృతుడు చిరంజీవికి భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3), తల్లి కృష్ణమ్మ ఉన్నారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా మందస మండలం సిరిపురం గ్రామంలో వైసీపీకి చెందిన కటౌట్లు తొలగిస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురై ఐటీఐ విద్యార్థి బోంద్ర శివశంకర్(21) మృతి చెందాడు. ఎన్నికల కోడ్ రావటంతో సిరిపురంలోని అధికార పార్టీకి చెందిన కటౌట్లు తొలగించే బాధ్యతను సంబంధిత పార్టీ నాయకులు యువకులకు అప్పగించారు. ఉదయం 9.30 గంటలకు శివశంకర్‌తో పాటు మరో ముగ్గురు యువకులు కలిసి కటౌట్లు తొలగిస్తుండగా.. ఐరన్ ఫ్రేమ్ ఉన్న ఓ కటౌట్ ప్రమాదవశాత్తూ విద్యుత్తు తీగలకు తగలడంతో శివశంకర్ షాక్‌కు గురయ్యాడు. అతడిని వెంటనే 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

అనుమతి లేని హోర్డింగులను తీసేయండి

- పోస్టర్లు, కటౌట్లను కూడా..: సీఈవో
- ఫ్లయింగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాలి
- రాష్ట్రవ్యాప్తంగా పటిష్ఠంగా కోడ్ అమలు
- ఇంకా ఎన్నికల విధుల్లో చేరని సిబ్బందిపై వెంటనే క్రమశిక్షణ చర్యలు
- అధికారులకు ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశం



అధికారులతో సమీక్షలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లను, పోస్టర్లు, కటౌట్లను తక్షణమే తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ప్రత్యేకించి రాష్ట్ర సచివాలయ పరిసర ప్రాంతాల్లోను, కరకట్ట మార్గంలోనూ అనుమతి లేకుండా ఉన్న హోర్డింగ్‌లను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తీసివేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను నిర్దేశించారు. ఇంకా విధుల్లో చేరని ఎన్నికల అధికారులపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు పరిచేందుకు జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆదివారం అమరావతి సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 'ఎన్నికల కోడ్ ప్రకారం.. షెడ్యూల్ ప్రకటి ంచినప్పటి నుంచి 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లోను 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకు ండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాల్సి ఉంది. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఈ నియమ నిబంధనలను పటిష్ఠంగా అమలుపరిచేలా చర్యలు తీసుకోవాలి. కొన్ని జిల్లాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు ఇప్పటి వరకూ అందకపోవడం వల్ల రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ప్రణాళికను సమగ్ర స్థాయిలో రూపొందించలేకపోయాం. ఈ విషయంలో ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఈ (ఆదివారం) సాయంత్రంలోపు మా కార్యాలయానికి జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలను పంపాలి. సీ-విజిల్‌కు అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అందే ఫిర్యాదులపై అదే రోజు, మీడియాలో ప్రచురితమయ్యే ఇతర ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు చేపట్టాలి' అని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టులో దాఖలైన పలు కేసుల కు సంబంధించి వాస్తవ నివేదికలను తమకు వెంటనే అందజేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సెక్టోరల్ అధికారులకు మెజిస్టీరియ ల్ అధికారులు ఇచ్చే ప్రతిపాదనలను వెం టనే హోం శాఖకు పంపాలని మీనా సూచించారు.

మహిళా రైతులకు 'ఆశా'జ్యోతి...

చదువు అంతంతమాత్రం. ఎన్నడూ గ్రామాన్ని దాటి వెళ్ళలేదు. అడుగడుగునా ఆంక్షలు. ఈ అవరోధాలన్నిటినీ దాటి... జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకొనే స్థాయికి ఎదిగారు సాగర్ కున్వర్. రాజస్థాన్‌లోని మారుమూల పల్లెకు చెందిన ఆమె చొరవ వందలాది మందికి ఉపాధి కల్పించింది. ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.

"పెళ్ళయ్యేవరకూ పుట్టిల్లు, ఆ తరువాత అత్తిల్లు. ఆడపిల్లలు వాటికే పరిమితం కావాలి. చదువు, ఉద్యోగం వాళ్ళ పని కాదు... ఇది మా ప్రాంతంలో బాగా పాతుకుపోయిన అభిప్రాయం. దాన్ని ప్రతిఘటించడం కాదు కదా... వ్యతిరేకంగా మాట్లాడడం కూడా మహా నేరం. అటువంటి పరిస్థితుల్లో... ఒక మహిళగా నా కాళ్ళ మీద నేను నిలబడి, ఇతర మహిళల శ్రేయస్సు కోసం ప్రయత్నించడానికి ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. నేను పుట్టింది, పెరిగింది రాజస్థాన్ రాష్ట్రం పాలి జిల్లాలోని ఒక చిన్న గ్రామం. అనేక ఆంక్షల మధ్య చదవడం, రాయడం మాత్రమే నేర్చుకోగలిగాను. పదహారేళ్ళకే నాకు పెళ్ళయింది. ఇంటి పనులు, పిల్లలు పుట్టాక వాళ్ళ బాధ్యతలు, పెరట్లో ఆవుల సంరక్షణ, కోళ్ళ పెంపకం, నా భర్తకు వ్యవసాయంలో సాయం చెయ్యడం... అలా కొన్నేళ్ళు గడిచిపోయాయి. మా



కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. ఎదుగుతున్న పిల్లలకు మంచి చదువులు చెప్పించి, ప్రయోజకుల్ని చేయడం గురించే ఆలోచించేదాన్ని. నేను ఎప్పుడూ మా గ్రామం దాటి బయటకు వెళ్ళలేదు. కుటుంబ ఆదాయాన్ని పెంచడానికి ఏం చేయాలనేది అర్థమయ్యేది కాదు. అలాంటి పరిస్థితుల్లో నాకొక ఆశాకిరణం కనిపించింది. అదే 'ఆశా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' (ఎఎంఎంపిసిఎల్). పాల సేకరణ కోసం పారదర్శకమైన ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి, ఉత్పత్తి పెరుగుదలకు సాంకేతిక సహకారాన్ని అందించడం కోసం టాటా ట్రస్ట్ వారి 'డెయిరీ మిషన్' తదితర సంస్థల ద్వారా మా జిల్లా కేంద్రంలో 2016లో అది ఏర్పాటయింది. దాని ప్రతినిధులు మా గ్రామానికి వచ్చి... ఆ సంస్థలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రచారం చేశారు. ఊళ్ళో మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ సొసైటీలో సభ్యులుగా మహిళలే ఉండాలని వాళ్ళు స్పష్టం చేసినా... ఇంట్లో మగవారికి భయపడి పేర్లు ఇవ్వడానికి అందరూ జంకారు. నేనూ కాస్త తటపటాయించినా ధైర్యం చేశాను. మొదటి సభ్యురాలుగా నా పేరు నమోదు చేయించుకున్నాను. ఆ తరువాత ఒక్కొక్కరూ చేరారు.

ఇంట్లో పెద్ద యుద్ధమే జరిగింది...

సొసైటీ ఏర్పాటయ్యాక నాకు చదవడం, రాయడం వచ్చని ఆ సంస్థ నిర్వాహకులకు తెలిసింది. "మీ ఊళ్ళో సేకరించే పాల వివరాల్ని రోజూ నమోదు చెయ్యడానికి ఒకరు కావాలి. బుక్‌కీపర్‌గా చేరండి" అని అడిగారు. ఆ సంగతి ఇంట్లో చెబితే పెద్ద యుద్ధమే జరిగింది. "ఇదంతా నా పిల్లల భవిష్యత్తు కోసమే" అని నేను గట్టిగా వాదించి ఒప్పించాను. కానీ ఉద్యోగంలో చేరాక... గ్రామస్తుల దూర్భాషలను, బెదిరింపులను తీవ్రస్థాయిలో ఎదుర్కోవాల్సి వచ్చింది. ఊళ్ళో మహిళల్ని చెడగొడుతున్నావని నా మీద విరుచుకుపడ్డారు. భౌతిక దాడులకు కూడా ప్రయత్నించారు. అవన్నీ తట్టుకున్నాను. వీలైనంతమంది మహిళలను సొసైటీలో చేర్పించాను. మరోవైపు గోబర్ గ్యాస్ ప్లాంట్లలోని వ్యర్థాలను సేకరించడం, సేంద్రియ ఎరువుల తయారీ లాంటి అంశాల్లో 'ఆశా' సంస్థకు చెందిన నిపుణుల నుంచి శిక్షణ పొంది, యూనిట్లు ప్రారంభించాను. మా పొలంలో సాగు చేయడం, పశువుల పెంపకం లాంటి పనుల్లో నాకున్న నైపుణ్యం బమనాకు ఎంతో సాయపడింది. ఆ తరువాత మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ స్వయంసహాయక బృందానికి నన్నే ఛైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే చర్యలను వివరించడం, మహిళా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చేయడం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం... ఇవీ నా ప్రధాన బాధ్యతలు. దీని కోసం మా చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాను. మొదట్లో సేంద్రియ పద్ధతులు అనుసరించడానికి ఎక్కువమంది ముందుకురాలేదు. కానీ అది పర్యావరణానికీ, సమాజానికీ ఎంత మేలు చేకూరుస్తుందో ఎన్నోసార్లు వివరించిన తరువాత రైతుల ధోరణిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం మా స్వయంసహాయక బృందంలో 400 మందికి పైగా సభ్యులున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా బృందాల ఏర్పాటులో నేను క్రియాశీలంగా వ్యవహరించాను. జిల్లా, రాష్ట్రస్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాను. 'ఆశా'లో బుక్‌కీపర్‌గా తీసుకొనే వేతనం తప్ప... మిగిలిన పనులన్నీ ఉచితంగా, స్వచ్ఛందంగా చేస్తున్నాను.

అది కలలా అనిపిస్తోంది...

దేనికోసమైతే నేను కలలు కన్నానో... దాన్ని నిజం చేసుకున్నాను. నాకు వచ్చే వేతనంతో మా పిల్లల్ని బాగా చదివిస్తున్నాను. మా అమ్మాయి బెంగళూరు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్, మా అబ్బాయి స్థానికంగా ఇంటర్ చదువుతున్నారు. మహిళా రైతుల శ్రేయస్సు కోసం, సేంద్రియ సాగు కోసం నేను చేసిన కృషికి ప్రశంసలతో పాటు పురస్కారాలు కూడా దక్కాయి. కిందటి ఏడాది ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో... 'దూరదర్శన్ కిసాన్' నన్ను సత్కరించింది. అలాగే ఈ ఏడాది జనవరిలో 'కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (పిఎఫ్ఒ) ఎక్సలెన్స్' అవార్డు అందుకున్నాను. సభ్య రైతుల పురోభివృద్ధి కోసం పాటుపడిన వ్యవ



సాయ ఉత్పాదక సంస్థలను గుర్తించి ప్రోత్సహించడానికి ఇచ్చే పురస్కారం అది. ఎంతోకాలం మా ఊరు దాటని నేను దేశ రాజధానిలో జాతీయ స్థాయి పురస్కారాలను అందుకోవడం కలలా అనిపిస్తోంది. ఒకప్పుడు నన్ను తీవ్రంగా వ్యతిరేకించినవారే ఇప్పుడు నా సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ఈ గౌరవాన్ని నేను నా శ్రమతోనే సాధించుకున్నాను. వందలాది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదం చేశాననే సంతృప్తి నాకుంది. వ్యవసాయ రంగంలో మహిళలు ఎక్కువమందే ఉన్నా వారి కష్టానికి గుర్తింపు ఉండదు. మంచి భవిష్యత్తు కావాలంటే మహిళలు ధైర్యం చేసి అడుగు ముందుకు వెయ్యాలి. అప్పుడు వారు తమ జీవితాల్లోనే కాదు... సమాజంలో కూడా సానుకూలమైన మార్పు తేగలరు."

'ఆడపిల్ల చదువు దేశానికి వెలుగు' అన్నది నిన్నటి నినాదం. నిరుపేద యువతుల వివాహానికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, పెళ్లికానుకల పథకాలు నేటి విధానం. దీన్ని నిరసిస్తున్నారు ప్రముఖ సామాజిక వేత్త, ఎంవీఎఫ్ వ్యవస్థాపకురాలు **ప్రొఫెసర్ శాంతా సిన్హా**. అమ్మాయిల చదువుకు కాకుండా, పెళ్లికి పథకాలు పెట్టడమేంటని నిలదీస్తున్నారు. అసలు ఎవరినడిగి ఈ పథకాలు రూపొందించారని ఆమె ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పార్టీలన్నీ యువతుల ఉన్నత విద్యను ప్రోత్సహించే స్కీములను మేనిఫెస్టోలలో పెట్టాలంటున్న ఆమె... కరోనా అనంతర పరిణామాల గురించి 'నవ్య'తో సంభాషించారు.



పెళ్లికి కాదు... చదువుకు పథకాలు పెట్టండి...

"కల్యాణలక్ష్మి', 'షాదీముబారక్' లు కాదు... మాకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలి'- అని అమ్మాయిలందరూ అడుగుతున్నారు. బాగా చదువుకొని తన కాళ్ళమీద తాను నిలబడాలని సగటు యువతి కోరుకుంటోంది. అయితే, ఉన్నత విద్యను అభ్యసించడానికి గ్రామీణ అమ్మాయిలకు సరైన వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో పదో తరగతి లేదా ఇంటర్ తర్వాత చాలామంది తల్లిదండ్రులు పెళ్లిచేయడానికే మొగ్గు చూపుతున్నారు. ఉన్నత విద్య ఖరీదు కావడం కూడా దీనికి మరొక ప్రధాన కారణం. ఈ పదేళ్ళలో సుమారు 12లక్షల మంది అమ్మాయిల వివాహానికి 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకం ద్వారా 10.5 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చింది. వారంతా 18 ఏళ్ళు నిండినవారే కానీ, ఇంటర్ లేదంటే డిగ్రీ చదువుతుండగా పెళ్లి పీటలెక్కారన్నమాటే కదా! అలా పెళ్లి పేరుతో మనమే అమ్మాయిలను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నాం. వారి కలలను చిదిమేస్తున్నాం. అదే సొమ్మును కనుక ప్రభుత్వం అమ్మాయిల చదువుకు కేటాయిస్తే, వారంతా ఉన్నత చదువులు పూర్తి చేసి కోరుకున్న రంగాలలో రాణిస్తారు కదా! తద్వారా సామాజికాభివృద్ధికి తోడ్పడతారు. పితృస్వామ్య హింస నుంచి మహిళలను రక్షించేది చదువు ఒక్కటే. అలాంటిదాన్ని వారికి దూరం చేస్తున్నాం. అటు ఆంధ్రప్రదేశ్‌లోనైనా, ఇటు తెలంగాణలోనైనా... పెళ్లికానుక, కల్యాణ లక్ష్మి లాంటి పథకాల ద్వారా అమ్మాయిల జీవితం పెళ్లితో సార్థకమవుతుందన్న పురుషాధిక్య భావజాలాన్ని ప్రభుత్వాలు సమాజంమీద మరింత రుద్దుతున్నాయి. అసలు రాజకీయ పార్టీలు ఎవరిని అడిగి ఈ పథకాలు రూపొందిస్తున్నాయి? ఇలాంటి పథకాలు ప్రకటించే ముందు నాయకులు అమ్మాయిల అభిప్రాయాలు తెలుసుకున్నారా.?

బాల్యవివాహాలు ఆగాయి...

ఎంవీఎఫ్ పనిచేస్తున్న గ్రామాలలో వలంటీర్ల ప్రోత్సాహంతో కిశోర బాలికలంతా కలిసి సంఘాలుగా ఏర్పడ్డారు. ప్రతి శని, ఆదివారాలు వారంతా కలిసి కూర్చొని వ్యక్తిగత, సామాజిక సమస్యలమీద చర్చించుకొంటారు. ఆ క్రమంలో అమ్మాయిల భాగస్వామ్యం లేకుండా గ్రామసభలు నిర్వహించడానికి వీల్లేదని కూడా వారంతా కలిసి పోరాడారు. కొన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అయితే స్థానిక నాయకులను డిమాండ్ చేసి మరీ అమ్మాయిల కోసం ప్రత్యేకంగా లైబ్రరీ, సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. బాలికలు గ్రామ సభల్లో తమ సమస్యలను చర్చిస్తున్నారు. అలా ఒక గ్రామంలో ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని స్కూలుకు వెళ్ళడానికి బస్సు సౌకర్యం కోసం అమ్మాయిలంతా కలిసి ధర్నా చేసి, విజయం సాధించారు. పదోతరగతి చదువుతున్న ఒక అమ్మాయికి ఇంట్లోవాళ్ల పెళ్లి నిశ్చయించారు. ఆ విషయం బాలికా సంఘం దృష్టికి రావడంతో... వారంతా అమ్మాయి కుటుంబాన్ని కలిసి నచ్చజెప్పి మరీ పెళ్లి ఆపించారు. ఇలా ఒకటి, రెండు కాదు... బాలికా సంఘాల ప్రతినిధులు ఎన్నో బాల్య వివాహాలను అడ్డుకున్నారు. జెండర్ అసమానతలకు వ్యతిరేకంగా హక్కుల సాధన కోసం వారంతా కలిసి 'తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య' ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

రాహుల్‌తో సంభాషణ...

సూర్యాపేట, వికారాబాద్, రంగారెడ్డి, గద్వాల్ జిల్లాలలో లింగ సమానత్వం సాధన దిశగా 'మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్' (ఎంవీఎఫ్) ద్వారా పనిచేస్తున్నాం. ఈ క్రమంలో చాలామంది గ్రామీణ అమ్మాయిలతో మాట్లాడినప్పుడు "మా పెళ్లికి కాదు, చదువుకోడానికి పథకాలు పెట్టండి" అని వారంతా అడుగుతున్నారు. ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాను. ఆయనతో రెండుసార్లు సంభాషించిన సందర్భంలో... తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అస్సలు బాగాలేదని చెప్పాను. "గత పదేళ్ళలో పాఠశాల విద్య కేంద్రీకృతం అయింది. తరగతి గదిలో అధికారుల జోక్యం పెరిగింది. రోజూ పిల్లల హాజరు లాంటి డేటా అప్‌లోడ్‌తోనే ఉపాధ్యాయులకు సరిపోతోంది. ఇకవారికి పాఠాలు బోధించే సమయం మిగలడంలేదు. కరోనా తర్వాత దేశ వ్యాప్తంగా బాలకార్మికులు పెరిగారు. దీని మీద ప్రభుత్వాలకు ఒక అంచనా లేదు" అని కూడా వివరించాను. పిల్లలకు సంబంధించి విధాన నిర్ణయాలలో మార్పు అవసరమని కొన్ని సూచనలు కూడా ఇచ్చాను. అవన్నీ రాహుల్ సావధానంగా విని, సానుకూలంగా స్పందించారు.

బాలకార్మికులు పెరిగారు

రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో బాలలకు వయసువారీగా పథకాలు ప్రవేశపెట్టాలి. మరీ ముఖ్యంగా 14 నుంచి 18ఏళ్ళ మధ్యలో ఎక్కువమంది చదువుకు దూరమవుతున్నారు. అందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఎక్కువ. కనుక పిల్లలందరికి సమానమైన విద్యను అందించాలి. పదోతరగతి తర్వాత అకడమిక్స్ పట్ల ఆసక్తిలేనివారికి... వారి అభిరుచి మేరకు ఆసక్తి కలిగిన రంగంలో నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించాలి. సమాజంలో అసమానతలను తొలగించేది చదువు ఒక్కటే. కనుక అందరికీ ఒకేలాంటి విద్యావకాశాలు కల్పించడంద్వారా మాత్రమే సమానత్వాన్ని సాధించగలం. అంతేకానీ, 'వృత్తివిద్యా కోర్సులను పేద విద్యార్థులే చదవాలి, ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటివి సంపన్నుల కోసం' లాంటి విద్యా విధానంతో సమాజానికి ఒనగూరేదేమీలేదు. కనుక కనీసం 18ఏళ్ళలోపు పిల్లలందరికి తారతమ్యాలు లేకుండా, నాణ్యమైన ప్రమాణాలతో కూడిన సమానమైన విద్యావకాశాలు కల్పించాలి. ఆ విధమైన పాలసీలు రాజకీయ పార్టీలు రూపొందించాలి. అలాంటి విధానాల కోసం ప్రజలు రాజకీయ నాయకులను గట్టిగా నిలదీయాలి.

అన్నిచోట్లా ఇదే పరిస్థితి...

గ్రామాల నుంచి చదువు కోసం నగరాలకు లేదంటే పట్టణాలకు వెళుతున్న అమ్మాయిలకు సరైన వసతి సౌకర్యాలు ఎక్కడా సక్రమంగా లేవు. హైదరాబాద్‌లోని కొన్ని పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలతో పాటు మాసబ్‌ట్యాంక్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థినిలకు హాస్టల్ వసతి ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. అలాంటి విద్యా సంస్థలు మన కళ్ళ ముందు బోలెడు కనిపిస్తాయి. మరి అలాంటి కాలేజీలలో చదివే అమ్మాయిలు ప్రైవేటు హాస్టళ్ళలో ఉండాలంటే నెలకు ఖర్చు పదివేల రూపాయలకు తక్కువ అయితే కాదు కదా. కూలీ నాలీ చేసుకొని బతికే కుటుంబాల నుంచి వచ్చిన అమ్మాయిలు అంత మొత్తం భరించగలరా.? ఒక్క హైదరాబాదే కాదు, విజయవాడ, తిరుపతి, కర్నూలు, మహబూబ్‌నగర్, వరంగల్... ఇలా ప్రతి పట్టణంలోనూ ఇదే పరిస్థితి. ఒక అమ్మాయి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వస్తే, ఆశ్రయం ఇచ్చేందుకు ఒక్క షెల్టర్ హోమ్ అయినా ఉందా? పోనీ వారికి ఈవ్‌టీజింగ్, లైంగిక దాడులు లాంటి వాటి నుంచి భద్రత కల్పించగలుగుతున్నామా. అసలు అమ్మాయిల చదువుకు సంబంధించి... ఒక్క పార్టీకైనా విధానమంటూ ఒకటుందా? ఇవన్నీ ఆలోచించకుండా, పెళ్లికానుకలు ఇచ్చి చేతులు దులుపుకొంటామంటే మాత్రం సరికాదు.

పంచాయతీ భాగస్వామ్యంతో...

గద్వాల్ జిల్లాలో పత్తి పంట చేతికొచ్చిన సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదులన్నీ చాలావరకు ఖాళీగా కనిపిస్తుంటాయి. అలాగే ప్రకాశం, గుంటూరు జిల్లాలలో మిర్చి కోతలప్పుడూ అదే పరిస్థితి. బడిలో ఉండాల్సిన పిల్లలు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. లాక్‌డౌన్ తర్వాత బాల కార్మికులు మరింత పెరిగారు. దీనిమీద ప్రభుత్వాలకు ఒక అంచనా లేదు. ముఖ్యంగా ఎనిమిదో తరగతి తర్వాత చాలామంది చదువుకు దూరమవుతున్నారు.

ఎక్కడికక్కడ స్థానిక నాయకుల భాగస్వామ్యంతో బడి బయట పిల్లలను గుర్తించి... గ్రామంలోని బాలలంతా పాఠశాలలో ఉండేలా కార్యాచరణ చేపట్టడం ఇప్పుడు చాలా అవసరం. 'పిల్లలు రోజూ స్కూలుకు వెళుతున్నారా? లేదా?' అన్నది కూడా గ్రామ పంచాయతీలు పర్యవేక్షించాలి. బాలకార్మిక రహిత గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యతను స్థానికులకు అప్పగించాలి. అంతేకానీ, ఉన్నతాధికారులు కార్యాలయాల్లో కూర్చొని కార్యక్రమాలు చేపట్టడం వల్ల అవి క్షేత్రస్థాయిలో అమలుకావు.

బ్రిడ్జి కోర్సులు ఉండాయి...


ఉమ్మడి ఏపీలో సర్వశిక్షా అభియాన్ 1994 నుంచి 1996 వరకు బ్రిడ్జి కోర్సులు నిర్వహించింది. నిజానికి బడి బయట పిల్లలను తిరిగి చదువుకు చేరువ చేసేందుకు అది చాలా మంచి కార్యక్రమం. సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కేంద్రాలుగా... మూడు నెలల పాటు పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన అనంతరం వారి చదువు ఎక్కడైతే ఆగిందో, మళ్లీ అదే తరగతిలో వారు కొనసాగేందుకు అవకాశం కల్పించడం ద్వారా కొన్ని వేలమంది విద్యావంతులు కాగలిగారు. ఒక ఏడాదైతే మూడు లక్షలమంది పిల్లలు బ్రిడ్జి కోర్సులో చేరి చదువు కొనసాగించారంటే మాటలు కాదు. అంత మంచి కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలి. ఆనాడు నాగార్జున, సమర్జిత్ రె, కె.రాజు లాంటి ఐఏఎస్‌ల ప్రత్యేక శ్రద్ధ వల్ల ఇలాంటి మంచి కార్యక్రమాలన్నీ రూపుదిద్దుకున్నాయి. ఆ స్ఫూర్తి ఇప్పుడు అవసరం. విద్యా విధానంలో కేరళ దేశానికే తలమానికంగా నిలిచింది. ఆ రాష్ట్రంలో బాలకార్మికులు లేరు. ప్రాథమిక విద్యకు వారు ఇస్తున్న ప్రాధాన్యతను కళ్లారా చూశాను. విద్యా, వైద్య రంగాల విషయంలో కేరళ నుంచి మనం చాలా నేర్చుకోవాలి. కేపిటలిజం మనుగడకైనా విద్యావంతులు అవసరం. కనుక ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను ప్రతి ఒక్కరికి అందించడం ద్వారానే వ్యవస్థ ముందుకువెళుతుందన్న సంగతి పాలకులు గుర్తించాలి."

• సాంత్వన్, ఫొటో: రాజ్‌కుమార్

నవ్య | చిత్రజ్యోతి

ఫైట్స్‌లోనూ మెగాస్టారే





కసి, కృషి కలగలసిన వ్యక్తిత్వం చిరంజీవి సొంతం. యువతను ఉర్రూతలూగించే డ్యాన్స్‌లు చేసినా, మాస్‌ను ఉమైమరపించే ఫైట్స్ చేసినా ఆయన నమ్ముకున్నది తన కష్టాన్నే. దీనికి నిదర్శనంగా నిలిచే సంఘటన 'విశ్వంభర' సెట్స్‌లో మరోసారి ఆవిష్కృతమైంది. చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇటీవలే మొదలైన తాజా షెడ్యూల్‌లో భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. సాధారణంగా రిస్కీ ఫైట్స్ అనగానే చాలామంది హీరోలు పక్కకు తప్పుకొని డూప్‌ను పెడతారని చెబుతుంటారు. కానీ చిరంజీవి మాత్రం అందుకు ససేమిరా అంటున్నారు. ఈ వయసులోనూ అత్యంత కష్టమైన యాక్షన్ సీక్వెన్స్‌లోనూ స్వయంగా పాల్గొంటున్నారు. తాళ్లతో బంధించి గాల్లోకి లేపడం, రాతి నేల పైన స్టంట్స్ చేయడం వల్ల ఒళ్లు హూనమౌతున్నా పంటి బిగువున భరిస్తున్నారు తప్ప డూప్‌ను మాత్రం వాడడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఈ వయసులో కూడా ఆయన అలా కష్టపడడం చూసి సెట్‌లో జనాలు ఆశ్చర్యపోతున్నారట. హిట్ కొట్టాలనే పట్టుదల, వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధత అలాంటిది మరి. సోషియో ఫాంటసీగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో వీఎఫ్ఎక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. వచ్చే సంక్రాంతికి 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకు రానుంది.

సరికొత్త సాహసం...



హీరో నిఖిల్ సిద్ధార్థ్ కార్తికేయ-2 చిత్రంతో పాన్ ఇండియా లెవెల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో వచ్చిన కార్తికేయ-2 ముగింపు అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించింది. ముగింపు సన్నివేశాల్లో కార్తికేయ-3 ఉంటుందని దర్శకుడు సంకేతాలిచ్చారు. దీంతో కార్తికేయ-3 చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులకి తెరదించుతూ.. త్వరలోనే కార్తికేయ-3 వస్తోందని నిఖిల్ ప్రకటించారు. "డాక్టర్ కార్తికేయ త్వరలోనే సరికొత్త సాహసాన్ని అన్వేషించేందుకు సన్నద్ధమవుతున్నారు" అని పోస్ట్ చేశారు. ఈ చిత్రాన్ని మొదటి రెండు భాగాలతో పోలిస్తే మరింత లార్జర్ స్కేల్‌లో, భారీ బడ్జెట్‌తో నిర్మించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. చందు మొండేటి దర్శకత్వంలో నిఖిల్, కలర్స్ స్వాతి జంటగా నటించిన కార్తికేయ మొదటిభాగం 2014లో రిలీజై సూపర్ హిట్‌గా నిలిచింది. 2022లో వచ్చిన రెండో భాగం నిఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా మారింది. ప్రస్తుతం నిఖిల్ పాన్ ఇండియా లెవెల్లో తెరకెక్కుతున్న పీరియాడికల్ మూవీ 'స్వయంభు'లో నటిస్తున్నారు.

ప్రశంసలూ.. అవార్డులూ



పద్మవిభూషణ్ గ్రహీత, తెలంగాణ మహాకవి, కాళోజీ నారాయణ రావు జీవిత కథగా తెరకెక్కిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. డాక్టర్ ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించారు. టైటిల్ రోల్‌లో మూల విరాట్ (అశోక్ రెడ్డి) నటించారు. విజయలక్ష్మీ జైనీ నిర్మించారు. గతేడాది ఈ చిత్రం రిలీజైంది. ప్రదర్శితమైన ప్రతీ చోటా విమర్శకుల ప్రశంసలతో పాటూ అవార్డులనూ కొల్లగొడుతోంది. తాజాగా ఈ చిత్రం ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో ఫీచర్ ఫిక్షన్ కేటగిరీలో స్పెషల్ జ్యూరీ అవార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ "గతంలోనూ ఈ చిత్రం పలు అవార్డులు కైవసం చేసుకుంది" అని చెప్పారు.



'ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అవార్డ్స్ 2024' వేడుక ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. నటుడు మురళీమోహన్, వీకే నరేశ్, గీత రచయిత చంద్రబోస్, నటి రోజారమణి, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ హంగామా




ఆశిష్ గాంధీ, అశోక్, వర్ష, హ్రితిక హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'హద్దులేదురా'. రాజశేఖర్ రావి దర్శకత్వం వహిస్తున్నారు. వీరేష్ గాజుల బళ్లారి నిర్మిస్తున్నారు. మార్చి 21న విడుదలవుతోంది. ఆదివారం, ఈ చిత్రం ట్రైలర్‌ను డైరెక్టర్ గోపీచంద్ మలినేని విడుదల చేశారు. దర్శకుడు రాజశేఖర్‌కి ఇది మొదటి చిత్రమైనా, ఎన్నో చిత్రాల అనుభవం ఉన్న డైరెక్టర్‌లా చిత్రాన్ని అద్భుతంగా తీశారు. ఫ్రెండ్‌షిప్‌తో పాటు మంచి యాక్షన్ కూడా ఉంది అని ప్రశంసించారు. దర్శకుడు మాట్లాడుతూ "ఎలాంటి హద్దులూ పెట్టుకోకుండా జీవితాన్ని నచ్చినట్లు బ్రతకాలని ఈ చిత్రానికి 'హద్దులేదురా' అనే టైటిల్ పెట్టాం" అని తెలిపారు.

అరుంధతి హాస్యంతో...



వెన్నెల కిశోర్, కమల్ కామరాజు ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రానికి 'ఒసేయ్ అరుంధతి' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. విక్రాంత్ కుమార్ దర్శకత్వంలో గూడూరు ప్రణయ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'కామెడీ థ్రిల్లర్ జానర్‌లో 'ఒసేయ్ అరుంధతి'ని నిర్మిస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'అరుంధతి అనే మధ్య తరగతి ఇల్లాలి కథ ఇది. సత్యనారాయణ స్వామి వ్రతం చేయాలనుకున్న అరుంధతికి ఓ సమస్య ఎదురవుతుంది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ ప్రధానంగా సాగుతుంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్. సినిమాటోగ్రఫీ: సాయి చైతన్య మాటేటి

ఆ సినిమాకు సీక్వెల్ కాదు



కథ బాగా నచ్చి 'ఓం భీమ్ బుష్' చిత్రంలో భాగమయ్యాను. శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ కూడా నటిస్తున్నారనేసరికి ఆసక్తి కలిగింది. మేం ముగ్గురం కలసి 'బ్రోచేవారెవరురా' చేశాం. అయితే ఇది ఆ సినిమాకు సీక్వెల్ కాదు. పూర్తి భిన్నంగా ఉంటుంది' అని ప్రియదర్శి అన్నారు. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో వీ సెల్యులాయిడ్‌తో కలసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ఈ నెల 22న విడుదలవుతోన్న సందర్భంగా ప్రియదర్శి సినిమా విశేషాలను పాత్రికేయులతో పంచుకున్నారు.

• ఇందులో నా పాత్ర పేరు డాక్టర్ వినయ్ గుమ్మడి. ముగ్గురు స్నేహితులం తింగరి పనులు చేసి సమస్యల్లో ఇరుక్కుంటాం. మా పాత్రల మధ్య సంఘర్షణ నుంచి మంచి హాస్యం పుడుతుంది. అసభ్యత లేకుండా దర్శకుడు కామెడీ సన్నివేశాలను తీర్చిదిద్దాడు. ఫాంటసీ, హారర్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.

• అయేషాఖాన్ నాకు జోడీగా నటించారు. సునీల్, వంశీ ఖర్చుకు వెనుకాడకుండా నిర్మించారు. ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్'తో పాటు హీరోగా ఓ చిత్రం చేస్తున్నాను.



టవర్ దిగండి.. మమ్మల్ని బాధపెట్టొద్దు!

» ప్రజాగళం సభలో టవర్లు ఎక్కిన జనాలకు మోదీ విజ్ఞప్తి

» జనసేనాని ప్రసంగిస్తున్న సమయంలో ఘటన

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రజాగళం సభలో ఆసక్తికరమైన సన్నివేశం జరిగింది. కిక్కిరిసిన జనాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్‌లను చూడటానికి టవర్లు ఎక్కడంతో స్వయంగా మోదీనే స్పందించారు. సభలో ఫోకస్ లైటింగ్ టవర్‌పై ఉన్న జనాలను కిందికి దిగాలని స్వయంగా మోదీ కోరడంతో అందరూ ఆశ్చర్యపోయారు. జనసేన అధినేత పవన్ ప్రసంగిస్తున్న సమయంలో మోదీ కుర్చీలోంచి లేచి వచ్చి పవన్ ప్రసంగం మధ్యలో కల్పించుకున్నారు. ప్రొటోకాల్ వీడి మరీ ప్రధాని మైక్ వద్దకు వచ్చి.. టవర్లపై ఉన్న వారందరూ కిందికి దిగాలని కోరారు. అవాంఛనీయ ఘటనలకు కారణమై తమను బాధపెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. మీరు ఏం చేస్తున్నారంటూ పోలీసులను మోదీ ప్రశ్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు టవర్లు ఎక్కిన జనాన్ని కిందకు దించారు. ప్రధాని తీరుతో సభికులతో పాటు టీవీలలో కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న యావత్ రాష్ట్ర ప్రజలు ఆశ్చర్యపోయారు. దటీజ్ మోదీ అంటూ కొనియాడారు. కాగా, మధ్యలో చంద్రబాబు కూడా జోక్యం చేసుకొని, సభికులకు నమస్కరించి, టవర్లు దిగాలని పదేపదే కోరారు.







ఏపీలో మంత్రులు ప్రజాసేవను పక్కనపెట్టేశారు. ఒకరిని మించి ఒకరు అవినీతి చేయడంలో పోటీ పడుతున్నారు. గత ఐదేళ్లలో ఏపీ అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఈ దేశం, ఈ రాష్ట్రం అభివృద్ధి కోసం మీరందరూ ముందుకొచ్చి ఎన్డీయేకు ఓటు వేయాలి! - ప్రధాని నరేంద్ర మోదీ

అభివృద్ధి ఆంధ్రా కోసం...

ఓటెత్తండి!

(మొదటి పేజీ తరువాయి)

అంతం చేయాలన్నారు. టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి ఆవిర్భావం తర్వాత, సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడిన మరుసటి రోజునే... ఆదివారం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. 'భారత్ మాతాకీ.. జై' అంటూ ప్రసంగం మొదలు పెట్టిన మోదీ.. 'నా ఆంధ్ర కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు' అంటూ తెలుగులో అభివాదం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వస్తున్నాయని, ఎన్డీయేకు 400 సీట్లు దాటేలా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి, వేయించి గెలిపించాలని మూడు పార్టీల కార్యకర్తలను కోరారు. ఎన్డీయే కూటమి ప్రాంతీయ ఆకాంక్షలతోపాటు జాతీయ భావాలు కలుపుకొంటూ అడుగులు వేస్తుందని తెలిపారు. భాగస్వాములు చేరేకొద్దీ కూటమి బలం పుంజుకుంటోందన్నారు.

రాష్ట్రంలో అవినీతి సర్కార్...

కేంద్రంలో మూడోసారి ఎన్డీయే సర్కారును ఏర్పాటు చేయాలని.. రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వాన్ని పెకలించాలని ఆంధ్ర ప్రజలు ఇప్పటికే సిద్ధమయ్యారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ దిశగా సంకల్పం తీసుకున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు. "వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో పేదల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళలకు కొత్త అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పోర్టులతోపాటు బ్లూ ఎకానమీ విస్తరణ చేయాల్సి ఉంది. అవన్నీ జరగాలంటే ఏపీ అసెంబ్లీ, ఢిల్లీ పార్లమెంటులో ఎన్డీయే సభ్యులు ఉండాలి. అప్పుడే మీరు అభివృద్ధి భారత్, అభివృద్ధి ఆంధ్ర సాకారానికి మద్దతిచ్చినట్లు" అని తెలిపారు. రాష్ట్రంలో జగన్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే అని మోదీ పేర్కొన్నారు. "ఒకే కుటుంబం రెండు పార్టీలను నడుపుతోంది. రాష్ట్ర ప్రభుత్వంపై కోపంగా ఉన్న ప్రజలను కాంగ్రెస్‌వైపు మళ్లించాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. మీరు పొరపాటున కూడా వైసీపీ వ్యతిరేక ఓటును చీల్చవద్దు. ఎన్డీయే కూటమి అభ్యర్థులకే ఓటు వేయండి, వేయించండి" అని మోదీ విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధికోసం ఆ ఇద్దరి కృషి...

చంద్రబాబు, పవన్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమని ప్రధాని మోదీ అన్నారు. "వికసిత్ భారత్, వికసిత్ ఏపీ కోసం డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు రావాలి. ఎన్డీయే ప్రభుత్వం పేదలకు సేవ చేస్తుంది. జనాభాలో 30కోట్ల మందిని పేదరికం నుంచి బయటికి తెచ్చింది" అని మోదీ పేర్కొన్నారు. ఏపీలోని పేదలకు ప్రధాని ఆవాస్ యోజన కింద పది లక్షల ఇళ్లు ఇచ్చామని, పల్నాడు ప్రాంతానికి ఐదు వేల ఇళ్లు వచ్చాయని మోదీ తెలిపారు. తాగడానికి పేదలకు శుభ్రమైన నీరిచ్చే జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఏపీలో కోటి కుటుంబాలకు కొళాయి కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ అనే బృహత్తర కార్యక్రమం కింద కోటి మందికి వైద్య భరోసా కల్పించామన్నారు. పల్నాడు ప్రాంతంలోని ఐదు లక్షల మందికి కేంద్రం ఉచిత రేషన్ ఇస్తోందని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏపీలో రైతులకు రూ.700కోట్లు ఇచ్చామని, ఇలాంటి కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉండాలన్నారు. "ఎన్డీయేకు చెందిన ప్రతి ఎంపీ మీ కోసమే పని చేస్తారు. ఇది మోదీ గ్యారెంటీ" అంటూ ప్రధాన మంత్రి మాటిచ్చారు.

ఉన్నత విద్యా కేంద్రంగా ఏపీ

రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని, యువతలో నైపుణ్యాన్ని వెలికి తీయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మోదీ తెలిపారు. అందులో భాగంగానే తిరుపతిలో ఐఐటీ, ఐసర్.. విశాఖలో ఐఐఎం, ఐఐపీఈ... కర్నూలులో ట్రిపుల్ ఐటీ, మంగళగిరిలో ఎయిమ్స్, విజయవాడలో నేషనల్ ఐఐడీ, తాడేపల్లిగూడెంలో ఎన్ఐటీ, విజయనగరంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వంటి కీలక విద్యా, వైద్య సంస్థలను ఏపీకి ఇచ్చాం" అని ప్రధాని తెలిపారు.

వైరుధ్యాల 'విపక్ష కూటమి'

'ఎన్డీయే కూటమి భాగస్వాములందరినీ కలుపుకొని వెళుతుంది. పరస్పర విశ్వాసాలను గౌరవిస్తూ ముందుకెళుతుంది. కానీ... మన ముందుకు వచ్చిన ఇండియా కూటమిలో అన్నీ వైరుధ్యాలే. ఒకరినొకరు తిట్టుకొంటూ యూజ్ అండ్ త్రో విధానం అవలంబిస్తోంది" అని ప్రధాని మోదీ విమర్శించారు. "కేరళలో లెఫ్ట్, కాంగ్రెస్ తిట్టుకుంటాయి. బెంగాల్‌లో టీఎంసీ, లెఫ్ట్ దూషించుకుంటాయి. పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్ దుమ్మెత్తి పోసుకుంటాయి. దేశం కోసం ఎటువంటి దూరదృష్టి, ముందుచూపులేని వాళ్లు దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళతారో ఆలోచించాలి" అని ప్రజలను కోరారు. 'ఇండియా' కూటమి స్వార్థపరుల బృందమని ఎద్దేవా చేశారు.

శ్రీరాముడంటే ఎన్టీఆర్..

"శ్రీరాముడి భవ్య మందిరాన్ని అయోధ్యలో నిర్మించాం.. తెలుగు ప్రజలు ప్రతి ఇంటా రాముడికి స్వాగతం పలికారు" అని మోదీ పేర్కొన్నారు. అయితే.. తెలుగు వారు రాముడిని గుర్తుకు తెచ్చుకుంటే మనకళ్ల ముందు మెదిలేది ఎన్టీఆర్ అని తెలిపారు. "రాముడు, కృష్ణుడిలా ఎన్టీఆర్ గొప్పగా కనిపించి ఆ దేవుళ్లిద్దరినీ ప్రజల మనసుల్లోకి తీసుకెళ్లారు. పేదలు, రైతుల కోసం ఎన్టీఆర్ చేసిన సేవను మనం గుర్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం కోసం ఆయన కాంగ్రెస్‌తో పోరాడారు. ఇప్పుడు మా ప్రభుత్వం ఆయన శతజయంతి సందర్భంగా స్మారక నాణెం విడుదల చేసింది. పీవీ నరసింహారావుకు భారత రత్న ఇచ్చింది. కానీ.. కాంగ్రెస్ ఆ ఇద్దరినీ అవమానించింది" అని మండిపడ్డారు. తాము రాజకీయాలకు అతీతంగా భారత దేశ ముద్దు బిడ్డల్ని గౌరవిస్తామని... కాంగ్రెస్ ఇలాంటివి ఏపీ చేయదని విమర్శించారు.



● అప్పులు తేవడానికి చివరకు కలెక్టర్ కార్యాలయాలు కూడా తాకట్టు పెట్టే స్థితికి దిగజారారు. రాబోయే పాతికేళ్లలో మద్యంపై వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి నడుపుతున్నారు. ఈ రాష్ట్రం మరింత పతనం కాకుండా కాపాడుకోవాలి.

● రాబోయే ఎన్నికల్లో తెలుగు ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్‌ను సమూలంగా మారుస్తుంది. మూడు పార్టీల జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే. సంక్షేమం, అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ మా అందరి జెండా... ఎజెండా.

● ప్రపంచ వేదికపై మన దేశాన్ని నంబర్ వన్‌గా నిలిపే శక్తి మోదీకి ఉంది. భారత్‌ను పేదరికం లేని, ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా నిలపడానికి ఆయన తపిస్తున్నారు. - చంద్రబాబు

కుప్పకూలిన రాష్ట్రాన్ని.. కలిసి

నిలబెడతాం

» కక్ష, విధ్వంసం.. అవినీతి, దోపిడీలకు జగన్ పర్యాయ పదం: చంద్రబాబు

అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల విధ్వంస పాలన.. దురహంకార ప్రవర్తనతో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైపోయింది. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే మేమందరం కలిశాం. కుప్పకూలిన రాష్ట్రాన్ని కలిసి నిలబెడతాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రపంచ వేదికపై భారత్ దూసుకుపోతోందన్నారు. ప్రజలు అవకాశమిస్తే ఈ అభివృద్ధిని ఈ రాష్ట్రంలో కూడా చూపించి వారి జీవితాల్లో వెలుగులు తెస్తామని, మార్పు చూపిస్తామని ప్రకటించారు. ఎన్డీయేలో టీడీపీ చేరిన తర్వాత తొలిసారి పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఉమ్మడి భారీ బహిరంగ సభలో మోదీ సమక్షంలో ఆయన ప్రసంగించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనపై నిప్పులు చెరిగారు. మోదీని ప్రశంసల్లో ముంచెత్తారు. కక్ష, విధ్వంసం, అవినీతి, దోపిడీలకు జగన్ పర్యాయ పదమన్నారు. మోదీ అంటే సంక్షేమం.. అభివృద్ధి.. సంస్కరణ.. ఆత్మవిశ్వాసంగా పేర్కొన్నారు. విడిపోయిన రాష్ట్రానికి అమరావతి రూపంలో ఒక మంచి రాజధాని నగరం నిర్మించుకోవాలని ప్రయత్నిస్తే.. జగన్ మూడు ముక్కలాట పేరుతో సర్వనాశనం చేశాడని ధ్వజమెత్తారు. అమరావతి పూర్తయి ఉంటే దేశంలో ఏపీ నంబర్ వన్ రాష్ట్రంగా మారేదన్నారు. పోలవరాన్ని గోదావరిలో కలిపాడని.. లాండ్, శాండ్, వైన్, మైన్ సహా దేనినీ వదిలిపెట్టకుండా అడ్డగోలుగా దోచుకున్నాడని.. పనికిమాలిన మద్యంతో ప్రజల ప్రాణాలు తీసి అందులో కూడా జేబులు నింపుకొన్నాడని విమర్శించారు. తన ఆదాయం పెంచుకోవడానికి ఎంత దుర్మార్గానికైనా వెనుకాడలేదన్నారు. రాష్ట్రంలో రాబోతున్న మార్పునకు బొప్పూడి సభ అద్దం పడుతోందని.. గెలుపు ఎన్డీయేదేనన్నారు. మోదీకి అండగా నిలుస్తామని ఈ సభలోని యువత, ఆడబిడ్డలు చప్పట్లు కొట్టాలని.. ఇళ్లలో టీవీల ముందు ఉన్నవారికి కూడా అవి వినిపించాలని పిలుపిచ్చారు. సభకు హాజరైన జనం చప్పట్లతో మార్మోగించారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

జీవితాల్లో ఆనందమే లేదు..

ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో పరిశ్రమలు లేవు. పెట్టుబడులు లేవు. అభివృద్ధి లేదు. ఉపాధి లేదు. కనీసం రోడ్లు వేసే దిక్కు కూడా లేదు. ప్రజల జీవితాల్లో ఆనందం అనేదే లేకుండా చేశారు. విధ్వంస విధానాలతో రాష్ట్రాన్ని కూల్చేశారు. బంగారం లాంటి రాష్ట్రాన్ని జగన్ చీకటిమయం చేశాడు. జగన్ అధికార దాహానికి సొంత బాబాయి కూడా బలయ్యాడు. వైసీపీ పునాదులు రక్తంతో తడిచాయని, జగన్ పార్టీకి ఓట్లు వేయొద్దని సొంత చెల్లెళ్లే రోడ్డెక్కి పిలుపిచ్చే పరిస్థితులు వచ్చాయంటే ప్రజలు అర్థం చేసుకోవాలి. రాష్ట్రంలో యువత, రైతులు, పేదలు, మహిళలు.. ఇలా ప్రతి వర్గం తీవ్రంగా నష్టపోయింది. పనికిమాలిన పాలనతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా దెబ్బతినిపోయింది. దేశంలో ఎన్డీయేకి 400 లోక్‌సభ సీట్లు ఖాయం. ఏపీలోని మొత్తం పాతిక ఎంపీ సీట్లు గెలిపించి ఎన్డీయేను బలోపేతం చేయాలి. మోదీ నాయకత్వంలో దేశం ముందుకు వెళ్తోంది. ఏపీని కూడా అదే మాదిరిగా ముందుకు తీసుకెళ్దాం. ఇది రాష్ట్ర పునర్నిర్మాణ సభ. ప్రజల గుండె చప్పుడు మొత్తం దేశానికి వినిపించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం.

మోదీ మహాశక్తి..

ప్రధాని, ప్రగతివాది మోదీకి ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల తరఫున స్వాగతం. ఆయన ఒక వ్యక్తి కాదు. మన దేశాన్ని విశ్వ గురుగా నిలిపిన మహా శక్తి. ప్రపంచం మెచ్చిన నాయకుడు. అన్న యోజన, ఆవాస్ యోజన, కిసాన్ యోజన, ఆయుష్మాన్ భవ, జలజీవన్ మిషన్ వంటి కార్యక్రమాలతో సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చారు. సబ్ కా సాత్... సబ్ కా వికాస్ నినాదంతో దేశ ప్రజలకు నమ్మకం కలిగించారు. కరోనా సమయంలో ఎంతో శ్రమించి మనందరి ప్రాణాలు కాపాడారు. వంద దేశాలకు వ్యాక్సిన్ పంపారు. ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న మన ఎకానమీని పదేళ్లలో ఐదో స్థానంలోకి తెచ్చారు. రాబోయే రోజుల్లో మన దేశం అమెరికా, చైనాల తర్వాత మూడో స్థానంలో నిలబడబోతోంది. వికసిత భారత్ మోదీ కల. వికసిత ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యం. దేశం వేగంగా పరిగెడుతున్నప్పుడు ఆ అవకాశాలను అందిపుచ్చుకుని మన రాష్ట్రం కూడా ముందుకెళ్లాలి. పేదరికం లేని దేశం ఆయన ఆశయం. మన కోరిక కూడా పేదరికం లేని రాష్ట్రం. దేశానికి సరైన సమయంలో సరైన వ్యక్తి నాయకత్వం లభించింది. రాష్ట్ర విభజన తర్వాత నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవడానికి మోదీ చేయూతనిచ్చారు. 11 జాతీయ విద్యా సంస్థలను ఇచ్చారు. అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. క్రమశిక్షణను మనం ఆయన నుంచి నేర్చుకోవాలి. ఈ సభలో విద్యుత్ టవర్లపై నిలబడిన కార్యకర్తలను చూసి ఆయన వెంటనే స్పందించి లేచి వచ్చి వారిని వెంటనే అక్కడ నుంచి దిగిపోవాలని అభ్యర్థించారు. వారికి ఏ ప్రమాదం జరగకూడదన్నది ఆయన ఆకాంక్ష. జై ఏపీ.. జై భారత్, జైహింద్!


ప్రజాగళం వేదికపై ఆహ్లాదంగా మాట్లాడుకుంటున్న మోదీ, చంద్రబాబు

హిందీలో బాబు ప్రసంగం

బొప్పూడి సభలో చంద్రబాబు కొద్దిసేపు హిందీలో మాట్లాడారు. ప్రధాని మోదీని ప్రస్తుతిస్తూ హిందీలో రాసుకొచ్చిన ప్రసంగాన్ని చదివారు. ప్రధాని కూడా ఆసక్తిగా ఆలకించారు. వైసీపీ పాలనా వైఫల్యాలపైనా బాబు కాసేపు ఆంగ్లంలో మాట్లాడారు.


ప్రజాగళం సభా ప్రాంగణంలో మహిళల సందడి

ఇండియా ట్రెండ్స్‌లో 'ప్రజాగళానికి' ప్రథమ స్థానం

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఆదివారం చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగసభ దేశ వ్యాప్తంగా 'ఎక్స్'లో వైరల్ అయ్యింది. ఇండియా ట్రెండ్స్‌లో 'ప్రజాగళం' హ్యాష్ ట్యాగ్‌తో నంబర్ వన్ స్థానంలో నిలిచింది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తును ఆహ్వానిస్తూ, వేల సంఖ్యలో ట్వీట్లతో నెటిజన్లు మద్దతు తెలిపారు. ఏపీ వెల్‌కం టూ మోదీ, చంద్రబాబు-పవన్‌కల్యాణ్- నరేంద్రమోదీ ఎట్‌దీ రేట్ ఆఫ్ ప్రజాగళం, టీడీపీ-జేఎస్‌పీ- -బీజేపీ విన్నింగ్ హ్యాష్ ట్యాగ్‌లు కూడా ట్రెండింగ్‌లో నిలిచాయి.

● మార్మోగిన అమరావతి నినాదం

అమరావతి రైతుల విజ్ఞప్తి మేరకు ప్రజాగళం సభలో రైతుల కోసం మహిళల కోసం ప్రత్యేక గ్యాలరీ కేటాయించారు. పెద్ద సంఖ్యలో హాజరైన అమరావతి రైతులు, రాజధాని మహిళలు 'జయహో అమరావతి, సేవ్ ఆంధ్ర ప్రదేశ్' నినాదాలతో హోరెత్తించారు.

● ఎన్డీఏ కూటమి ఐక్యతను చాటిన ప్రజాగళం

మూడు పార్టీల ఐక్యతను ఆంధ్ర జనం బలంగా కోరుకుంటున్న విషయం సభలో ప్రస్ఫుటంగా కనిపించింది. ఐదు కోట్ల ఆంధ్రుల ప్రతినిధులుగా తరలివచ్చిన లక్షలాది మంది జనం.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఐక్యత పట్ల సంఘీభావంగా నినాదాలు చేశారు. మూడు పార్టీలూ ఈ ఐక్యతను దీర్ఘకాలం కొనసాగించాలని బలంగా కోరుకున్నారు. నేతల సమన్వయం అక్కడికే పరిమితం కాకుండా పార్టీ శ్రేణుల్లో కూడా స్పష్టంగా కనిపించింది. మూడు పార్టీల జెండాలు చేతబూని ప్రధానికి స్వాగతం పలికిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. కూటమి స్ఫూర్తిని చాటారు. వేదిక మీద కూడా నేతలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని సమన్వయంతో వ్యవహరించారు.

మోదీ ప్రసంగం సమయంలో పవర్ కట్!

» 11 నిమిషాలు విద్యుత్ సరఫరా నిలిపివేత

» చంద్రబాబు, పవన్ ప్రసంగిస్తున్న సమయంలోనూ..

తెనాలి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్తంగా ఆదివారం ప్రజాగళం సభ నిర్వహిస్తున్న సమయంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సరిగ్గా ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న సమయంలో గుంటూరు జిల్లా కొల్లిపరలో విద్యుత్ సరఫరాను ఆపివేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మాట్లాడే సమయంలో కూడా మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మోదీ ప్రసంగం సమయంలో మొత్తం 11 నిమిషాలు విద్యుత్ సరఫరాను ఆపివేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రసంగాలప్పుడు సరఫరాను తీస్తూ.. ఇస్తూ ఇబ్బందులకు గురిచేశారు. ఎక్కువ శాతం గుంటూరు జిల్లాలోని తెనాలి, కొల్లిపర, రూరల్ గ్రామాల్లోను, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, లంకగ్రామాలు, తీరంలో చాలా చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించారు. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్ నెంబర్లకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదని, కావాలనే సరఫరాను నిలిపివేసి ఉంటారని దీనిని బట్టి అర్థమవుతోందని జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం అటువంటి ఆదేశాలేవి తమకు రాలేదని, ప్రసంగాల సమయాల్లో సరఫరాను ఆపలేదని, ఉదయం నుంచి అక్కడక్కడ మరమ్మతుల సందర్భంగా కొద్దిసేపు అంతరాయం కలిగిందని, సభ కోసం తీసివేసిందిలేదని చెప్పుకొచ్చారు.


ప్రజా గళం సభా ప్రాంగణంలో జనసేన జెండాలతో యువతులు

మీది చాలా గట్టి స్వరం!

సభకు జనం భారీగా వచ్చారని ప్రశంసలు

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల తర్వాత రాజకీయ వేదికపై తొలిసారి కలుసుకొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు ఆప్యాయంగా కబుర్లు చెప్పుకొన్నారు. ఎన్డీయేలో టీడీపీ చేరిన తర్వాత మూడు పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం పల్నాడు జిల్లా బొప్పూడి వద్ద జరిగిన భారీ బహిరంగ సభకు మోదీ హాజరయ్యారు. సుమారు ఆరేళ్ల తర్వాత ఎన్డీయే కూటమి బహిరంగ సభలో మోదీ, చంద్రబాబు కలుసుకొన్నారు. అంతకు ముందు వేర్వేరు వేదికలపై కలుసుకొని మాట్లాడుకొన్నా, రాజకీయ వేదికపై వీరిద్దరూ కలుసుకోవడం ఇంత సుదీర్ఘ విరామం తర్వాత ఇదే ప్రథమం. వేదికపై మోదీ పక్కనే చంద్రబాబు కూర్చున్నారు. సభకు జనం హాజరు అద్భుతంగా ఉందని, ప్రజానీకం విపరీతంగా తరలివచ్చారని మోదీ చంద్రబాబుతో చెప్పారు. తాను హెలికాప్టర్లో పైనుంచి చూశానని, హాజరు చాలా బాగా ఉందని తెలిపారు. ఆయన ప్రశంసకు పొంగిపోయిన చంద్రబాబు నమస్కారం పెట్టి ధన్యవాదాలు చెప్పారు. సభలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తుండగా మోదీ లేచి వచ్చి మైక్ తీసుకొన్నారు. కార్యకర్తలు విద్యుత్ లైట్ల టవర్‌పైకి ఎక్కి నిల్చున్నారని, తక్షణం కిందికి దిగాలని, వారికి ఏదైనా ప్రమాదం జరిగితే తాము బాధపడాల్సి వస్తుందని మోదీ విజ్ఞప్తి చేశారు. మోదీ స్వయంగా చెప్పడంతో కార్యకర్తలు వెంటనే టవర్ పైనుంచి దిగిపోయారు. మోదీ చెప్పడంతో వెంటనే దిగారని, తామైతే చాలాసేపు వారిని బతిమాలాల్సి వచ్చేదని చంద్రబాబు మోదీతో అన్నారు. చంద్రబాబు తన ప్రసంగం ముగించి తన సీటు వద్దకు వచ్చినప్పుడు ఆయన కంచు కంఠాన్ని మోదీ ప్రశంసించారు. 'మీరు చాలా గట్టిగా మాట్లాడుతున్నారు. అంత గట్టిగా మాట్లాడితే మాకైతే గొంతు నొప్పి వస్తుంది. మీది చాలా గట్టి స్వరం' అని మోదీ అన్నారు. దీనికి చంద్రబాబు మరోసారి ఆయనకు నమస్కారం పెట్టి కృతజ్ఞతలు చెప్పారు. తాను అలా అలవాటుపడ్డానని, అలా మాట్లాడకపోతే సభలో ఊపు రాదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

వేదికపై చంద్రబాబుతో మోదీ ముచ్చట్లు


పొలాలు దాటుకుంటూ ప్రజా గళం సభకు వెళ్తున్న జనం




కుటుంబ సమేతంగా...


ఊరంతా కలిసి...


దారంతా ప్రజా గళానికే..

ప్రజాగళం సభకు భారీగా తరలి వెళ్తున్న జనం

ట్రాక్టర్‌కు తెలుగుదేశం జెండాలు కట్టుకుని తరలి వెళ్తున్న ప్రజలు

కూటమిదే పీఠం

మోదీ రాక.. ఎన్డీయే పునఃకలయిక.. 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు ఆనందం: పవన్

(బొప్పూడి సభాప్రాంగణం నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్రంలో జనసేన-టీడీపీ-బీజేపీ కూటమిదే విజయమని జనసేనాని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. గంగమ్మ తల్లి హిమాలయాల నుంచి భూమ్మీదకు వచ్చి ఎలా సేదనిచ్చిందో.. మోదీ రాక, ఎన్డీయే పునఃకలయిక 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు ఆనందాన్నిచ్చిందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఉమ్మడిగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన భారీ బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. అభివృద్ధి లేక అప్పులతో నలిగిపోతున్న ఆంధ్రా ప్రజానీకం.. దాష్టీకం, దోపిడీతో నలుగుతున్న ఆంధ్ర ప్రజానీకం.. అవినీతి, అప్రజాస్వామిక విధానాలతో కొట్టుమిట్టాడుతున్న ఆంధ్ర ప్రజానీకం.. మోదీ రాక కోసం ఎదురుచూస్తోందన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతూ.. హ్యాట్రిక్ కొట్టబోతున్న మోదీకి ఆంధ్ర ప్రజల తరపున, ఎన్డీయేలో భాగస్వాములైన మూడు పార్టీల తరపున ఘనస్వాగతం పలుకుతున్నానని చెప్పారు. 'ఆంధ్ర రాజధాని అమరావతి దేదీప్యమానంగా వెలగాలని, దానికి నేను అండగా ఉన్నానని మోదీ వచ్చారు. మన కోసం, మన కష్టానికి భుజం కాయడానికి, 5 కోట్ల మంది ప్రజల కోసం నేను ఉన్నానని వచ్చారు. జరుగబోయేది కురుక్షేత్రం. ఈ యుద్ధంలో ధర్మానిదే విజయం.. కూటమిదే పీఠం. నేను దేవదత్తం పూరించాను. అర్జునుడు పూరించిన శంఖం పేరు దేవదత్తం. గుజరాత్‌లోని ద్వారక నుంచి వచ్చిన మోదీ పాంచజన్యం పూరిస్తారు. 2014 బాలాజీ ఆశీస్సులతో సాధించిన విజయాన్ని మించిన ఘనవిజయాన్ని ఈసారి సాధిస్తున్నాం. బిడ్డలకు అండగా ఉండే దుర్గమ్మ తల్లి.. అయ్య కంటే ఒక ముద్ద ఎక్కువే పెడుతుంది. అలాంటి తల్లి ఆశీస్సులతో మన ప్రభుత్వం స్థాపించే దిశగా వెళ్తున్నాం' అని చెప్పారు. సీఎం జగన్, వైసీపీ వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆయన ఏమన్నారంటే..

> అయోధ్యకే రాముడిని తీసుకొచ్చిన ప్రధాని మోదీ ఇక్కడుంటే.. రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిన చిటికెడంత రావణాసురుడిని తీసేయడం అంత కష్టమా?
>
> 2014లో తిరుపతి బాలాజీ సాక్షిగా పొత్తు మొదలైంది. ఈ రోజు 2024లో బెజవాడ కనకదుర్గమ్మ సాక్షిగా వేరే రూపం తీసుకోబోతోంది. దుర్గమ్మ తల్లి స్వయంగా ఆశీర్వదిస్తుంది.



ఐదేళ్లలో 1.13,583 కోట్ల మద్యం అమ్మకం

కానీ చూపింది 84,050 కోట్లే

పది వేల కోట్ల జీఎస్టీ మోసం

ఇసుకలో 40 వేల కోట్ల దోపిడీ

ఏపీలో బ్లాక్ మనీ..

దేశాన్ని డిజలైజ్ చేద్దాం.. అవినీతిని తగ్గిద్దాం.. బ్లాక్ మనీని తగ్గిద్దామని మోదీ భావిస్తుంటే.. ఏపీలో మాత్రం బ్లాక్‌మనీ ఎక్కువైపోయింది. సంపూర్ణ మద్యపాన నిషేధం అని అధికారంలోకి వచ్చిన వ్యక్తి ఈ రోజు సారా వ్యాపారిగా మారారు. ఒక్క సారా వ్యాపారంలోనే ఐదేళ్లలో రూ.1.13,583 కోట్ల మద్యాన్ని అధికారికంగా, అనధికారికంగా అమ్మారు. కానీ రూ.84,050 కోట్లు మాత్రమే అమ్మినట్లు చూపించారు. పది వేల కోట్ల రూపాయల జీఎస్టీ మోసం జరిగింది. ఇసుకను కూడా దోపిడీ చేశారు. జేపీ వెంచర్స్ సంస్థ ద్వారా బినామీలు రూ.40 వేల కోట్లు దోచుకుని, భారీ స్కాం చేశారు. అడిగిన వాళ్లను హింసించడంతో పాటు చిత్తూరు జిల్లాలో కిషన్ అనే రిపోర్టర్‌ని చంపేశారు. ఏపీలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా లేదు. రాష్ట్రమంతా గంజాయి నిండిపోయింది. ఏపీ మాదకద్రవ్యాలకు కొత్త రాజధానిగా మారిపోయింది. రాష్ట్రంలో 2019-21 నడుమ 30,196 మంది ఆడవాళ్ల అదృశ్యం అయ్యారు. కేంద్రమే రాజ్యసభలో చెప్పినా.. ఈ రాష్ట్రప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. ఒకవైపు విదేశీ సంస్థలు దేశానికి వస్తుంటే.. ఏపీకి రావలసినవి మాత్రం పారిపోతున్నాయి. అమర్‌రాజా, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, రిలయన్స్ ఎలక్ట్రిక్ యూనిట్.. ఇవన్నీ వెళ్లిపోయాయి. 2019లో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి 10.24 శాతం ఉంటే.. 2024 నాటికి మైనస్‌లోకి వెళ్లిపోయింది. నెగిటివ్ గ్రోత్‌లో వెళ్లిపోతోంది.

అడ్డూఅదుపు లేదని..

వైజాగ్ సంఘటన, ప్రతిపక్ష నాయకులపై ఎలాంటి దాడులు చేశారో చూశారు. వైసీపీ నాయకులు బీజేపీ కార్యకర్తల పొట్టల్లో కత్తులు గుచ్చి పేగులు బయటకు తీశారు. వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయించారు. చంద్రబాబును అరెస్టు చేసి ఇబ్బందులు పెట్టారు. నన్నూ అనేక పర్యాయాలు అడ్డుకున్న ఈ ప్రభుత్వం పోవాలి. పోవాలంటే ప్రజలే పూనుకోవాలి. జగన్‌కు డబ్బులు పెరిగిపోయాయి.. అడ్డూ అదుపూ లేదని అనుకుంటున్నాడు. రావణాసురుడు కూడా నా చుట్టూ బంగారంతో కట్టిన లంక ఉంది.. వజ్రవైడూర్యాలతో ఉన్న పుష్పకవిమానం ఉంది. వీరులు, శూరులు.. మందీమార్బలం ఉన్నాయని.. నన్నేమి చేయగలరని అనుకున్నాడు. నార పంచె కట్టుకున్న, నేల మీద నిలబడి శ్రీరాముడు బాణంతో చంపేశాడు. రాష్ట్రంలో రామరాజ్యం స్థాపన జరగబోతోంది.

మన గెలుపు ఖాయం!

- రాష్ట్రంలో వేవ్ ఉంది.. ప్రజాగళం సభ తర్వాత మోదీ వ్యాఖ్య
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతో మాటామంతీ

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఘన విజయం ఖాయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పల్నాడు జిల్లా బొప్పూడి వద్ద ప్రజాగళం సభ ముగిసిన తర్వాత ఆయన కొద్దిసేపు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. 'సభ చాలా బాగా జరిగింది. ప్రజల్లో ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో వేవ్ ఉంది. మన గెలుపు ఖాయం' అన్నారు. చంద్రబాబు అరెస్టు తర్వాత వీరిద్దరూ కలుసుకోవడం ఇదే ప్రథమం కావడంతో అప్పటి పరిణామాల గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. జైల్లో ఉన్న సమయంలో కొన్ని ఇబ్బందులు వచ్చాయని, ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదని చంద్రబాబు బదులిచ్చారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, వైసీపీ ప్రభుత్వ వ్యవహారాలను ప్రధానికి చంద్రబాబు, పవన్ వివరించారు. రాష్ట్రంలో వ్యవస్థలను కుప్పకూల్చిన తీరు, అధికార దుర్వినియోగం, ప్రతిపక్షాలపై తీవ్రమైన అణిచివేత, రాష్ట్రం ఈ ఐదేళ్లలో వెనకబడిపోయిన తీరు, అవినీతి తదితర అంశాలను సోదాహరణంగా ప్రధానికి వివరించారు. వారు చెప్పిన విషయాలను ప్రధాని శ్రద్ధగా విన్నారు.


సభా వేదికపై మోదీతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



సెల్‌ఫోన్ వెలుగులు

ప్రజాస్వామ్యంలో పండుగలాంటి ఎన్నికల ప్రక్రియను స్వాగతిస్తూ సెల్‌ఫోన్‌లో టార్చ్‌లైట్లను వెలిగించాలని ప్రధాని మోదీ కోరారు. దీంతో సభకు వచ్చిన వారంతా సెల్ టార్చ్‌లను ఆన్ చేసి ప్రదర్శించారు. 'ఈ వెలుగులు అభివృద్ధి చెందుతున్న దేశానికి నిదర్శనం' అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

ప్రజాగళ గర్జన!

'కూటమి' సభలో ఉరిమిన ఉత్సాహం

కిక్కిరిసిన సభా ప్రాంగణం

హైవేపై కిలోమీటర్ల కొద్దీ జనం

రాష్ట్రం నలుమూలల నుంచీ రాక

(చిలకలూరిపేట/నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

'ప్రజాగళం' సభకు రాష్ట్రం నలుమూలల నుంచీ జనం వచ్చారు. ప్రధానంగా ఉమ్మడి గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కృష్ణా జిల్లాల నుంచి భారీగా తరలి వచ్చారు. బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు... ఇలా అందుబాటులో ఉన్న అన్ని రవాణా సాధనాలను ఉపయోగించుకున్నారు. మూడు పార్టీల కార్యకర్తలే కాకుండా సాధారణ ప్రజలు కూడా స్వచ్ఛందంగా కదలిరావడంతో సభా ప్రాంగణం జనసాగరాన్ని తలపించింది. సభకు రెండు కిమీ దూరంలోనే వాహనాలను ఆపేసినా, ఎండను సైతం లెక్క చేయకుండా నడుచుకుంటూ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రసంగాలకు ప్రజల నుంచి అద్భుత స్పందన లభించింది. 2014 ఎన్నికల్లో 3పార్టీలు కలసి ఘన విజయం సాధించాయి. ఇప్పుడూ అదే రిపీట్ అవుతుందని అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జగన్‌పై విమర్శలకు జనం నుంచి అనూహ్య స్పందన లభించింది. సైకో జగన్‌ను తరిమికొట్టేందుకు సిద్ధమా... అని అధినేతలు ప్రశ్నించగా లక్షలాది మంది సిద్ధమంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.

ఉత్సాహపరిచిన నేతలు

పవన్ కల్యాణ్, నాగబాబు మధ్యాహ్నం 2.30 గంటలకే ప్రాంగణానికి చేరుకుని ఉత్సాహం నింపారు. టీడీపీ యువనేత లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 3.30కు వచ్చారు. సభకు వచ్చిన ప్రజలను అలరించేందుకు కళాకారులు రకరకాల కళా రూపాలు ప్రదర్శించారు. డప్పుల నృత్యం, కోలాటం, బాంగ్రా, కిందిరి, రేలా తదితర సంప్రదాయ, గిరిజన కళా రూపాలను 3 గంటలపాటు ప్రదర్శించారు. వలంటీర్లు నిరంతరం మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేశారు. సభను విజయవంతం చేసేందుకు మూడు పార్టీల నేతలు సమన్వయంతో కృషి చేశారు. తమ శ్రమ ఫలించిందని, 'ప్రజాగళం' సభకు అనూహ్య స్పందన లభించిందని పార్టీల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసులు ఎక్కడ?

ప్రధాని పాల్గొన్న సభపైనా నిర్లక్ష్యం.. ట్రాఫిక్ నియంత్రణ గాలికి

కిలోమీటర్ల కొద్దీ నిలిచిన వాహనాలు

'సౌండ్' స్టాండ్లపైకి ఎక్కిన జనం

ఆడియో కేబుల్ తెగి ఆగిన సౌండ్ సిస్టమ్

ప్రధాని ప్రసంగిస్తుండగానే అంతరాయం

అయినా పట్టించుకోని పోలీసులు

(గుంటూరు/నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటికి వస్తున్నారంటేనే... కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్‌ను ఆపేస్తారు! జగన్ రాజకీయ సభలకు ఎక్కడెక్కడో ఉన్న జిల్లాల నుంచీ పోలీసులను తరలించి మోహరిస్తారు. కానీ.. ఏకంగా ప్రధానమంత్రి పాల్గొన్న 'ప్రజాగళం' సభపై మాత్రం పోలీసు అధికారులు పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారీగా జనం తరలి వస్తారని తెలిసినా ట్రాఫిక్ నియంత్రణను పట్టించుకోలేదు. దీంతో సభా ప్రాంగణానికి అటూఇటూ కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగిపోయాయి. చిలకలూరిపేట నుంచి నరసరావుపేట రహదారి, కొత్త బైపాస్ రోడ్డులో బొప్పూడికి ఉన్న రహదారుల్లో కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సభావేదికపై నుంచి టీడీపీ నేత ప్రత్తిపాటి పుల్లారావు పదేపదే పల్నాడు, బాపట్ల, గుంటూరు ఎస్పీలకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకపోయింది. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ట్రాఫిక్‌ను గాలికి వదిలేశారని నేతలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇక... పార్కింగ్ స్థలాల నిర్వహణనూ పట్టించుకోలేదు. ప్రాంగణంలోకి ప్రజలు వెళ్లే సందర్భంలో కూడా పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. మీడియా గ్యాలరీతో పాటు మెడికల్ క్యాంపు వైపు కూడా కార్యకర్తలు దూసుకుని రావడంతో తొక్కిసలాట జరిగింది. మహిళలకు కేటాయించిన గ్యాలరీల్లోకి పురుషులు వస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు.

సభలో తొక్కిసలాట...

పోలీసులు పట్టించుకోకపోవడంతో సభా ప్రాంగణంలో తీవ్రమైన తొక్కిసలాట చోటు చేసుకుంది. పవన్ కల్యాణ్ ప్రసంగించే సమయంలో కొంతమంది కార్యకర్తలు సౌండ్ సిస్టం కోసం ఏర్పాటు చేసిన స్టాండ్‌లపై కూడా ఎక్కి నిలబడ్డారు. వారిని వారించేందుకు సాక్షాత్తు ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. స్టాండ్ పైనుంచి కార్యకర్తలు కిందకి దిగే వరకు కూడా ప్రధానమంత్రి దిగాలని వారికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. పైనుంచి దిగాలని చంద్రబాబు రెండు చేతులు జోడించి కార్యకర్తలను వేడుకోవడం కనిపించింది. అప్పుడు కూడా పోలీసులు జోక్యం చేసుకోలేదు. ఆడియో కేబుల్స్ తెగడంతో పలు మార్లు సౌండ్ సిస్టమ్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రధాని మూడు నాలుగు నిమిషాలపాటు ప్రసంగాన్ని నిలిపి వేయాల్సి వచ్చింది. కార్యకర్తలను నియంత్రించాలని నేతలు పోలీసులకు విజ్ఞప్తి చేసినా సరైన స్పందన కనిపించలేదు. టీడీపీ ముఖ్య నేతలు వేదిక దిగి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. కొన్ని రోజులక్రితం ఇదే మార్గంలో జగన్ నిర్వహించిన సభకు ఎటువంటి అంతరాయం లేకుండా పోలీసులు రేయింబవళ్లు కష్టపడి పనిచేశారు. ఇప్పుడు.. ఏకంగా ప్రధాని హాజరైన సభను కూడా పట్టించుకోకపోవడం, కోడ్ వచ్చిన తర్వాత కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రజా గళం వేదికపై మోదీ, చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కల్యాణ్ అభివాదం

జగన్ అరాచకాన్ని తుంగలో తొక్కుదాం



ఈ జనసంద్రాన్ని చూస్తుంటే జగన్‌పై ఏ స్థాయి వ్యతిరేకత ఉందో కళ్లకు కనిపిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకే కూటమి ఏర్పడింది. ఐక్యంగా అడుగులు వేద్దాం. జగన్ అరాచకాన్ని తుంగలో తొక్కుదాం.

- కె.అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందాం..



ఐదేళ్లుగా ఆంధ్ర ప్రజలు పడుతున్న కష్టాలకు ముగింపు నినాదం ప్రజాగళం. ఇది నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడానికి తీసుకున్న గళం. రాష్ట్రాన్ని ప్రపంచస్థాయిలో నిలబెట్టిన చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని కాపాడుకుందాం. మనందరిదీ ఒకే పంతం. అదే జగన్ రెడ్డి పాలన అంతం.

- కొల్లు రవీంద్ర

ప్రతివర్గానికి ప్రజాగళం భరోసా



రాష్ట్రంలో ప్రతి వర్గానికి ప్రజాగళం భరోసా ఇవ్వబోతోంది. ప్రజా ప్రభుత్వంలో యువత, మహిళల కలలకు రెక్కలు తొడుగుతాం. ఐదేళ్లలో ఆగిపోయిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరించుకుందాం. ఆగిపోయిన అమరావతిని పునర్నిర్మించుకుందాం. సువర్ణాంధ్రప్రదేశ్‌కు బాటలు వేద్దాం.

- లావు కృష్ణదేవరాయులు, నరసారావుపేట ఎంపీ

ఇది మరో కురుక్షేత్ర యుద్ధం



ఇది మరో కురుక్షేత్ర యుద్ధం. ఐదేళ్ల అరాచక పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గర పడింది. కూటమి తిరుగులేని విజయానికి బొప్పూడి సభ శుభసూచికగా నిలవబోతోంది. బొప్పూడి ఆంజనేయస్వామి సాక్షిగా రాబోయే ఎన్నికల్లో విజయదుందుభి మోగించబోయేది మనమే.

- ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి

ఐదేళ్ల దగాపై నిరసన గళం..



విముక్త ఆంధ్రప్రదేశ్ సాధనకు ఉమ్మడి నినాదం ప్రజాగళం. జగన్ ఐదేళ్ల దగాను నిరసిస్తూ ప్రారంభించిన గళం. జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. మరో ఛాన్స్ ఇస్తే రాష్ట్రమే లేకుండా చేస్తారు.

- నిమ్మల రామానాయుడు, టీడీపీ ఎమ్మెల్యే

గొడ్డలి వేటు వేసే వాళ్లకు గుండెపోటే!



గొడ్డలి పోటు వేసేవారికి ప్రజాగళం సభను చూసి గుండెపోటు తెప్పించాలి. దేశాన్ని ప్రపంచ పటంలో అత్యున్నత స్థానంలో నిలిపే మోదీ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత, దార్శనికుడు చంద్రబాబు, విశ్వసనీయతకు మారుపేరైన పవన్ కల్యాణ్ త్రిమూర్తుల్లా ఒక వేదికపైకి రావడం వారికి వణుకు పుట్టించాలి. రాష్ట్రంలో ఆరాచక, అవినీతి పాలన సాగుతోంది. హామీలు నెరవేర్చలేని ముఖ్యమంత్రి పరదాలూ, బారికేడ్ల మధ్య తిరుగుతున్నాడు.

- సత్యకుమార్, బీజేపీ నాయకుడు

వడ్డీతో తిరిగి చెల్లిస్తాం..



అక్కడ కేంద్రంలో మోదీ.. ఇక్కడ ఆంధ్రాలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ ఐదేళ్లలో కార్యకర్తలను వేధించినవారికి వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం. అది అధికారులైనా, అధికార పార్టీలోవారైనా వదిలే ప్రసక్తే లేదు. ల్యాండ్, శాండ్, మైనింగ్ ఏదీ వదలకుండా దోపిడీ చేశారు. కక్షగట్టి కార్యకర్తలను వేధించారు. అవినీతి, వేధింపులకు పాల్పడిన వారినీ వదిలేది లేదు.

- సీఎం రమేశ్, బీజేపీ నాయకుడు

అరాచక పాలన అంతం బాధ్యత ప్రజలదే..



రాష్ట్రంలో నెలకొన్న అరాచక పాలన అంతానికి ప్రజలే బాధ్యత తీసుకోవాలి. ప్రజలు ఎదుర్కొనే సమస్యల నుంచి బయట పడాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలి. అందుకోసం ప్రజలే బాబును గెలిపించుకోవాలి.

- నక్కా ఆనందబాబు, టీడీపీ

బీసీ సంక్షేమాన్ని జగన్ నాశనం చేశారు

జగన్ బీసీలకు 70 సీట్లు ఇచ్చేశామని చెబుతున్నారు. ఐదేళ్లలో ఏ ఒక్క బీసీ కులానికైనా న్యాయం చేసింది ఉందా? ఏవో కొంత మందికి సీట్లు ఇచ్చేస్తే అది సామాజిక న్యాయం అవుతుందా? ఐదేళ్లలో బీసీ సంక్షేమాన్ని జగన్ నాశనం చేశారు. బీసీ విద్యార్థులు చదువుకునే స్టడీ సెంటర్లను కూడా మూసివేశారు. విదేశీ విద్య పక్కన పెట్టారు. ప్రతివారికి కూడా నేను నొక్కాను.. నొక్కాను అంటూ చెబుతున్నారు. బీసీలకు న్యాయం చేశాను, ప్రజలంతా నా పక్కనే ఉన్నారన్న మాయమాటలను బీసీ సోదరులు నమ్మొద్దు. రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలనే పవన్ పొత్తులు పెట్టుకున్నారు.

- గాదె వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ నాయకుడు

ఐదేళ్లుగా అభివృద్ధి లేదు..

జగన్ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి లేదు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేవు. పరిశ్రమలే కాదు చివరికి సరైన రోడ్లు కూడా లేవు. పోలవరం ముందుకు సాగలేదు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేసిన ఘనత దుర్మార్గపు ముఖ్యమంత్రికే దక్కింది. రాబోయే రోజుల్లో ఎన్డీఏ ద్వారా మంచి పాలన అందించేలా చేసుకుందాం. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను ప్రజలంతా కలిసి ఎన్నుకోవాలి.

- బొమ్మిడి నాయకర్, నర్సాపురం జనసేన అభ్యర్థి

వైసీపీకి అనుకూలంగా ఉన్న అధికారులను బదిలీ చేయండి

» హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో వైసీపీకి అనుకూలంగా అధికారులను బదిలీ చేయాలని కోరతూ ప్రకాశం జిల్లా ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిని విచారణకు స్వీకరించిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సోమవారం విచారణ జరగనుంది. డీపీవో నారాయణరెడ్డి, జడ్పీ సీఈవో జాలిరెడ్డి, ఇటీవలి వరకు డ్వామా పీడీగా ఉన్న కె.శీనారెడ్డి, డీసీవోగా అదనపు బాధ్యతల్లో పనిచేసిన పి.రాజశేఖర్, ఆర్డీవో సుబ్బారెడ్డి, నిక్‌నెట్‌లో పనిచేస్తున్న కట్టా ప్రసాద్, విద్యాశాఖలో ఏఎస్‌వో అంజిరెడ్డి, ఒంగోలు ఒన్‌టౌన్ సీఐ లక్ష్మణ్, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డిలను బదిలీ చేయాలని దామచర్ల కోరారు.

జడ్పీ సీఈవో, డీసీవో రిలీవ్

జిల్లా పరిషత్ సీఈవో జాలిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డిలను ఆదివారం రాత్రి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జనార్దన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో ఆదివారం ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా ఆవిషయాన్ని ప్రస్తావించి తక్షణ చర్యలకు కలెక్టర్‌ను ఆదేశించారు.

వైసీపీ నేతలపై కోడ్ ఉల్లంఘన కేసు

బాపట్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ తాజాగా ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో బాపట్ల సీటును తిరిగి కోన రఘుపతికే కేటాయించడంతో శనివారం రాత్రి ఆయన అనుచరులు పట్టణంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేయడంతోపాటు గడియార స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. కోడ్ అమల్లోకి వచ్చినా.. అనుమతి లేకుండా ర్యాలీ చేయడం, పెద్ద ఎత్తున శ్రేణులు గుమిగూడడం వంటి వన్నీ ఉల్లంఘన కిందకు రావడంతో బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నేతలపై ఆదివారం కేసు నమోదు చేశారు.

ముద్రగడ కాపు ద్రోహి

» పవన్ మాటే శాసనం.. కూటమికే మా మద్దతు: పులి శ్రీరాములు

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఏపీలో వచ్చే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికే తమ మద్దతు ఉంటుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి శ్రీరాములు ప్రకటించారు. ముద్రగడ పద్మనాభం కాపు ద్రోహి అని అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాటే తమకు శాసనమని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ 'ఎప్పటి నుంచో సహచర కాపునేతగా ముద్రగడతో కాపు సామాజిక బాధ్యతల్లో ఉన్నాను. ఆయనలో నాయకత్వ లక్షణాలు లేవు. చిన్న చిన్న విషయానికే అలుగుతాడు. తునిలో అమాయక కాపు యువతను రెచ్చగొట్టాడు. ఉద్యమాన్ని నడిపే నాయకుడికి దానిని నియంత్రించే శక్తి కూడా ఉండాలి. అది ముద్రగడకు లేదు. అకారణంగా కాపు యువత కేసుల్లో ఇరుక్కున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో పని ఒత్తిడితో ఉన్న పవన్ కల్యాణ్.. సకాలంలో తన ఇంటికి రాలేదనే సాకుతో అలిగి వైసీపీలో చేరారని, ముద్రగడ సమాజానికి ఏం సందేశమిస్తారని ప్రశ్నించారు. కాపు కులద్రోహిగా ఉన్న ముద్రగడ చరిత్రహీనుడుగా మిగిలిపోయాడన్నారు. ఇటీవల కొందరు కాపు నేతలు తప్పుదారి పట్టారని, వారికి కాపు సామాజిక వర్గ మద్దతు లేదన్నారు.

అభ్యర్థిని మార్చండి: తిరుపతి జనసైనికుల డిమాండ్

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ స్థానానికి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఉన్న ఆరణి శ్రీనివాసులును మార్చాలని జనసేన పార్టీ స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. జనసేన పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి తిరుపతికి వెళ్లిన అజయ్‌కుమార్.. ఆదివారం స్థానిక జనసేన నాయకులతో భేటీ అయ్యారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని, ఆయనతో కలిసి పని చేయాలని కోరారు. ఆయన విన్నపాన్ని స్థానిక నాయకులు అంగీకరించలేదు. తిరుపతిలో ఉన్న వాస్తవ పరిస్థితులను వివరించారు. తిరుపతి కచ్చితంగా గెలిచే స్థానమని, ఇలాంటి అభ్యర్థిని నిలబెట్టడం వల్ల సీటు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. ఈ విషయాన్ని అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని, అవసరమైతే తాము కూడా ఆయన్ని కలిసి వివరిస్తామని అజయ్ కుమార్‌కు తెలియజేశారు. వారి అభ్యంతరాలను గుర్తించిన ఆయన అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. భేటీలో తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, తిరుపతి అర్బన్ అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోస్తాలో జల్లులు.. 20, 21 తేదీల్లో వర్షాలు

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విదర్భ నుంచి నుంచి మరఠ్వాడ, కర్ణాటక మీదుగా కేరళ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఇంకా పశ్చిమమధ్య బంగాళాఖాతంలో అధిక పీడనం కొనసాగుతున్నది. కోస్తా, రాయలసీమలో ఎండ తీవ్రత నెలకొనడంతో వాతావరణ అనిశ్చిత నెలకొంది. వీటన్నింటి ప్రభావంతో ఉత్తర కోస్తాలో పలుచోట్ల మేఘాలు ఆవరించి అక్కడక్కడా జల్లులు కురిశాయి. మరోవైపు రాయలసీమలో అనేక చోట్ల తీవమైన ఎండ తీవ్రత నెలకొనడంతో ప్రజలు ఠారెత్తిపోయారు. అనంతపురంలో ఆదివారం దేశంలో అత్యధికంగా 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా, రాయలసీమలో పొడివాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. కాగా ఈ నెల 19వ తేదీన పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడువరకు ఉపరితలద్రోణి ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఈ నెల 20, 21 తేదీల్లో కోస్తా, రాయలసీమలో వర్షాలు పెరుగుతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

పంతం నీదా.. నాదా!

లోక్‌సభ ఎన్నికల్లో మోదీ గ్యారెంటీ X రాహుల్ న్యాయ్ గ్యారెంటీలు



న్యూఢిల్లీ, మార్చి 17: ఓవైపు భావోద్వేగం.. మరోవైపు భావజాలం..! అటు అభివృద్ధి వాదం.. ఇటు అసమానతలపై నిరసన నినాదం..! పాతికేళ్ల ప్రగతి ప్రయాణానికి ఒకరి పిలుపు..! పదేళ్లలో వ్యవస్థల విధ్వంసం మాటేమిటంటూ ప్రత్యర్థి ప్రశ్నలు..! వెరసి వచ్చే లోక్‌సభ ఎన్నికలు అత్యంత రసవత్తరంగా జరగడం ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ 'మోదీ గ్యారంటీ'లను అగ్రనేత రాహుల్ గాంధీ న్యాయ్ గ్యారెంటీలతో కాంగ్రెస్ ఢీకొట్టనుంది. రాబోయే సార్వత్రిక సమరాంగణంలో ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి ఆయుధాలుగా మారే పది కీలక అంశాలివే..

మోదీ గ్యారెంటీలు: మూడోసారీ మాదే అధికారం అంటూ అంతులేని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్న ప్రధాని మోదీ.. 'మోదీ గ్యారంటీ'ని ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. యువతకు మంచి భవిష్యత్, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తాము చేసిన కృషిని వివరిస్తూ ఓట్లడిగే వీలుంది.

కాంగ్రెస్ న్యాయ్ గ్యారెంటీలు: తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో 'గ్యారెంటీలు' అంటూ ప్రజల్లోకి వెళ్లి విజయవంతమైన కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికలకూ ఇదే విధంగా 'ఐదు న్యాయ్ గ్యారెంటీలను' ప్రకటించింది. యువత, రైతులు, మహిళలు, కార్మికులను దృష్టిలో పెట్టుకుని వీటిని రూపొందించింది. మణిపూర్ నుంచి ముంబైకి భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం సందర్భంగా రాహుల్ వీటి గురించి చెప్పారు. ఈ అంశాల ఆధారంగానే కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఉంటుందని, వీటిచుట్టూనే ప్రచారం జరిగేలా చూస్తుందని అంచనా.

నిరుద్యోగం, ధరలు: నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగితను విపక్ష ఇండియా కూటమి గట్టిగా లేవనెత్తుతోంది. మరీ ముఖ్యంగా ఉద్యోగ కల్పన లేకపోవడంపై మోదీ ప్రభుత్వాన్ని కడిగేస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థను, ఉద్యోగావకాశాల వృద్ధి గురించి చెబుతూ బీజేపీ దీనికి అడ్డుకట్ట వేస్తోంది.

ఎలక్టోరల్ బాండ్లు ప్రతిపక్షానికి ఆయుధం

సరిగ్గా ఎన్నికల ముంగిట సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బయటపడడం.. అందులో బీజేపీకి అత్యధిక విరాళాలు అందినట్లు తేలడం ప్రతిపక్షాలకు ఓ ఆయుధమే. బాండ్లలో పెద్దఎత్తున అవినీతి జరిగింది.. బీజేపీ ఖాతాలను స్తంభింపజేయాలని, సుప్రీంకోర్టు విచారణ జరపాలని ఇప్పటికే కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ, యూసీసీ: బీజేపీ సుదీర్ఘకాల నినాదాలివి. మోదీ రెండోసారి గెలిచిన వెంటనే.. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేశారు. పాలన చివర్లో ఉండగా పౌరసత్వ సవరణ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి అమలుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. 'మేం చెప్పింది చేశామంటూ'.. కాషాయ పార్టీ చెప్పుకొనేందుకు అవకాశం ఉంది. విపక్షాలు మాత్రం ఈ ప్రయత్నాలను.. సమాజాన్ని వర్గాలు చీల్చేవిగా మండిపడుతున్నాయి.

అయోధ్య రామ మందిరం: ఉత్తరాదిన ఇప్పుడు కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి.. దీనికి ప్రధాన కారణం అయోధ్యలో రామ మందిర నిర్మాణం. విపక్షాల నేతలు కూడా రామ మందిర నిర్మాణం ఉత్తరాదిన బీజేపీకి మైలేజీ ఇచ్చిందని అంగీకరిస్తున్నారు. 'మాకు 370 సీట్లు ఖాయం' అంటూ బీజేపీ ఢంకా బజాయించి చెప్పడానికి వెనుక ఉన్న కారణమిదే.

అమృత్ కాల్ వర్సెస్ అన్యాయ్ కాల్: సుపరిపాలన, వేగవంతమైన వృద్ధి, భవిష్యత్‌పై దార్శనికతను మోదీ పాలనలో సాధించిన విజయాలుగా బీజేపీ చెప్పుకొనే వీలుంటే.. రాజ్యాంగం మీద దాడి, ఆర్థిక అసమానతల సంగతేమంటూ విపక్ష కూటమి ఎండగట్టడం ఖాయంగా కనిపిస్తోంది. మోదీ పదేళ్ల పాలనను అన్యాయ కాలమని కాంగ్రెస్ ఆరోపిస్తే, రాబోయే 25ఏళ్ల అమృతకాలమని దేశాభివృద్ధికి బాటలు వేయాలని బీజేపీ ప్రచారం చేసుకోనుంది.

రైతులు.. మద్దతు ధర: మోదీ రెండో దఫా పాలనలో రెండుసార్లు రైతులు రోడ్డెక్కారు. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా నెలల తరబడి ఢిల్లీ శివారులో ఉంటూ ఉద్యమించారు. మళ్లీ ఇప్పుడు కూడా చలో ఢిల్లీ అంటున్నారు. పీఎం కిసాన్ పథకం రైతులకు చేకూర్చిన మేలును బీజేపీ గుర్తుచేస్తోంది.

సిద్ధాంతాల సమరం: బీజేపీవి మతతత్వ విధానాలని.. సమాజాన్ని చీల్చే ప్రయత్నాలని ఉదాహరణలను చూపుతూ కాంగ్రెస్, ఇతర విపక్షాలు ధ్వజమెత్తే వీలుంది. ప్రతిగా కాంగ్రెస్‌వి బుజ్జగింపు రాజకీయాలని, కుటుంబ పార్టీ పాలన అని, అవినీతికి మారుపేరంటూ బీజేపీ విరుచుకుపడనుంది.

వికసిత్ భారత్.. మరో జుమ్లా: అభివృద్ధి చెందిన దేశంగా(వికసిత భారత్) తీర్చిదిద్దడమే లక్ష్యమని మోదీ చెబుతున్నారు. వందేళ్ల స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకొనే 2047కల్లా ఈ లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అంటున్నారు. అయితే, మోదీ విదేశాల నుంచి నల్ల ధనాన్ని తిరిగి తీసుకురావడంలాగే ఇది మరో అబద్ధం (జుమ్లా) అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

తొలి వంద రోజుల పాలనకు రోడ్ మ్యాప్!

» కొత్త సర్కారు కోసం రూపొందించండి.. మంత్రులకు ప్రధాని ఆదేశం..

న్యూఢిల్లీ, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ గెలుపు ఖాయమని ధీమాతో ఉన్న ప్రధాని మోదీ.. వచ్చే ఐదేళ్ల కొత్త సర్కారు కోసం మొదటి 100 రోజుల పాలనలో అమలు చేసే కార్యక్రమాలకు సంబంధించి ఓ రోడ్ మ్యాప్ రూపొందించాలని కేంద్రమంత్రులను కోరారు. ఆదివారం ఉదయం మోదీ అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వచ్చే ఐదేళ్ల కొత్త ప్రభుత్వం కోసం తొలి వంద రోజుల్లో అమలు చేసే కార్యక్రమాలను ఏవిధంగా మెరుగ్గా అమలుపరచాలన్నది చర్చించారు. దీనిపై కేంద్రమంత్రులు వారి శాఖల కార్యదర్శులు, ఇతర అధికారులను కలవాలని మోదీ సూచించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మరునాడే ఈ సమావేశం జరిగింది. ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ సిఫార్సును రాష్ట్రపతికి పంపడం ద్వారా లోక్‌సభ ఎన్నికల తేదీలను నోటిఫై చేసే ప్రక్రియను కూడా క్యాబినెట్ ప్రారంభించింది.

రేపు సీడబ్ల్యూసీ సమావేశం

» పార్లమెంటు ఎన్నికలకు మేనిఫెస్టో ఖరారు

న్యూఢిల్లీ, మార్చి 17: లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) మంగళవారం సమావేశం కానుంది. ఎన్నికల ముసాయిదా మేనిఫెస్టోపై చర్చించి తుదిరూపు ఇవ్వనుంది. ప్రత్యేకించి ఐదు గ్యారెంటీల పేరిట ఇవ్వనున్న హామీలపై సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకోనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. దీంతోపాటు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) కూడా 19, 20వ తేదీల్లో భేటీ కానుంది. ఇప్పటిదాకా అభ్యర్థులను ప్రకటించని పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనుంది.

ఆ ఒక్కటీ తప్ప..

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలబాండ్లు అందుకున్న పార్టీ అదే. కాంగ్రెస్ పార్టీ అందుకున్న బాండ్ల విలువ రూ.1,334.35 కోట్లు కాగా రూ.1,322 కోట్లతో బీఆర్ఎస్ 4వస్థానంలో ఉంది.

- బిజూ జనతాదళ్ పార్టీకి రూ.944.5 కోట్ల విలువైన విరాళాలు బాండ్ల రూపంలో వచ్చాయి.
- వైసీపీకి వచ్చిన బాండ్ల విలువ రూ.442.8 కోట్లు కాగా.. టీడీపీ రూ.181.35 కోట్ల విలువైన బాండ్లను నగదుగా మార్చుకుంది.
- కర్ణాటకలో జేడీఎస్ పార్టీకి రూ.89.75 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చాయి. అందులో రూ.50 కోట్ల విలువ చేసే బాండ్లు ఒక్క మేఘా ఇంజనీరింగ్ సమర్పించుకున్నవే.
- రూ.1,368 కోట్ల విలువైన బాండ్లతో.. శాంటియాగో మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ కంపెనీ దేశంలో అతిపెద్ద ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలుదారుగా నిలిచింది. ఆ కంపెనీ కొన్న బాండ్లలో 37% డీఎంకే పార్టీకే సమర్పించింది.
- తాము ఎన్నికల బాండ్ల విధానానికి వ్యతిరేకమైనందున ఎలాంటి బాండ్లూ స్వీకరించలేదని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్‌బీ సుప్రీంకోర్టుకు తెలపగా.. తమకు బాండ్ల రూపంలో విరాళాలూ రాలేదని మజ్లిస్, బీఎస్పీ తదితర పార్టీలు తెలిపాయి.

ఆ వివరాలూ చెప్పించండి..

ఎన్నికల బాండ్ల విక్రయాలకు సంబంధించి ఇప్పటిదాకా వెల్లడైంది 76% వివరాలేనని.. మిగతా 24% వివరాలు కూడా వెల్లడించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. 2018 మార్చి 1 నుంచి 2019 ఏప్రిల్ 11 నడుమ రూ.4,002 కోట్ల విలువైన బాండ్లు జారీ అయ్యాయని.. వాటిని కొన్నవారెవరు? ఎవరికి ఇచ్చారో కూడా బయటపెట్టించాలని కోరుతూ సిటిజన్ రైట్స్ ట్రస్ట్ అనే సంస్థ ఈ పిల్ వేసింది. మరోవైపు.. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ 'క్విడ్ ప్రో కో'కు పాల్పడిందని.. నల్లధనాన్ని బాండ్ల రూపంలో పార్టీ ఖాతాలకు మళ్లించడానికి కుట్రపన్నుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ)లోని పలు నిబంధనలను ఉల్లంఘించిన 19 కంపెనీలను కేంద్ర ఆర్థిక శాఖ 2018లో 'హై రిస్క్' కంపెనీలుగా ప్రకటించిందని.. దరిమిలా అవే కంపెనీలు రూ.2,717 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు కొన్నాయని, ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో ప్రకటించిన హైరిస్క్ కంపెనీల్లో వాటిలో 18 కంపెనీల పేర్లు లేవని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ మండిపడ్డారు. కాగా, తమిళపార్టీలు ఎన్నికల బాండ్లు సమర్పించిన దాతల వివరాలను బయటపెట్టాయి. వాటి ప్రకారం.. అన్నా డీఎంకేకు బాండ్లు ఇచ్చిన దాతల్లో ఒకరు చెన్నై సూపర్‌కింగ్స్ యాజమాన్యం కాగా.. మరొకరు అడయార్‌కు చెందిన గోపాల్ శ్రీనివాసన్ అనే వ్యక్తి! ఆ పార్టీకి వచ్చిన రూ.6.05 కోట్లలో గోపాల్ ఇచ్చింది రూ.5 లక్షలే. మిగతా రూ.6 కోట్లూ చెన్నై సూపర్‌కింగ్స్ దాతృత్వమే!! ఇక డీఎంకేకి వచ్చిన రూ.656.5 కోట్లలో రూ.509 కోట్ల విలువ చేసే బాండ్లను ఆ పార్టీకి ఇచ్చింది లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ కావడం గమనార్హం. మేఘా ఇంజనీరింగ్ నుంచి డీఎంకే రూ.105 కోట్లు అందుకుంది.

ప్రజాధనాన్ని దోచుకున్నారు

» సీఎం జగన్, వైసీపీ నేతలపై తులసిరెడ్డి ధ్వజం

విశాఖపట్నం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో ఇష్టం వచ్చినట్లు అప్పులు చేశారని, వీలైనంత వరకు ప్రజా ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో ప్రజలపై విపరీతంగా పన్నుల భారం మోపారని అన్నారు. గత పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీకి చేసి మేలు అంటూ ఏమీ లేదన్నారు. విశాఖ రైల్వే జోన్, విశాఖ-కాకినాడ పెట్రో కారిడార్, పోలవరం ప్రాజెక్టు.. తదితర వాటిని కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదాను గాల్లో కలిపేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు వైసీపీ, జనసేన, టీడీపీ ఎలాంటి ప్రయత్నాలూ చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీల అధినేతలు జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రధాని మోదీ భజనలో మునిగి తేలుతున్నారని ఎద్దేవా చేశారు.

ఈసీ వేట స్టార్ట్!

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కొందరిని సస్పెండ్ చేసి ఇంటికి పంపించగా, మరి కొందరిపై విచారణ సాగిస్తోంది. తాజాగా ఎన్నికల షెడ్యూల్ వచ్చాక, పోలీసు, రెవెన్యూ అధికారులపై వస్తున్న ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. దీంతో అధికారపార్టీతోపాటు, రాజకీయ పక్షాలతో అంటకాగుతున్న అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అధికారపార్టీ సొంత మనుషులుగా ముద్రవేసుకుని వారి నుంచి కోరుకున్న పోస్టింగ్‌లు, ఇతర ప్రయోజనాలు పొందిన వారు ఇప్పుడు ఎన్నికల సమయంలో ఈసీకి భయపడి దూరంగా ఉంటే ఆ పార్టీ ఒప్పుకోదు. అయినా బరితెగించి అధికార పార్టీకి అండగా ఉండాలని ప్రయత్నిస్తే ఈసీ ఊరుకోదు. దీంతో పార్టీ జెండాలు మోసిన కొందరు అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకలా మారింది. ఇప్పటికే తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అక్రమాల కేసుకు సంబంధించి ఓ ఐఏఎస్, మరో ఇద్దరు అధికారులు ఎన్నికల కమిషన్ ఆగ్రహానికి గురయ్యారు. ఆ కేసులో మరింత లోతైన విచారణ సాగుతోంది. ఏ క్షణాన ఏ అధికారిపై వేటు పడనుందోనన్న ఆందోళన ఆ ప్రాంత అధికారుల్లో నెలకొంది.

1 పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో గత శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. అయితే, స్థానిక వైసీపీ నేత లక్ష్మణరావు కూడా కవాతులో పాల్గొన్నారు. ఇది మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు స్థానిక ఎస్ఐ గోవిందరావును వెంటనే వీఆర్‌కు పంపించారు. ఇది ఎన్నికల కమిషన్ ప్రభావమే. ఒక వేళ ఆ ఎస్ఐ విషయంలో జిల్లా యంత్రాంగం సకాలంలో చర్యలు తీసుకోకుంటే ముందు ఉన్నతాధికారులే సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉండేది. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున ఎన్నికల విధులతో సంబంధం ఉన్న పోలీసు, రెవెన్యూ, ఇతర అధికారుల ప్రవర్తనపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని ఈసీ ఇప్పటికే జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

1 శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం డిమిలీ గ్రామ రెవెన్యూ అధికారి కె. రమేశ్ ఏకంగా వైసీపీ కోసం రాజకీయ ప్రచారం చేశారు. దీన్ని మండల తహసీల్దార్ నిర్ధారించారు. వెంటనే వీఆర్వో రమేశ్‌ను సస్పెండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

రెవెన్యూ, పోలీసులపైనే ఫిర్యాదులు

ఎన్నికల విధుల్లో రెవెన్యూ, పోలీసు విభాగాలే కీలకం. ఎన్నికల నిర్వహణలో ఎలక్టోరల్ అధికారులుగా రెవెన్యూ అధికారులు ఉంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో పోలీసుల పాత్ర కీలకం. అందుకే అధికారపార్టీ ఈ రెండు విభాగాల అధికారులపై దృష్టి పెట్టింది. పోలీసు, రెవెన్యూ విభాగాల్లో అస్మదీయులను చేరదీసి వారికి కోరుకున్న చోట పోస్టింగ్‌లు, పదోన్నతులు, ప్రయోజనాలు కల్పించింది. తద్వారా వారిని ఎన్నికల సమయంలో వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ఇలా దొడ్డిదారిలో లబ్ధిపొందిన అధికారులు నిబంధనలు ఉల్లంఘించి మరీ అధికార పార్టీకి సేవ చేస్తున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో ఓట్ల తొలగింపు వంటి అంశాల్లో 42 వేల ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 90 శాతం అడ్డదారిలో లబ్ధి పొందిన రెవెన్యూ అధికారులపైనే ఉన్నాయి. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ కేడర్ అధికారులను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. అయినా, కొందరు అధికారులు ధీమాగా ఉన్నారు. మండల స్థాయిలో వైసీపీ ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

"ఇది జగనన్న రాజ్యం. ఆయనకు మేం వీరభక్తులం. ఆ తర్వాతే అధికారులం. వైసీపీ సేవే ప్రభుత్వ, ప్రజా సేవ. ఇంతకు మించిన భాగ్యం మరొకటి లేదు" అంటూ అధికార పార్టీ వైసీపీతో అంటకాగే అధికారుల గుండెల్లో ఎన్నికల సంఘం రైళ్లు పరిగెట్టిస్తోంది. తామెన్ని తప్పులు చేసినా జగనన్న కాపాడుతారన్న ధీమాతో రెచ్చిపోయి మరీ అరాచకాలకు పాల్పడుతున్న అధికారులు ఇప్పుడు బిక్కుబిక్కుమంటున్నారు.

కఠిన చర్యలు తీసుకోండి: ఈసీ ఆదేశం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలై, కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ అధికారులుగా ఉంటూ రాజకీయ పార్టీలతో అంటకాగే రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులపై నిఘా పెట్టింది. అధికారులపై వచ్చే ఆరోపణలపై సత్వరమే విచారించి చర్యలు తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఫిర్యాదులపై స్పందించకపోతే మీపైనే చర్యలు ఉంటాయని కలెక్టర్లకు సైతం హెచ్చరికలు జారీ చేసింది.

రాజ్యాంగాన్ని మార్చే దమ్ము బీజేపీకి లేదు

» ఆ పార్టీదంతా హడావుడే: రాహుల్

ముంబై, మార్చి 17: బీజేపీదంతా హడావుడేనని.. రాజ్యాంగాన్ని మార్చేంత దమ్ము ఆ పార్టీకి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రజలు, న్యాయం తమవైపే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్నది రెండు పార్టీల మధ్య పోరాటం కాదని, సిద్ధాంతాల సమరమని వ్యాఖ్యానించారు. ఓ వ్యక్తికి అన్నీ తెలిసినట్లుగా చూపుతూ కేంద్రీకృత పాలన సాగించాలనేది బీజేపీ విధానం అయితే, దీనికి పూర్తి భిన్నంగా తమది వికేంద్రీకరణ విధానమన్నారు. ప్రజల గొంతు వినాలని భావిస్తామని తెలిపారు. పార్లమెంటులో తమకు మూడొంతుల మెజారిటీ ఉంటే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ బీజేపీ నేత అనంత్ హెగ్డే చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే రాహుల్ స్పందించారు. మణిపూర్ నుంచి జనవరి 14న చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర 63వ రోజైన శనివారం మహారాష్ట్ర రాజధాని ముంబైలో ముగిసింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారకమైన చైతన్య భూమి వద్ద రాజ్యాంగ పీఠికను పఠించారు. నగరంలో జాతిపిత గాంధీజీ నివసించిన మణి భవన్ నుంచి ఆగస్టు క్రాంతి మైదాన్‌కు ఆదివారం నిర్వహించిన న్యాయ సంకల్ప పాదయాత్రలో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన పాదయాత్రలో.. శివాజీ పార్క్‌లో జరిగిన ఇండియా కూటమి బహిరంగ సభలో రాహుల్ ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. "మోదీ, ఆరెస్సెస్‌లు.. జ్ఞానం ఒక వ్యక్తికే ఉన్నాయని భావిస్తాయి. రైతుల, కార్మికులు, నిరుద్యోగులకు తెలివి లేదనుకుంటాయి. ఐఐటీ డిగ్రీ ఉన్నంతనే ఓ వ్యక్తికి రైతు కంటే ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని భావించలేం" అని వ్యాఖ్యానించారు. ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలు లేకుండా మోదీ ఎన్నికలకు వెళ్లలేరని విమర్శించారు. "56 అంగుళాల ఛాతీ అని చెప్పుకొనే మోదీ ఓ డొల్ల మనిషి. మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని పడగొట్టారు. మహారాష్ట్ర నేత ఏకంగా సోనియాగాంధీ వద్ద కంటతడి పెట్టుకున్నారు. ఈ శక్తులతో పోరాడలేకపోయానని వాపోయారు. మేము వీవీప్యాట్ స్లిప్పులనే లెక్కించాలని ఈసీఐని కోరాం. కానీ, మా వినతిని పట్టించుకోలేదు" అని రాహుల్ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్వేషాలను ఎత్తిచూపేందుకే 'భారత్ జోడో యాత్ర'లను నిర్వహించినట్లు వివరించారు. తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధించి, కేంద్రంలో అధికారాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. "మేము లౌకిక, సమ్మిళిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ అవినీతి బయటపడింది. కమలదళం నాశనం చేసిన భారతదేశ ఆత్మను పరిరక్షించే ప్రయత్నమే రాహుల్‌గాంధీ జోడో యాత్ర" అని పేర్కొన్నారు. తమ కూటమికి 'ఇండియా' అని నామకరణం చేసినప్పటి నుంచి.. బీజేపీ ఆ పదాన్నే ఉచ్ఛరించడం మానేసిందన్నారు. విపక్ష నేతలపై 'అవినీతి' ముద్ర వేయడానికి మోదీ ప్రయత్నిస్తున్నారని, ఎలక్టోరల్ బాండ్లు బీజేపీనే అవినీతి పార్టీ అని నిరూపించాయని, ఆ పార్టీది 'వైట్‌కాలర్' కరప్షన్ అని ఆరోపించారు. ఎన్సీపీ(పవార్ వర్గం) అధినేత శరద్‌పవార్ మాట్లాడుతూ బీజేపీ తప్పుడు హామీలతో ప్రజలను వంచించిందన్నారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. తమ(ఇండియా కూటమి) పోరాటం మోదీపైనో.. అమిత్‌షాపైనో కాదని, 'విద్వేష సిద్ధాంతం'పైనే అని అన్నారు. ప్రజలు ఏకమైతే.. నియంతృత్వం అంతమవుతుందని శివసేన(ఠాక్రేవర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ నాయకురాలు మహబూబా ముఫ్తీ, ఝార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ సతీమణి కల్పన, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక, మహాత్మాగాంధీ ముని మనవడు తుషార్ గాంధీ, అంబేడ్కర్ మనవడు, వంచిత్ బహుజన్ అఘాడీ(వీబీఏ) చీఫ్ ప్రకాశ్ అంబేడ్కర్, ఇండియా కూటమిలోని పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ రాలేదు. అయితే.. ఓ లేఖను తన ప్రతినిధులతో పంపారు. రాహుల్ అరుదైన వ్యక్తి అని, ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఓడిస్తారని అఖిలేశ్ పేర్కొన్నారు.

విభజన హామీలు తుంగలో తొక్కింది మీరు కాదా?

» మోదీ, జగన్‌ది విడదీయరాని స్నేహబంధం: షర్మిల

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విభజన హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే... అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలోకి తొక్కింది ప్రధాని మోదీ కాదా అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ప్రశ్నించారు. ఇటు జగన్‌ను, అటు చంద్రబాబును రెండు పంజరాల్లో పెట్టుకుని ఆడిస్తున్న రింగ్‌మాస్టర్ బీజేపీ అని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. "పదేళ్ల పాటు రాష్ట్ర వినాశనంలో ముఖ్యపాత్ర పోషించి ఇప్పుడు మాపై దాడులుచేస్తారా? కాంగ్రెస్, వైసీపీ ఒకటే అని కూతలు కూస్తారా?" అని మోదీపై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా జగన్‌తో అంటకాగుతూ, వాళ్ల అరాచకాలను అడ్డుకోకపోగా, వారికి అడ్డగోలుగా సహాయ సహకారాలు అందించలేదా అని నిలదీశారు. జగన్‌ను మోదీ దత్తపుత్రుడని అన్నదెవరో ప్రజలకు తెలుసన్నారు. మోదీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకూ సిగ్గువిడిచి జగన్ సపోర్టు చేశారని గుర్తుచేశారు. ప్రధాని మిత్రులు అదానీ, అంబానీలకు రాష్ట్రంలో ఆస్తులు కట్టబెట్టడంతో పాటు రాజ్యసభ స్థానాలు ఇచ్చారని విమర్శించారు. మోదీ, జగన్‌ది విడదీయరాని స్నేహ బంధమని షర్మిల ఎద్దేవా చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



మాట్లాడుతున్న కేశినేని చిన్ని

యాదవులకు టీడీపీతోనే సముచిత స్థానం

● కేశినేని మేనేజింగ్ ట్రస్టీ కేశినేని చిన్ని

పాయకాపురం, మార్చి 17: యాదవులకు సముచిత స్థానం కల్పించింది తెలుగుదేశం పార్టీ అని కేశినేని మేనేజింగ్ ట్రస్టీ కేశినేని చిన్ని అన్నారు. పైపుల రోడ్డు వద్ద గల ఆహ్వాన్ కల్యాణ మండపంలో యాదవ రాజుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు ఆత్మాభిమానం కలవారని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు వరకు యాదవులకు సముచితస్థానం కల్పించారన్నారు. వైఎస్ జగన్ హయాంలో అంతా సొంత బంధువులే మంత్రులుగా ఉన్నారని టీడీపీ హయాంలో యాదవులు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా సముచిత స్థానం దక్కిందన్నారు. బీసీలు, ఎస్సీలపై వైసీపీ హయాంలో దాడులు జరిగాయని ఎక్కడా గౌరవం దక్కలేదని విమర్శించారు. 26వేల మంది బీసీలపై జగన్ అక్రమ కేసులు బనాయించారన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమని చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురానున్నట్టు తెలిపారు. ధర్మ రక్షణకు యాదవులు నడుం బిగించాలని అవినీతిపరుడైన సీఎం జగన్‌ను ఓడించాలన్నారు. నేతలు కొలుసు పార్థసారథిని ఘనంగా సత్కరించారు. నేతలు దాసరి కనకారావు, ఎరుబోతు రమణారావు, గొట్టుముక్కల రఘు, వట్టి వెంకటేశ్వరరావు, చరణ్‌సాయి యాదవ్ పాల్గొన్నారు.

మహేష్‌కు పశ్చిమ టికెట్ ఇవ్వాలి

● పవన్‌కు రాష్ట్ర నగరాల యువజన సంఘం లేఖ

వన్‌టౌన్, మార్చి 17: నగరంలో పశ్చిమ అసెంబ్లీ సీటును పోతిన మహేష్‌కు కేటాయించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర నగరాల యువజన సంఘం తరఫున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతిన రమేష్ లేఖ రాశారు. పోతిన మహేష్ సమసమాజ స్థాపన కోసం నిరంతరం పవన్‌కల్యాణ్‌కు తోడుగా పరితపిస్తున్నారని జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి పవన్‌కల్యాణ్ ఆశయసాధనకు నిరంతరం పోరాట స్ఫూర్తితో పనిచేస్తున్నారన్నారు. పొత్తుల కారణంగా సీటు కేటాయించలేని ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నప్పటికీ పోతిన మహేష్ సేవలను పరిగణనలోకి తీసుకుని సీటు కేటాయించాలన్నారు. త్రికరణశుద్ధిగా పనిచేస్తున్న మహేష్‌ను రాష్ట్ర నేతగా పరిగణించాలని కోరారు. రాష్ట్ర నగరాల యువజన సంఘం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, నగర కమిటీలు మహేష్‌కు మద్దతు పలుకుతున్నాయన్నారు.

పీఎంకు మహేశ్ స్వాగతం



చిలకలూరిపేటలో బీజేపీ-టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు హాజరయ్యేందుకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం చెప్పేందుకు అవకాశమిచ్చిన జనసేనాధిపతి పవన్‌కల్యాణ్‌కు పార్టీ అధికార ప్రతినిధి పోతిన మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో ఆదివారం విచ్చేసిన ప్రధానికి స్వాగతం చెప్పిన బృందంలో మహేష్ పాల్గొన్నారు.



ఆకునూరు పాతప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం గురించి తెలుసుకుంటున్న బోడె ప్రసాద్

అగ్నిప్రమాద ప్లాస్టిక్ గోదాము బోడె ప్రసాద్ పరిశీలన

ఆకునూరు (ఉయ్యూరు), మార్చి 17: ఆకునూరులో పాత ప్లాస్టిక్ గోదాము అగ్నిప్రమాదంపై తెలుగుదేశం పార్టీ నేత బోడె ప్రసాద్ ఆరాతీశారు. ఆదివారం సాయంత్రం ప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం సంభవించి రాత్రి 10 గంటల వరకు మంటలు ఎగసి పడుతున్న సమాచారం తెలుసుకున్న ఆయన సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలను స్థానికులను అడిగి తెలుసుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బందితో మాట్లాడి మంటలు పొరుగున ఉన్న ఇళ్లకు అంటకుండా చూడాలని కోరారు. గోదాము పక్కన నివాసముం టున్న వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. టీడీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, బోడె వెంకట్‌రామ్ ప్రమాద సంఘటన స్థలాన్ని సందర్శించారు.



మణిపూర్‌తో ఆడుతున్న ఆంధ్రప్రదేశ్ జట్టు

జాతీయ జూనియర్ కబడ్డీలో ఏపీ సత్తా

● ఆడిన రెండు మ్యాచ్‌ల్లో విజేతగా నిలిచిన వైనం

విజయవాడ స్పోర్ట్సు, మార్చి 17: బీహార్ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 33వ నేషనల్ సబ్ జూనియర్ పురుషుల కబడ్డీ లీగ్ పోటీల్లో రాష్ట్ర జట్టు ఆదివారం ఆడిన రెండు మ్యాచ్‌ల్లో విజేతగా అవతరించి హెచ్ పూల్‌లో ప్రథమ స్థానం దక్కించుకుంది. మణిపూర్‌పై 29 భారీ పాయింట్లతో విజయం సాధించగా, రాత్రి జరిగిన మూడో మ్యాచ్‌లో జార్కండ్‌పై 49-16 పాయింట్లతో ఏపీ జయకేతనం ఎగురవేసింది. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

● మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 17: సత్రాలకు, పేదలకు ఆర్యవైశ్యులు చేస్తున్న సేవలు అభినం దనీయమని మాజీ మంత్రి, ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గోల్డ్ కన్వెక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘ స్వర్ణోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, టీజీ వెంకటేష్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సన్నిధి నాగసాయి శ్రీనివాస్, పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు చక్కా చెన్నకేశవరావు, జి.వి.గున్నయ్యశెట్టి, పెనుగొండ సుబ్బారాయుడు, మోటమర్రి బాబాప్రసాద్, రామ చంద్రరావు, మద్దుల గిరీష్ కుమార్, తాడేపల్లి మెహర్‌బాబా, రజని, పరిశ వాణిశ్రీ, మల్లికార్జున గుప్తా, పద్మనాభుని శేఖర్, యెండూరు సురేష్, పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, దింటకుర్తి సుధాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గగుడిలో సూర్య ఆరాధన, అరుణపారాయణ

దుర్గగుడిలో అరుణ పారాయణ

వన్‌టౌన్, మార్చి 17: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారాన్ని పురస్కరించుకుని అర్చకులు, వేదపండితులు అరుణపారాయణ, సూర్యనమస్కారాలు వంటి విశేష కార్యక్రమాలను నిర్వహించారు. లోకక్షేమం, సర్వజనారోగ్యం కోరుతూ సంకల్పం చెప్పి సూర్యనమస్కారాలు, ఆదిత్యుని పూజ నిర్వహించారు. ఆదివారం దుర్గమ్మను దర్శించుకునడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రద్దీ దృష్ట్యా భక్తులకు అమ్మవారి శీఘ్ర దర్శనం కోసం అధికారులు క్యూలను నియంత్రించారు. పలువురు భక్తులు తమ కోరిక మేరకు నిత్యార్జిత సేవల్లో పాల్గొన్నారు.



క్యూలైన్లలో భక్తులు

సార్వత్రిక విద్యాపీఠి పరీక్షలు నేటినుంచి

వన్‌టౌన్, మార్చి 17: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో సోమవారం నుంచి టెన్త్, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. 10వ తరగతికి సంబంధించి 18న తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, 19న హిందీ, 20న ఇంగ్లీష్, 22న గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం, 23న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞాన శాస్త్రం, 26న సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, 27న బిజినెస్ స్టడీస్, మనోవిజ్ఞాన శాస్త్రం సబ్జెక్టులపై పరీక్షలు జరుగుతాయి. ఇంటర్‌కు సంబంధించి 18న హిందీ, తెలుగు, ఉర్దూ, 19న జీవశాస్త్రం, వాణిజ్యం, వ్యాపార శాస్త్రం, గృహవిజ్ఞాన శాస్త్రం, 20న ఇంగ్లీష్, 22న గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం, 23న భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌర శాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, 26న రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకు జరుగుతాయి. సెలవు దినాలున్నప్పటికీ టైం టేబుల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని సంచాలకుడు కే నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాల్ టికెట్లలో నిర్దేశించిన పరీక్షలు కాకుండా వేరే పరీక్షలు రాసినట్టయితే ఆ పరీక్షను రద్దు చేస్తామన్నారు. సరైన ప్రశ్నాపత్రం పొందిన తరువాతే విద్యార్థులు పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థికి కేటాయించిన పరీక్షా కేంద్రం కాకుండా వేరే పరీక్ష కేంద్రంలో పాల్గొన్నట్టయితే ఆ పరీక్షను రద్దు చేస్తామన్నారు. 10వ తరగతికి సంబంధించి జిల్లాలో నందిగామ, నారాయణ ఆంగ్లో వేదిక స్కూల్, రైతుపేటలోని రవీంద్రభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, జగ్గయ్యపేటలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, వత్సవాయిలో వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, తిరువూరులో బాష్యం హైస్కూల్, విజ్ఞాన్ హైస్కూల్, గంపలగూడెంలో లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, శ్రీ చైతన్య హైస్కూల్, సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇంటర్‌కు సంబంధించి నగరంలో కొత్తపేటలోని ఎన్‌టీఆర్ హైస్కూల్, గొల్లపూడిలోని ఇండియన్ స్ప్రింగ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, భవానీపురంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, కృష్ణలంకలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, పాయకాపురంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీతో పాటు జిల్లాలోని మరో 12 ప్రాంతాలు నందిగామ, జగ్గయ్యపేట, వత్సవాయి, తిరువూరు, గంపలగూడెంలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. కాగా 10వ తరగతిలో 1785 మంది, ఇంటర్‌లో 3,710 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు జరుగుతాయి.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించిన పోలీసులు, ప్రత్యేక పోలీసు దళాలు

భవానీపురంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

విద్యాధరపురం, మార్చి 17: పోలీసు కమిషనర్ కాంతిరాణా ఆదేశాలతో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడడంతో పాటు, శాంతి భద్రతలకు, ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు భరోసా కల్పిస్తూ భవానీపురం పోలీసుల పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే క్రమంలో ముందస్తు చర్యల్లో భాగంగా పారా మిలటరీ, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. డీసీపీ హరికృష్ణ, వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, వెస్ట్ డివిజన్ సీఐలు సిబ్బంది పాల్గొన్నారు.











పరుగో.. పరుగు

నగరంలో గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం 10గంటల సమయంలో నగరంలోని ఆయా పరీక్ష కేంద్రాలు అభ్యర్థులతో కిక్కిరిసిపోయాయి. నిర్ణీత సమయంలోపే పరీక్ష కేంద్రంలోకి అడుగు పెట్టాలనే తాపత్రయంలో అభ్యర్థులు పరుగులు పెడుతూ కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది వారిని తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.











ఇంటి స్థలాలు ఇస్తేనే ఓట్లడిగేందుకు రండి

▸▸ నత్తగుల్లపాడులో గ్రామస్థుల ఫ్లెక్సీ

కైకలూరు, మార్చి 17: 'ఇళ్ల స్థలాలు ఇస్తేనే ఓట్లు అడగడానికి గ్రామానికి రండి' అంటూ ఏలూరు జిల్లా కైకలూరు మండలం నత్తగుల్లపాడులో గ్రామస్థులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామంలో 42 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ రెండెకరాల భూమిని సగ భాగం పూడిక చేశారు. పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పిన అధికారులు, ప్రజాప్రతినిధులు నేటికీ పట్టాలు ఇవ్వలేదు. ప్రభుత్వం పంపిణీ చేసిన కరపత్రాల్లో 42 మందికి పట్టాలు ఇచ్చినట్టు, స్థలానికి రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు నిధులు ఇచ్చినట్టు పేర్కొన్నారని, పట్టాలే ఇవ్వకుండా రూ.2.50 లక్షల ఇచ్చినట్లు ఎలా ముద్రించారని ప్రశ్నిస్తున్నారు. 'ఎవరైతే మాకు ఇళ్ల స్థలాలు ఇస్తారో వారికే ఓటడిగే హక్కు ఉంటుంది. లేకుంటే మా గ్రామానికి రావద్దు' అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీని వీఆర్వో తొలగించారు. మళ్లీ ఫ్లెక్సీని ఏర్పాటుచేస్తే 42 మందిపై కేసు నమోదు చేస్తామని వీఆర్వో హెచ్చరించినట్టు లబ్ధిదారులు చెప్పారు.

ట్రాఫిక్‌కు అడ్డంగా దుకాణాలు

వన్‌టౌన్, మార్చి 17: స్థానిక కొత్తపేట వేణుగోపాలస్వామి గుడివద్ద చెరుకురసం బండి, బడ్డీకొట్టు ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్నాయని స్థానికుడు ఒకరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గుడికి అనుసంధానంగా అనధికారికంగా షాపులు నిర్మించారని, ప్రహరీ గోడకు అనుకుని ఉన్న చెరుకురసం బండి, బడ్డీకొట్లకు అనధికారికంగా గుడి నుంచి విద్యుత్ వినియోగిస్తున్నారన్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని చర్యలు తీసుకోవాలన్నారు.



కర్నూలు మెడికల్ కాలేజీ హాస్టల్ గోడపై సిద్ధం ఫ్లెక్సీ

ఎక్కడి ఫ్లెక్సీలు అక్కడే..!

కర్నూలు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఆదివారం సాయంత్రం 3 గంటల్లోగా తొలగించాలని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఆదేశాలు జారీచేశారు. అయితే కర్నూలు జిల్లాలో ఆదివారం రాత్రి 7 గంటల తర్వాత కూడా జగన్ ఫ్లెక్సీలు కనిపించాయి. శ్రీకృష్ణదేవరాయుల సర్కిల్, రాజ్‌విహార్ సర్కిల్, మెడికల్ కాలేజీ హాస్టల్ గోడలపై 'సిద్ధం' ఫ్లెక్సీలు అలాగే ఉన్నాయి.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఆర్‌జేసీ

మోపిదేవి, మార్చి 17: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయ ధర్మాదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చక బృందం వారిని శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకుడు బొప్పన స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



రోడ్డును మూసేసి ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న కేతిరెడ్డి

నడిరోడ్డుపై.. వైసీపీ సభ

ధర్మవరం, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా.. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి రోడ్డును బంద్ చేసి మరీ ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. లక్ష్మీచెన్నకేశవపురం వైజంక్షన్‌లో రోడ్డును బంద్ చేసి, వైసీపీలోకి చేరికల కార్యక్రమం నిర్వహించారు. రోడ్డును బంద్ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఆర్డీఓ వెంకటశివారెడ్డిని అడగ్గా.. సభకు అనుమతి తీసుకున్నారన్నారు.

ఎల్లుండి నుంచి శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం పుష్కరిణిలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మార్చి 20, 21 తేదీల్లో సహస్ర దీపాలంకారసేవ, 22, 23, 24 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

నామినికి మాండలిక బ్రహ్మ బిరుదు ప్రదానం



సుబ్రహ్మణ్యంనాయుడుకు సన్మానపత్రం అందజేస్తున్న అరుణకుమారి

తిరుపతి (కల్చరల్), మార్చి 17: తిరుపతి జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత, విశ్రాంత పాత్రికేయుడు నామిని సుబ్రహ్మణ్యంనాయుడుకు మాండలిక బ్రహ్మ అనే బిరుదును రాజన్న ఫౌండేషన్ ప్రదానం చేసింది. తిరుపతి సమీపంలోని కరకంబాడివద్ద ఉన్న అమరరాజా సంస్థ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి శ్వేత సంచాలకుడు భూమన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి, డాక్టర్ గౌరినేని రమాదేవి నామిని చేతికి స్వర్ణకంకణం తొడిగి, సన్మానపత్రం అందజేశారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

పోలవరం, మార్చి 17: ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన తెలగంశెట్టి గోపి (38) నాలుగు ఎకరాల భూమి కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సాగులో నష్టం వచ్చి సుమారు రూ.5 లక్షల అప్పు చేశాడు. ఈ క్రమంలో ఈ నెల 8న పురుగుమందు తాగాడు. కాకినాడ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గోపి ఆదివారం ఉదయం మృతి చెందాడు.



విమానాల ల్యాండింగ్ కోసం సిద్ధం చేసిన రన్‌వే

నేడు అత్యవసర రన్‌వే ప్రారంభం

» కొరిశపాడు-రేణంగివరం మధ్య హైవేపై దిగనున్న విమానాలు

మేదరమెట్ల, మార్చి 17: ప్రకృతి విపత్తులు, యుద్ధం వంటి అత్యవసర సమయాల్లో ఉపయోగపడేలా బాపట్ల జిల్లా కొరిశపాడు-రేణంగివరం మధ్య జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ రన్‌వే ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ రన్‌వేపై సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విమానాలు దిగుతాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. దీని కోసం ఎయిర్‌ఫోర్స్, హైవే అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తిచేశారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై 13 అత్యవసర రన్‌వేల నిర్మాణంలో భాగంగా కొరిశపాడు-రేణంగివరం మధ్య 4.1 కిలోమీటర్ల పొడవున రూ.79 కోట్ల వ్యయంతో అత్యవసర రన్‌వేను ఏర్పాటు చేశారు. దీని ప్రారంభోత్సవం నేపథ్యంలో జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను తొలగించడంతో పాటు రన్‌వేకి రెండువైపులా శుభ్రం చేశారు. విమానాలు దిగే సమయంలో ప్రజలు, పశువులు రోడ్డు మీదకు రాకుండా రన్‌వేకి రెండువైపులా భారీ గేట్లు ఏర్పాటు చేశారు. విమానాలు దిగడానికి అవసరమైన మొబైల్ రాడార్, మొబైల్ సిగ్నల్ వాహనాలతోపాటు అగ్నిమాపక యంత్రాన్ని కూడా అందుబాటులో ఉంచారు. జాతీయ రహదారికి పడమరవైపున అధికారులు, అతిథులు కూర్చోవడానికి ఏర్పాట్లు చేశారు. ఎయిర్‌ఫోర్స్, హైవే అధికారులు ఇక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కేజ్రీవాల్‌కు మళ్లీ ఈడీ సమన్లు



న్యూఢిల్లీ, మార్చి 17: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదివారం మళ్లీ సమన్లు ఇచ్చింది. ఈసారి రెండు వేరువేరు కేసుల్లో వరుసగా రెండు సమన్లు ఇవ్వడం గమనార్హం. పాత కేసు అయిన ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో తొమ్మిదోసారి సమన్లు ఇచ్చింది. దాంతో పాటుగా కొత్త కేసు అయిన ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ) అంశంపై మరో సమన్లు ఇచ్చింది. జల్ బోర్డు కేసులో సోమవారమే విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మద్యం విధానం కేసులో ఈ నెల 21 (గురువారం)న రావాలని పేర్కొంది. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిషి స్పందిస్తూ జల్ బోర్డు కేసు ఏమిటో ఎవరికీ తెలియదని అన్నారు. ఏదోరకంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా చూడడమే వీటి ఉద్దేశమని ఆమె ఆరోపించారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఎనిమిదిసార్లు ఈడీ సమన్లు ఇవ్వగా వాటన్నింటినీ కేజ్రీవాల్ బేఖాతరు చేశారు. ప్రతిసారీ సమన్లను తిరస్కరిస్తుండడంతో అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం (పీఎల్ఎంఏ)లోని సెక్షన్ 50 ప్రకారం ఆయనను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ ఈడీ స్థానిక కోర్టును ఆశ్రయించింది. 4 నుంచి 8 నెంబర్ల సమన్లను స్వీకరించకపోవడానికి సంబంధించి దాఖలైన కేసును పరిశీలించిన అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు దివ్య మల్హోత్రా.. ఇది బెయిల్ ఇవ్వదగ్గ నేరంగా పరిగణించారు. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేశారు. కేసుకు సంబంధించిన పత్రాలన్నింటినీ ఆయనకు అందజేయాలని ఈడీని ఆదేశించారు. అంతకుముందు ఈడీ సమన్లపై కేజ్రీవాల్ స్పందిస్తూ ఒక్కో సమనుకు ఒక్కో పాఠశాలను నిర్మిస్తామని వ్యాఖ్యానించారు. తనను జైలుకు పంపించి ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ వాడుకుంటోందని ఆరోపించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో భూపేష్ బఘేల్‌పై కేసు

రాయ్‌పూర్, మార్చి 17: మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌పై రాష్ట్ర ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) కేసు నమోదు చేసినట్టు ఆదివారం అధికార వర్గాలు తెలిపాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఏడాదికిపైగా దర్యాప్తు జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా కేసు పెట్టినట్టు తెలిపాయి. అయనతో పాటుగా మహదేవ్ యాప్ ప్రమోటర్లయిన రవి ఉప్పల్, సౌరభ్ చంద్రాకర్, శుభం సోని, అనిల్ కుమార్ అగర్వాల్ మరో 14 మందిపై కూడా కేసులు నమోదు చేసింది. వీరు కాకుండా పేర్లు ప్రస్తావించకుండా కొందరు ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, ఆఫీసర్స్ ఆన్ స్పెషల్ డ్యూటీ, కొందరు ప్రయివేటు వ్యక్తులు నిందితులుగా ఉన్నారని ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించింది. అక్రమ మార్గాల్లో బెట్టింగ్ యాప్ నిర్వహించడం ద్వారా రూ.6,000 కోట్ల మేర నేరపూరిత సొమ్ము చలామణి అయినట్టు పేర్కొంది. యాప్ ప్రమోటర్లలో ఇద్దరు ప్రధాన వ్యక్తులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని, వారికి రాష్ట్రానికి చెందిన కొందరు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు సహకరించారని ఆరోపించింది. మహదేవ్ బుక్ యాప్ ప్రమోటర్లయిన రవి ఉప్పల్, చంద్రాకర్, సోని, అగర్వాల్‌లు వాట్సప్, ఫేస్‌బుక్, టెలిగ్రాం, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా దుబాయ్ కేంద్రంగా లైవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫారంలు నిర్వహించారు. వచ్చిన ఆదాయంలో 70-80 శాతాన్ని తీసుకొని మిగిలిన మొత్తాన్ని కమీషన్ల రూపంలో ఆపరేటర్లు, బ్రోకర్లకు పంచారు. 2020లో విధించిన కరోనా లాక్‌డౌన్ సమయంలో దీన్ని ప్రారంభించి నెలకు రూ.450 కోట్ల వరకు గడించినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఈ కేసులో ఈడీ ఇంతవరకు తొమ్మిది మందిని అరెస్టు చేయగా, రాయ్‌పూర్ కోర్టులో రెండు ఛార్జిషీట్లు సమర్పించింది.

సర్‌కార్యవాహ్‌గా దత్తాత్రేయ హోసబలే



నాగ్‌పూర్, మార్చి 17: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)కు సర్‌కార్యవాహ్‌గా (ప్రధాన కార్యదర్శి) మరోసారి దత్తాత్రేయ హోసబలే ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు నాగ్‌పూర్ ప్రధాన కార్యాలయంలో 'అఖిల భారతీయ ప్రతినిధి సభ' వార్షిక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో కర్ణాటకకు చెందిన హోసబలేను మరోసారి సర్‌కార్యవాహ్‌గా ఎన్నుకున్నట్లు ఆర్ఎస్ఎస్ 'ఎక్స్' వేదికగా ఆదివారం ప్రకటించింది. హోసబలే మొదటి సారి 2021లో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. తాజా ఎన్నికతో ఆయన 2027 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2021 ముందు భయ్యాజీ జోషి సర్‌కార్యవాహ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

అంబానీ ఇంటి పెళ్లి వేడుకల్లో దోపిడీకి పథకం

» తిరుచ్చికి చెందిన ఐదుగురు దొంగల అరెస్టు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త అంబానీ కుమారుడి పెళ్లి వేడుకల్లో దోపిడీకి పథకం రూపొందించిన తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ఐదుగురు దోపిడీ దొంగలను గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల రాజ్‌కోట్, జామ్‌నగర్‌లో పార్కింగ్ చేసిన లగ్జరీ కార్లలో నగదు, లాప్‌టాప్‌లు తదితర విలువైన వస్తువులు దోపిడీకి గురయ్యాయి. ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో రికార్డైన వీడియో దృశ్యాల ఆధారంగా ఆ దోపిడీలకు పాల్పడిన తిరుచ్చికి చెందిన జగన్, దీపక్, గుణశేఖర్, మురళి, ఏకాంబరం అనే ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా ఈ ఐదుగురూ.. అంబానీ కుమారుడి పెళ్లి వేడుకల్లో దోపిడీకి ప్రణాళిక రూపొందించారని కనుగొన్నారు. ఈ దోపిడీ ముఠా నాయకుడు మధుసూదన్ ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

అరుణాచల్ చైనాలో అంతర్భాగమే

» ఆ దేశ మిలటరీ ప్రకటన

బీజింగ్, మార్చి 17: అరుణాచల్‌ప్రదేశ్ చైనాలో అంతర్భాగమని ఆ దేశ మిలటరీ ప్రకటించింది. అరుణాచల్ ప్రదేశ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించి సేలా సొరంగాన్ని ప్రారంభించడంపై అభ్యంతరం చెబుతూ అధికారిక వెబ్‌సైట్‌లో సమాచారాన్ని పోస్టు చేసింది. సిజాంగ్ (టిబెట్‌కు చైనా పేరు) దక్షిణ భాగమైన ఈ ప్రాంతం చైనాలో అంతర్భాగంగానే ఉందని రక్షణ శాఖ అధికార ప్రతినిధి కర్నల్ ఝాంగ్ సియోగాంగ్ పేర్కొన్నారు. దాన్నే అరుణాచల్ ప్రదేశ్ అని భారత్ అక్రమంగా చెప్పుకొంటోందని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్‌గా పిలుచుకొంటున్న చైనా.. ఆ రాష్ట్రానికి ఏ భారత నాయకుడు వచ్చినా అభ్యంతరం చెబుతోంది. దీన్ని జాంగ్నాన్‌గా వ్యవహరిస్తోంది. భారత్ కూడా ఈ వైఖరిని తప్పుపడుతోంది. వాస్తవంలో ఎన్నడూ లేని పేర్లను చైనా ఆ ప్రాంతానికి పెడుతోందని విమర్శిస్తోంది.

పోలవరాన్ని దోచేశారు!



» కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు స్వాహా
» వేల కోట్లు దారి మళ్లించిన జగన్ సర్కారు
» ఐదేళ్లలో కేంద్రం ఇచ్చింది రూ.8,240 కోట్లు
» రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది 5,825 కోట్లు
» అవసరాలకు మళ్లించింది 2,415 కోట్లు
» 984 కోట్ల బిల్లులు తిరస్కరించిన పీపీఏ

అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిధులను జగన్ సర్కారు కొల్లగొట్టింది. కేంద్ర నుంచి విడుదల అయిన వేల కోట్ల రూపాయలను యథేచ్ఛగా సొంత అవసరాలకు మళ్లించుకుంది. పైగా ప్రాజెక్టును కట్టలేకపోవడానికి కేంద్రం నిధులు ఇవ్వకపోవడమే కారణమని వైసీపీ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. వాస్తవం ఏమిటంటే జగన్ సీఎం అయిన నాటి నుంచి గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం రూ.8,240 కోట్లు విడుదల చేసింది. ఇందులో జగన్ ప్రభుత్వం ఖర్చుపెట్టింది కేవలం రూ.5,825 కోట్లు మాత్రమే. మిగిలిన రూ.2,415 కోట్లను ప్రభుత్వ సొంత అవసరాలకు దారి మళ్ళించారు. కేంద్రం నుంచి నిధులు వచ్చే ఏ కార్యక్రమానికైనా ముందుగా ఇచ్చిన మొత్తాన్ని సక్రమంగా వినియోగిస్తేనే తదుపరి విడత మంజూరు చేస్తారు. లేకుంటే అంతటితో నిధులు ఇవ్వడం ఆపేస్తారు. పోలవరం విషయంలో కూడా సరిగ్గా అదే జరిగింది. నిధులను వ్యయం చేసే విషయంలో నిబంధనలు పాటించకపోవడంతో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఏకంగా రూ.984 కోట్ల బిల్లులను తిరస్కరించింది. ఇందులో హెడ్‌వర్క్‌కు సంబంధించినవి రూ.314కోట్లు, ఎల్ఎంసీ- రూ.329 కోట్లు, ఆర్ఎంసీ- రూ.190 కోట్లు, భూసేకరణకు రూ.49కోట్లు, ఇతరాలు దాదాపు రూ.100కోట్ల వరకూ ఉన్నాయి. ఇవికాకుండా మరో రూ.339కోట్ల బిల్లులు పీపీఏ పరిశీలనలో ఉన్నాయి. పోలవరం కోసం రాష్ట్ర ఖజానా నుంచి పైసా ఖర్చు పెట్టడం చేతకాలేదు కనీసం కేంద్రం ఇచ్చిన నిధులైనా పూర్తిగా దీనికోసం వ్యయం చేయలేకపోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా రాకముందు రూ.4,730 కోట్లు, జాతీయ హోదా వచ్చాక రూ.16,653 కోట్లు మొత్తం కలిపి రూ.21,384 కోట్లు ఖర్చు చేశారు. జాతీయ ప్రాజెక్టు హోదా వచ్చాక పోలవరం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసిన నిధుల్లో ఇప్పటి వరకు కేంద్రం రూ.15,146 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి రీయింబర్స్ చేసింది. ఇంకా కేంద్రం నుంచి రావాల్సింది రూ.1,507కోట్లు. కేంద్రానికి పీపీఏ సిఫారసు చేసిన మొత్తం రూ.205 కోట్లు.

పనుల పురోగతి ఇలా...

పోలవరం ప్రాజెక్టులో హెడ్‌వర్క్సులు 70.38%, ఎల్ఎంసీ పనులు 72.71%, ఆర్ఎంసీ పనులు 92.75% పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మొత్తం ప్రాజెక్టు 74.22% పూర్తయింది. భూసేకరణ, పునరావాస పనులు 22.36% పూర్తయ్యాయి. ప్రాజెక్టు పనులు, పునరావాసం కలిపి మొత్తం 49.55% మేర పోలవరం పూర్తయింది.

పోలవరానికి ఐదేళ్లలో కేంద్రం ఇచ్చిన నిధులు, జగన్ సర్కారు చేసిన ఖర్చు వివరాలు...

సంవత్సరం	కేంద్రం ఇచ్చింది	రాష్ట్రం చేసిన ఖర్చు
2019-20	రూ.1,780 కోట్లు	రూ.879 కోట్లు
2020-21	రూ.2,234 కోట్లు	రూ.1,212 కోట్లు
2021-22	రూ.1,876 కోట్లు	రూ.2,635 కోట్లు
2022-23	రూ.1,671 కోట్లు	రూ.906 కోట్లు
2023-24	రూ.679 కోట్లు	రూ.193 కోట్లు
మొత్తం	రూ.8,240 కోట్లు	రూ.5,825 కోట్లు

హాస్టల్‌లో నమాజ్ చేసినందుకు విదేశీ విద్యార్థులపై దాడి

» గుజరాత్ యూనివర్సిటీలో ఘటన.. ఇద్దరి అరెస్ట్

అహ్మదాబాద్, మార్చి 17: అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీ హాస్టల్‌లో నమాజ్ చేసినందుకు పలు దేశాలకు చెందిన విద్యార్థులపై కొంత మంది వ్యక్తులు దాడి చేసినట్టు ఆదివారం పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ఏ-బ్లాక్ హాస్టల్‌లో జరిగిన ఘటనలో గాయపడిన శ్రీలంక, తజకిస్థాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులను ఆస్పత్రిలో చేర్పినట్టు చెప్పారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసినట్టు అహ్మదాబాద్ పోలీసులు తెలిపారు. గుజరాత్ యూనివర్సిటీలో చదువుతున్న ఐదుగురు విదేశీ విద్యార్థులు నమాజ్ చేస్తుండగా దాడి ఘటన జరిగింది. వీరు ఉజ్బెకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, తజకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంకకు చెందిన వారు. ఈ ఘటనలో 20-25 మందిపై ఎఫ్ఐఆర్‌ను రిజిస్టర్ చేశామని, ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టడానికి తొమ్మిది టీమ్‌లను ఏర్పాటు చేసినట్టు పోలీస్ కమిషనర్ జీఎస్ మాలిక్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో హోం శాఖ సహాయమంత్రి హర్ష్ సంఘవి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ వ్యవహారంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం రాత్రి 10.50 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుందని, ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే గుజరాత్ యూనివర్సిటీ హాస్టల్ ప్రాంగణంలోకి దాదాపు రెండు డజన్ల మంది ప్రవేశించి విదేశీ విద్యార్థులు నమాజ్ చేస్తుంటే అభ్యంతరం వ్యక్తం చేశారని, మసీదులో నమాజ్ చేసుకోవాలన్నారని మాలిక్ తెలిపారు. దీనిపై వాదనకు దిగడమేకాకుండా వారిపై దాడి చేయడంతోపాటు రాళ్లు రువ్వారన్నారు. హాస్టల్ గదులను ధ్వంసం చేశారని చెప్పారు. ఈ ఘటనలో శ్రీలంక, తజకిస్థాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థు లు ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. ఈ ఘటనతో సంబం ధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాళ్లు రువ్వుతున్న వీడియోలు బయటకు వచ్చాయని చెప్పారు.

సీఏఏ నిబంధనలపై స్టే ఇవ్వండి

» సుప్రీంకోర్టులో కేరళ పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 17: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నిబంధనలు అమలు కాకుండా స్టే ఇవ్వాలని కోరుతూ కేరళ ప్రభుత్వం తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నిబంధనలు వివక్షపూరితం, ఏకపక్షం, లౌకికవాద సిద్ధాంతాలకు వ్యతిరేకమని పేర్కొంది. 2014 డిసెంబరు 31కి పూర్వం ఎలాంటి పత్రాలు లేకుండా పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు త్వరితగతిన భారత పౌరసత్వం ఇవ్వడమే ఈ నిబంధనల ఉద్దేశం. 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం 2024లో నిబంధనలు రూపొందించిందని, అందువల్ల వీటి అమలు అత్యవసరమేమీ కాదని భావిస్తోందని కేరళ సర్కారు తన పిటిషన్‌లో తెలిపింది. ఈ కారణంగా స్టే మంజూరు చేయాలని కోరింది. మతం, దేశాన్ని ఆధారం చేసుకొని నిబంధనలు రూపొందించడం వివక్షాపూరితమని వ్యాఖ్యానించింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) చెల్లుబాటును సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం అంతకుముందే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అంతర్జాతీయ సరిహద్దులు ఉన్న శ్రీలంక, మయన్మార్, భూటాన్ నుంచి వచ్చిన వలసదార్లకు ఇలాంటి సౌకర్యాలు కల్పించకపోవడాన్ని ప్రశ్నించింది. తాజాగా ఈ చట్టంలోని నిబంధనలు అమలు కాకుండా స్టే ఇవ్వాలని కోరింది. పౌరసత్వ సవరణ చట్టంపై దాఖలైన కేసులు తేలకుండా ఈ నిబంధనలను అమలు చేయకూడదని కోరుతూ ఇదివరకే మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. ఇవన్నీ ఈ నెల 19న ధర్మాసనం పరిశీలనకు రానున్నాయి.

కవితను విచారించిన ఈడీ

» స్పష్టత రావాల్సిన అంశాలపై ఆరా
» ఢిల్లీ మద్యం విధాన రూపకల్పనలో ఆమె పాత్ర... ముడుపులపై ప్రశ్నలు
» కవితతో ఆమె భర్త అనిల్, కేటీఆర్, హరీశ్ భేటీ



ఈడీ కార్యాలయం వద్ద కవిత భర్త అనిల్



న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితురాలిగా ఉన్న కవితను ఏడు రోజుల కస్టడీకి తీసుకున్న ఈడీ.. దర్యాప్తులో భాగంగా తొలి రోజు ఆమెను సుదీర్ఘంగా విచారించింది. ఆదివారం ఉదయం పదిగంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. ఈడీ డిప్యూటీ డైరక్టర్ భానుప్రియ మీనా నేతృత్వంలో అధికారులు ఈ విచారణ జరిపారు. మద్యం కుంభకోణానికి సంబంధించి స్పష్టత రావాల్సిన అంశాలపై ఆమె నుంచి సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇతరులు ఇచ్చిన వాంగ్మూలాలపై కవితను వివరణ కోరినట్లు సమాచారం. అలాగే.. ముడుపులు ఎలా చేతులు మారాయన్న అంశంతో పాటు ఢిల్లీ మద్యం విధానం రూపకల్పనలో ఆమె పాత్రపై ఈడీ ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. కవిత వాంగుల్మాన్ని ఈడీ అధికారులు రికార్డు చేశారు. కాగా.. కస్టడీలో కవితను రోజూ కుటుంబసభ్యులు కలిసేందుకు కోర్టు అనుమతించడంతో ఆమె భర్త అనిల్ కుమార్, కేటీఆర్, హరీశ్‌రావు ఆదివారం సాయంత్రం ఈడీ కార్యాలయం వద్దకు వచ్చారు. వారి వెంట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు ఉన్నారు. అయితే అధికారులు అనిల్, కేటీఆర్, హరీశ్‌ను మాత్రమే లోనికి అనుమతించారు. వారు కవితతో గంటన్నరకు పైగా భేటీ అయ్యారు. అధికారుల దర్యాప్తు తీరు గురించి వారు కవిత వద్ద ఆరా తీసినట్లు సమాచారం. అలాగే.. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే ఆమెను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ సోమవారం పిటిషన్ వేసే అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. కానీ, గతంలో దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుండడంతో అదేరోజు కోర్టు దృష్టికి తీసుకెళితే సరిపోతుందన్న అభిప్రాయానికి వారు వచ్చినట్లు సమాచారం. భేటీ ముగిసిన అనంతరం రాత్రి 8 గంటల సమయంలో వారు బయటికి వచ్చి.. మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

ఈ సారి 'గాలి మోటార్ల' హవా!

లోక్‌సభ ఎన్నికల్లో ప్రైవేటు విమానాలు, హెలికాప్టర్లకు భారీ డిమాండ్



» 2019తో పోలిస్తే 40% పెరిగే అవకాశం
» చార్టర్డ్ విమానాలకు గంటకు రూ.5.25 లక్షలు!
» హెలికాప్టర్ల అద్దె గంటకు రూ.1.5 లక్షలు
» గరిష్ఠంగా రూ.3.5 లక్షలు కూడా..!

న్యూఢిల్లీ, మార్చి 17: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు తమ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రచారాన్ని హోరెత్తించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు విమానాలు, హెలికాప్టర్లకు డిమాండ్ భారీగా పెరగనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్లకు డిమాండ్ 40 శాతం ఎక్కువగా ఉండొచ్చని చెబుతున్నారు. విమానాలతో పోలిస్తే హెలికాప్టర్లకు అత్యధిక డిమాండ్ ఉంటుందంటున్నారు. తక్కువ సమయంలో, మారుమూల ప్రాంతాలకు సైతం వెళ్లగలిగే సౌలభ్యం ఉన్నందున రాజకీయ పార్టీలు హెలికాప్టర్ల వైపే ఎక్కువగా మొగ్గుచూపుతాయని పేర్కొంటున్నారు. అతి త్వరలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో కొందరు రాజకీయ పార్టీల నేతలు ఇప్పటి నుంచే చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్లను అద్దెకు తీసుకుంటారని చెబుతున్నారు. విమానాలు, హెలికాప్టర్లకు గంటల చొప్పున అద్దె వసూలు చేస్తారు. చార్టర్డ్ విమానాలకు గంటకు రూ.4.5 నుంచి రూ.5.25 లక్షల వరకు అద్దె ఉంటుందని; హెలికాప్టర్లకు గంటకు రూ.1.5 లక్షల వరకు ఉంటుందని పరిశ్రమ నిపుణులు వెల్లడించారు. హెలికాప్టర్లకు డిమాండ్ విపరీతంగా ఉన్న సమయంలో అద్దె గంటకు రూ.3.5 లక్షల వరకూ వసూలు చేస్తారని తెలిపారు.

బీజేపీ 250 కోట్లు.. కాంగ్రెస్ 126 కోట్లు!

గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ప్రైవేటు విమానాలు, హెలికాప్టర్లకు 30-40 శాతం డిమాండ్ ఎక్కువగా ఉంటుందని బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఎండీ ఆర్.కె.బాలి చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారం 2023 డిసెంబరు నాటికి దేశంలో 112 నాన్ షెడ్యూల్డ్ ఆపరేటర్స్ (ఎన్ఎస్ఓపీ) ఉన్నారన్నారు. వీరిలో 40-50 శాతం ఆపరేటర్లు కేవలం ఒక్క విమానమే నడుపుతుంటారని తెలిపారు. ఎన్ఎస్ఓపీలకు విమానాలు, హెలికాప్టర్లు కలిపి మొత్తం 450 వరకు ఉంటాయని అన్నారు. డీజీసీఏ వద్దనున్న సమాచారం మేరకు ఈ ఆపరేటర్ల దగ్గర ఫాల్కన్ 2000, బాంబార్డియర్ గ్లోబల్ 5000, ట్విన్ ఆట్టర్ డీహెచ్‌సీ-6-300, హాకర్ బీచ్‌క్రాఫ్, గల్ఫ్‌స్ట్రీమ్ జీ-200, సెస్నా సైటేషన్ 560 ఎక్స్ఎల్, తదితర విమానాలు, హెలికాప్టర్లు ఉన్నట్లు వివరించారు. వీటిలో 10 సీట్లలోపు సామర్థ్యం ఉన్నవే ఎక్కువని తెలిపారు. రాజకీయ నాయకులు ఎక్కువగా చిన్న పట్టణాలకు కూడా వెళ్తుంటారని, ఆ సమయంలో హెలికాప్టర్లనే ఎక్కువగా అద్దెకు తీసుకుంటారని చెప్పారు. కొందరు నేతలు గంపగుత్తగా (ముందే కొన్ని గంటల పాటు) హెలికాప్టర్లను అద్దెకు తీసుకుంటారన్నారు. కాగా, 2019-20 సంవత్సరానికి గాను విమానం/హెలికాప్టర్ల ప్రయాణాలకు రూ.250 కోట్లు వెచ్చించినట్లు బీజేపీ వార్షిక ఆడిట్ గణాంకాల్లో వెల్లడించింది. ఇదేసమయంలో కాంగ్రెస్ పార్టీ ఖర్చు రూ.126 కోట్లుగా పేర్కొంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ.1.20 లక్షల కోట్ల వరకు ఉంటుందని సీనియర్ ఎన్నికల విశ్లేషకుడు ఎన్.భాస్కరరావు తెలిపారు.

ప్రజాగళం నభూతో నభవిష్యత్..: బొండా



అమరావతి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ప్రజాగళం మహాసభ నభూతో నభవిష్యత్ అన్నట్లు విజయవంతమైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఆదివారం రాత్రి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'బొప్పూడిలో జన సునామీ వచ్చిందా అనేలా ప్రజాగళం సభ సాగింది. ఇటీవల కాలంలో ఈ స్థాయి సభను ఎవరూ నిర్వహించలేదు. 300 ఎకరాల్లో సభకు ఏర్పాట్లు చేసినా స్థలం చాలక 3 రెట్ల జనం కిలోమీటర్ల కొద్దీ దారిలోనే ఉండిపోయారు. సభా స్థలానికి కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. సభకు హాజరైన జనసంద్రాన్ని చూసి, ప్రధాని మోదీ కూడా ఆశ్చర్యపోయారు. జగన్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు ఈ జన సంద్రమే సంకేతమని ప్రధాని వ్యాఖ్యానించారు. ప్రజాగళం సభ జోష్‌ని గమనించిన ప్రధాని లక్షలాది ప్రజల సాక్షిగా, ఏపీలో ఏర్పడే కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటానని హామీ ఇవ్వడం రాష్ట్ర ప్రజలకు ఎంతో ఊరట, విశ్వాసాన్ని కలుగజేసింది. ప్రజాగళం సూపర్‌సక్సెస్ కావడంతో జగన్ బృందం హతాశులయ్యారు. గత ఐదేళ్లూ రాష్ట్రంలో అభివృద్ధికి పూర్తి వ్యతిరేక వాతావరణం నెలకొందని, అవినీతిలో మంత్రులు పోటీ పడుతున్నారన్న ప్రధాని చేసిన వ్యాఖ్యలతో తాడేపల్లి ప్యాలెస్‌లో కలకలం రేగింది' అన్నారు. ప్రధాని వ్యాఖ్యలపై జగన్ బృందం అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు.

జూన్ 4న కాదు..2నే

» అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీల్లో మార్పు

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీల్లో స్వల్పంగా మార్పులు చేస్తున్నట్టు ఎలక్షన్ కమిషన్ ఆదివారం ప్రకటించింది. కేవలం ఈ రెండు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ముందుగా ప్రకటించిన విధంగా జూన్ నాలుగో తేదీన కాకుండా రెండో తేదీనే ఉంటుందని తెలిపింది. రాజ్యాంగపరమైన అవసరాల రీత్యా ఈ నిర్ణయం తీసుకొంది. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలలో ఏప్రిల్ 19న అసెంబ్లీతో పాటు, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. అన్నింటితోపాటుగానే జూన్ 4న ఫలితాలు వెలువడుతాయని షెడ్యూల్‌లో పేర్కొంది. అయితే రాజ్యాంగపరంగా చిన్న సమస్య తలెత్తడంతో ఈ తేదీల్లో మార్పులు చేసింది. ఈ రెండు అసెంబ్లీల కాలపరిమితి జూన్ 2న ముగియనుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ఆర్టికల్ 172(1), ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం అసెంబ్లీ గడువు ముగిసేలోగానే ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రక్రియను ముగించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు జూన్ 4న ఫలితాలను విడుదల చేయడం అంటే ఈ నిబంధనలను అతిక్రమించినట్టవుతుంది. దానిని దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపును రెండు రోజుల పాటు ముందుకు జరిపింది. ఈ రెండు రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మాత్రం ముందుగా ప్రకటించిన విధంగా జూన్ 4నే వెల్లడవుతాయని, అందులో ఎలాంటి మార్పులేదని స్పష్టం చేసింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దు

» అధికారులు, పార్టీలకు ఈసీ సూచనలు


న్యూఢిల్లీ, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల్లో పర్యావరణ హిత పద్ధతులు అనుసరించాలని అధికారులు, రాజకీయ పార్టీలకు ఈసీ సూచించింది. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండడం, కాగితం వాడకాన్ని వీలైనంత తగ్గించడం, కార్ల వినియోగాన్ని తగ్గించేలా 'కార్‌పూలింగ్' చేసుకోవడం, ప్రజా రవాణా వాహనాలను ఉపయోగించడం వంటివి ఈసీ చేసిన సూచనల్లో కొన్ని. వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించింది. సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను అసలు వినియోగించవద్దని స్పష్టం చేసింది. ఈ ప్లాస్టిక్‌తో తయారుచేసే పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లను ఎన్నికల ముగిసిన తర్వాత ఎక్కడికక్కడ వదిలేస్తున్నారని, ఇది సమస్యలకు దారితీస్తోందని పేర్కొంది.

ప్రధాని పదవి రేసులో లేను: గడ్కరీ


న్యూఢిల్లీ, మార్చి17: ప్రధానమంత్రి పదవి రేసులో తానులేనని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. మోదీ నాయకత్వంలో బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారం చేపడుతుందని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే మ్యాజిక్ ఫిగర్ సాధించలేకపోతే ప్రధాని పదవి రేసులో నితిన్ గడ్కరీ ఉంటారనే ఊహాగానాలపై ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విధంగా స్పందించారు. ప్రధాని రేసులో ఎప్పుడూ లేనన్న గడ్కరీ.. తాను నిజమైన బీజేపీ కార్యకర్తనని తెలిపారు. అలాగే దేవేంద్ర ఫడణవీస్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు.

గుండెపోటుతో అత్త.. ఆమె మరణాన్ని తట్టుకోలేక కోడలు మృతి

» గంటల వ్యవధిలో ఇద్దరి మరణం
» తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



భారతమ్మ(ఫైల్)



మంగమ్మ(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 17: ఏ ఇంట్లోనైనా సరే అత్తాకోడళ్ల ప్రస్తావన వచ్చిందంటే వారి మధ్య జరిగే గొడవలే ముందుగా గుర్తుకు వస్తాయి. కానీ, ఓ ఇంట్లో మాత్రం అత్తగారి అకాల మరణాన్ని తట్టుకోలేకపోయిన కోడలు.. ఆమె వెంటే లోకాన్ని వీడింది. గంటల వ్యవధిలో అత్తాకోడళ్ల మరణించిన ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం జరిగింది. యాదగిరిగుట్ట మండలం దాతరుపల్లి మధిర పంచాయతీ పరిధి గొల్లగుడిసె గ్రామానికి చెందిన అత్తాకోడళ్లు చుక్కల భారతమ్మ(65), చుక్కల మంగమ్మ(26) గంటల తేడాలో కన్నుమూశారు. భారతమ్మకు ఇద్దరు కుమారులు కాగా మంగమ్మ చిన్న కొడుకు భార్య. అయితే, భువనగిరి మండలం రాయిగిరి గ్రామంలో ఉన్న తన తల్లి ఓ గొడవలో గాయపడడంతో పరామర్శించేందుకు భారతమ్మ శనివారం వెళ్లింది. రాత్రి అక్కడే నిద్రించింది. అయితే, ఆదివారం ఉదయం నాలుగు గంటల సమయంలో భారతమ్మ గుండెపోటుతో మరణించింది. భారతమ్మ మృతదేహాన్ని వెంటనే స్వగ్రామం గొల్లగుడిసెకు తరలించారు. అయితే, భారతమ్మ మృతదేహం వద్ద ఏడుస్తున్న మంగమ్మ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులు ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కన్నుమూసింది. దీంతో గంటల వ్యవధిలో ఆ ఇంట్లో ఇద్దరు మరణించారు. మంగమ్మకు భర్త , కొడుకు, కూతురు ఉన్నారు.



పొడవైన దోసె తయారీలో సిబ్బంది

123 అడుగుల దోసె..

» గిన్నిస్ రికార్డ్సులో చోటు



బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపొడవైన దోసెను తయారు చేసి బెంగళూరులోని ఎంటీఆర్ హోటల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చేరింది. ఎంటీఆర్ హోటల్ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శనివారం నగరంలో 123 అడుగుల పొడవైన దోసెను తయారుచేశారు. బెంగళూరులోని బొమ్మసంద్ర కిచెన్ ఫ్యాక్టరీలో 75 మంది వంట సిబ్బంది ఇందులో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎంటీఆర్ హోటల్ సీఈఓ సునయ్‌భాసిన్ మాట్లాడుతూ.. 100 అడుగుల దోసె తయారు చేయాలని భావించామని, అయితే 123 అడుగుల పొడవైన దోసెను తయారు చేశామన్నారు. ఇందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు.